అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సోమవారం 26-2-2024
సంపుటి : 10 | సంచిక : 56 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



కస్టడీలో లైంగిక దాడులు

యూపీ, ఎంపీలోనే అధికం : ఎన్‌సీఆర్‌బీ వెల్లడి



న్యూఢిల్లీ : కస్టడీలో ఉన్న మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వెల్లడించింది. 2017 నుండి 2022 వరకూ ఇలాంటి 270 కేసులు నమోదయ్యాయని తెలిపింది. చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలలో సున్నితత్వం, జవాబుదారీతనం కొరవడడమే దీనికి కారణమని మహిళా హక్కుల ...13లో

రాహుల్ యాత్రకు అఖిలేశ్ మద్దతు

వీస్తున్న మార్పు పవనాలు

- అగ్రాలో జోరుగా సాగిన రాహుల్ యాత్ర

లక్నో : ఉత్తరప్రదేశ్ మార్పునకు సిద్ధమైందని, మార్పు పవనాలు వీస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ఆదివారం నాడు ఉత్తరప్రదేశ్‌లోని అగ్రాలోకి ప్రవేశించింది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత రాహుల్ యాత్రకు ...13లో

వైవిధ్య భారత్‌ను కాపాడుకుందాం

దేశాన్ని తిరోగమనం పట్టిస్తున్న బీజేపీని ఓడిద్దాం

- 'రాజ్యాంగం - జాతి ఐక్యత' సదస్సులో వక్తలు



బెంగళూరు : మనువాద భావజాలంతో 'హిందూ రాష్ట్ర'గా మార్చేందుకు ప్రయత్నిస్తూ దేశాన్ని తిరోగమనం పట్టిస్తున్న బీజేపీని ఓడించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భారతదేశ విశిష్ట లక్షణమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, ...6లో

పార్లమెంటులో ప్రశ్నించాలంటే..

గులాబీ జెండా ఎగరాలి

దాడులకు భయపడేది లేదు

- ఇటుకలతో దాడి చేస్తే.. రాళ్లతో ప్రతిఘటిస్తాం
- నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవ తెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి /అచ్చంపేట

తెలంగాణ నిధులపై పార్లమెంటులో ప్రశ్నించాలంటే రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గాలన్నింటిలో బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్ కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహించారు. ఆయా సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం ఉంది కదాని విర్రవీగుతూ ఇటుకలతో దాడి చేస్తోందని, దానిని మేము ప్రతిఘటిస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుకోకుండా అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ...13లో



ఆధార్ దందా..!

- మొదట ఫ్రీ...ఆ తర్వాత చార్జీల బాదుడు
- ఆన్‌లైన్‌లో ఫ్రీ అంటూ...సర్వీస్ చార్జి పేరుతో మళ్లీ వసూళ్లు
- కోట్లాదిమంది ప్రజల్ని దోచేస్తున్న మోడీ సర్కార్

ఇక్కడ ఏదీ ఉచితం కాదు...

రిలయన్స్ ఫోన్ల దందా గుర్తుందా? నూనె ప్యాకెట్ కొంటే మొబైల్ ఫోన్ ఫ్రీ... సూపర్ మార్కెట్లో బిల్లు చేస్తే మొబైల్ ఫ్రీ...పెట్రోల్ పోయించుకుంటే మొబైల్ ఫ్రీ....రిలయన్స్ సంస్థ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొనేందుకు ప్రజలకు ముందు 'ఉచితం' అంటూ ఎరవేసి, వారికి ఆ ఫోన్లు అలవాటయ్యాక, ఇప్పుడు టారిఫ్ రేట్లను ఇష్టం వచ్చినట్టు పెంచేసి, జనం జేబుల్ని లూటీ చేస్తున్న విషయం స్ఫురణకు వస్తున్నదా? గతంలో ఔట్ గోయింగే కాదు...ఇన్ కమింగ్‌కూ చార్జీ పడేది. ఇప్పుడు అసలు ఫోన్ ఆన్ అవ్వాలన్నా రీచార్జి చేసుకోవాల్సిందే. ఆధార్ గురించి చెప్తూ...ఇప్పుడీ ఫోన్ల గోల ఎందుకనుకుంటున్నారా? కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అచ్చం రియలన్స్ ఫోన్ల తరహాలోనే ఆధార్ దందా చేస్తున్నది. అప్పట్లో ఆధార్ కార్డు ఉచితం అనీ, అది ఉంటే జనం ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేస్తుందనే రకరకాల పుకార్లతో ప్రజల్ని ఆధార్ కార్డు తీసుకొనేలా ప్రోత్సహించింది. ఇప్పుడు అదే ఆధార్ కార్డులో ఏ చిన్న కరెక్షన్ చేసుకోవాలన్నా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యునిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ప్రజల ముక్కు పిండి పైసలు వసూలు చేస్తున్నది. పైపెచ్చు చార్జీలనూ తన ఇష్టం వచ్చినట్టు పెంచేసి, జనం జేబులకు చిల్లు పెడుతున్నది.



కోట్ల రూపాయలు వసూలు

ఆధార్ కరెక్షన్స్ పేరుతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల నుంచి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నది. ప్రతి ఏడాదీ ఈ దోపిడీ రెట్టింపే అవుతున్నది. 2009-10 నుంచి 2021-22 వరకు యూఐఏఐ (ఆధార్) వార్షిక లెక్కల్లో ఆదాయం గణనీయంగా పెరుగుతున్నట్టు గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కేవలం ఆధార్ సేవల ద్వారా యూఐఏఐకి వచ్చిన ఆదాయం అక్షరాలా రూ.387.41 కోట్లు. 2009-10లో ఈ సంస్థ చేసిన ఖర్చు కేవలం రూ.26.21 కోట్లే. ఇదీ ఆధార్ దోపిడీ.

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

దేశంలోని 143.71 కోట్ల మంది ప్రజలకు ఆధార్ కార్డును (అ)నిత్యవసరంగా మార్చేసింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు ఈ కార్డు ద్వారా ప్రజలతో వ్యాపారం చేస్తున్నది. అన్ని ప్రభుత్వ పథకాలు, ఆర్థిక లావాదేవీల్లో ఆధార్ తప్పనిసరి. చివరకు ఆహార భద్రతా కార్డులు మొదలు ఆస్తుల అమ్మకం, కొనుగోళ్లు కూడా ఆధార్ లేకుండా జరిగే పరిస్థితి లేదు. తెలంగాణలో ఇటీవల 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. దీనికి ఆధార్ కార్డును ప్రామాణికంగా నిర్ణయించారు. అయితే అప్పుడెప్పుడో పదేండ్ల క్రితం దిగిన ఆధార్ కార్డులు చెల్లవనీ, కొత్తగా కార్డుల్ని అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. దీనితో ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్లు, కండక్టర్లతో మహిళా ...2లో



బీఆర్ఎస్‌కు తీగల కుటుంబం గుడ్‌బై

అక్కడ కుటుంబానికి తప్ప నాయకులకు ప్రాధాన్యత లేదు : మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

- స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వని బీఆర్ఎస్ : రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి
- ఈ నెల 27న కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ - మీర్ పేట్

బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులకు తప్ప ఇతర నాయకులకు ప్రాధాన్యత లేదని, స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిందని రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ...13లో



కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్

వివరాలు 3లో..

విచారణకు ఇప్పట్లో హాజరు కాలేను

సుప్రీంకోర్టులో కేసుండగా ఎలా పిలుస్తారు : సీబీఐకి ఎమ్మెల్సీ కవిత లేఖ



వివరాలు 13లో

లోకో పైలట్ లేకుండానే..

పట్టాలపై 80 కిలో మీటర్లు గూడ్స్ రైలు పరుగులు



చండీగఢ్: లోకో పైలట్ లేకుండానే ఒక గూడ్స్ రైలు పట్టాలపై పరుగులు తీసింది. వంద కిలోమీటర్ల వేగంతో సుమారు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. ఇది చూసి అంతా షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రైలు సిబ్బంది డ్యూటీ మారేందుకు జమ్ముకాశ్మీర్‌లోని కథువా స్టేషన్‌లో గూడ్స్ రైలును ఆపారు. హ్యాండ్ బ్రేక్ వేయడం మరిచిన లోకో పైలట్, కో పైలట్ రైలు ఇంజిన్ నుంచి కిందకు దిగారు. అయితే ...13లో

సుదర్శన్ సేతును ప్రారంభించిన ప్రధాని మోడీ

దేశంలో అతి అతిపొడవైన కేబుల్ బ్రిడ్జి



ద్వారక: దేశంలోనే అతిపొడవైన కేబుల్ బ్రిడ్జిని ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. గుజరాత్‌లోని ద్వారకలో ఈ వంతెనను నిర్మించారు. మొత్తం 2.3 కిలోమీటర్ల పొడవున్న దీనికి 'సుదర్శన్ సేతు' అని పేరు పెట్టారు. ఇది ఓఖా ప్రాంతాన్ని బెట్ ద్వారక తో అనుసంధానిస్తుంది.

ఈ వంతెన నిర్మాణానికి 2017 అక్టోబర్‌లో ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.979 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. 27.20 మీటర్ల వెడల్పుతో, 2.3 కిలోమీటర్ల పొడవు, నాలుగు లేన్లతో ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ బ్రిడ్జ్‌కు ఇరువైపులా 2.5 మీటర్ల వెడల్పైన ఫుట్‌పాత్‌లు కూడా ఉన్నాయి. సుదర్శన్ సేతును ఒక ప్రత్యేకమైన డిజైన్‌తో నిర్మించారు. బ్రిడ్జ్ ఇరువైపులా భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణుడి చిత్రాలు ఉంచారు. అంతేగాక నీట మునిగిన పౌరాణిక ప్రాశస్త్య నగరం ద్వారకను సందర్శించారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు మత రాజకీయం కోసమే మోడీ ఈ ఫీట్లు చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కే శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం. హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. రెండేండ్ల పాటు ఆయన పదవీలో కొనసాగుతారు. గతంలో విశాలాంధ్ర, మన తెలంగాణ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. ప్రస్తుతం ప్రజాపక్షం ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ముగ్గురు మావోయిస్టులు మృతి



రాయ్‌గఢ్ : అడవితల్లి మరోమారు రక్తమోడింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం ఉదయం జవాన్లకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదు రుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఈ విషయాన్ని కాంకేర్ పోలీస్ సూపరింటెండెంట్ ఇందిరా కళ్యాణి ఎలెసెలా తెలిపారు. కోయలిబెడ పోలీసు స్టేషన్ పరిధిలో భోమ్రా-హుర్తరై గ్రామా లకు సమీపంలోని అటవీ ప్రాంతంలో డ్రిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ), సరిహద్దు భద్రత బలగాలు (బీఎస్ఎఫ్)కు చెందిన జవాన్లు.. మావోయిస్టు వ్యతిరేక ...13లో

దిగొచ్చిన యోగి సర్కారు

- కానిస్టేబుల్ పరీక్ష రద్దు
- ఇది విద్యార్థులు, యువత విజయం : రాహుల్



లక్నో : యూపీలోని యోగి సర్కారు దిగొచ్చింది. పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ కేసులో అభ్యర్థుల ధర్నాతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కానిస్టేబుల్ పరీక్షను రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈనెల 17, 18 తేదీలలో యూపీలో పోలీస్ కానిస్టేబుల్ ...13లో

గ్రామీణ ఖర్చు పెరిగింది

ఆదాయం మాత్రం అంతంతే

- ఆందోళన కలిగిస్తున్న ఆహార వ్యయం తగ్గుదల
- కుటుంబ వినియోగ వ్యయ సర్వే వెల్లడి



గత పదకొండు సంవత్సరాలలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో వినియోగ వ్యయం బాగా పెరిగింది. అయితే ఆహారంపై వ్యయం మాత్రం తగ్గింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఆదాయం పెరగకపోయినా ఖర్చు మాత్రం పెరుగుతుండడంతో ప్రజలపై మోయలేని భారం పడుతోంది. గత దశాబ్ద కాలంగా దేశంలో ప్రజల ఆదాయాలలో పెద్దగా మార్పు రాలేదు. పైగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి కారణాలతో అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. అదే సమయంలో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా వినియోగ వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఓ వైపు సరైన ఆదాయం లేకపోవడం, మరోవైపు ఖర్చులు పెరగడంతో సగటు మధ్యతరగతి ప్రజానీకం కోలుకోలేని దెబ్బ తింటోంది. కోవిడ్ కారణంగా తగిలిన దెబ్బ నుండి పేదలు, మధ్య తరగతి ప్రజలు ఇప్పటికీ కోలుకోలేదు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులు మాత్రం లాభాలు మూటకట్టుకున్నారు.

న్యూఢిల్లీ : 2022-23 సంవత్సరానికి సంబంధించి గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ శనివారం తాజా కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్)ను విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతంలో నివసించే వ్యక్తి 2022-23లో నెలకు సగటున రూ.3,773 ఖర్చు చేశాడు. 2011-12లో ఈ వ్యయం కేవలం రూ.1,430 మాత్రమే. అంటే 164 శాతం పెరిగిందన్న మాట. అదే పట్టణ ప్రాంతంలో నివసించే వ్యక్తి చేసిన వ్యయం ఆ కాలంలో రూ.2,630 నుండి రూ.6,459కి పెరిగినా 146 శాతం పెరుగుదల మాత్రమే కన్పిస్తోంది. కుటుంబ వినియోగ వ్యయ సర్వేలను ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. 2017 జూలై-2018 జూన్ మధ్య జరిపిన 75వ రౌండ్ సర్వే ఫలితాలను ప్రభుత్వం విడుదల ...3లో



తిండి కంటే ఇతర ఖర్చులే ఎక్కువ

కలవరపెడుతున్న అద్దెలు

వివరాలు 3లో

పోలీస్ అధికారులు.. మీ సేవలకు సలాం..



నవతెలంగాణ - ములుగు/తాడ్వాయి

విధి నిర్వహణలో కఠినంగా ఉండే కాకీలు.. కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించేందుకు ప్రాణాలు లెక్క చేయకుండా సహాయం చేస్తారని ఈ సంఘటన రుజువు చేస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ పట్టణానికి చెందిన రోహిత్ లాల్ (21) ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరకు వచ్చి చిలకలగుట్ట వెనుక భాగంలోని దయ్యాల మడుగు ప్రదేశంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సమాచారం అందుకున్న సీసీఎస్ సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్బీఐ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కానిస్టేబుల్ శంకర్ ప్రాణాలకు తెగించి రెండు గంటలపాటు మృతదేహం కోసం ముమ్మరంగా గాలించి ఎట్టకేలకు మృతుడిని గుర్తించారు. సంఘటనా స్థలానికి వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రెండు కిలోమీటర్ల మేర స్వయంగా మోస్తూ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు చేసిన సాహసం, సహాయం ప్రతి ఒక్కరి అభినందనలు అందుకుంది. కాగా మృతదేహాన్ని అందుకున్న బంధువులు.. పోలీస్ అధికారులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఏదిఏమైనా పోలీస్ అధికారుల పనితీరు, కష్ట సమయంలో చూపిన మానవత్వం అందరి మన్ననలను అందుకుంది.

ఎంపీ అభ్యర్థులు ఖరారు కాలేదు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీచేసే అభ్యర్థుల ఎంపికపై ఇప్పటివరకూ పార్లమెంటరీ బోర్డుగానీ, ఎన్నికల కమిటీగానీ సమావేశాలు నిర్వహించలేదనీ, అభ్యర్థుల లిస్టు ఖరారు కాలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ అభ్యర్థుల ఎంపిక జరిగినట్టుగా మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ పార్టీలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై పార్లమెంటరీబోర్డు, ఎన్నికల కమిటీలో చర్చించిన తర్వాతనే ప్రజాస్వామ్యయుత పద్ధతిలో జరుగుతుందని స్పష్టం చేశారు.

గుండెపోటుతో కాంగ్రెస్ ఎమ్మెల్యే మృతి



బెంగళూరు : కర్నాటక కాంగ్రెస్ పార్టీలో విషాదం చోటుచేసుకుంది. కర్ణాటకలోని సురపుర నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ (67) మరణించారు. ఆదివారం ఉదయం గుండెపోటుతో బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయన మృతి పట్ల కర్నాటక తుది శ్వాస విడిచారు. తమ పార్టీ సహచరుడి మృతి పట్ల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంతాపం తెలిపారు. నెల రోజుల క్రితమే రాజా వెంకటప్ప నాయక్ గిడ్డంగుల కార్పొరేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. నాయక్ 1994,1999, 2013లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో మొదటి సారిగా జనతాదళ్‌కు చెందిన శివన్న మంగీహాల్‌పపై పోటీ చేసి విజయం సాధించారు.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులను అరెస్ట్ చేసిన బెంగాల్ పోలీసులు




కోల్‌కతా : సందేశ్‌ఖలీ వెళ్తున్న నిజనిర్ధారణ కమిటీ సభ్యులను ఆదివారం బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని భోజెర్‌హట్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు. కమిటీలోని ఆరుగురు సభ్యులను అరెస్ట్ చేశారని, అరెస్ట్ తర్వాత వారిని పిహెచ్‌క్యూ సభ్యులను లాల్‌బజార్ కోల్‌కతాకు తీసుకువచ్చారు. ఈ కమిటీలో ఈ బృందంలో ఒపి వ్యాస్, పాట్నా హైకోర్టు మాజీ సిజె జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి రాజ్‌పాల్‌సింగ్, నేషనల్ ఉమెన్ కమిషన్ మాజీ సభ్యురాలు చారు వలి కన్నా, న్యాయవాది భావ్‌నా బజాజ్‌లు ఉన్నారు. పోలీసుల అరెస్టును ఖండిస్తూ నిజనిర్ధారణ కమిటీ సభ్యులంతా ధర్నా చేపట్టారు.

బోజెర్‌హట్ దాటి వెళ్లవద్దని కమిటీ సభ్యులను అభ్యర్థించామని, కానీ వారు చట్ట విరుద్ధంగా బారికేడ్‌ను బద్దలు కొట్టేందుకు యత్నించారని కోల్‌కతా పోలీస్, భాంగర్ డివిజన్, డిప్యూటీ కమిషనర్ సైకత్ ఘోష్ పేర్కొన్నారు. శాంతికి విఘాతం కలిగిస్తున్నారన్న కారణంతో ముందస్తు అరెస్టు చేసినట్టు తెలిపారు.

తాము సందేశ్‌ఖలీకి వెళ్లి బాధిత మహిళలతో మాట్లాడాలనుకున్నామని, కానీ పోలీసులు వెళ్లనివ్వకుండా తమని అరెస్ట్ చేశారని నిజనిర్ధారణ కమిటీ సభ్యురాలు చారుకన్నా తెలిపారు. సెక్షన్ 144ను ఉల్లంఘించబోమని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదని అన్నారు.

కాగా, పశ్చిమబెంగాల్లోని సందేశ్‌ఖాలీలో టీఎంసీ నేత షాజహాన్ షేక్, అతని అనుచరులు తమపై లైంగిక దాడులు చేసేందుకు, తమ భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని అక్కడి మహిళలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే.

ఈ సీజన్‌లో 42లక్షలకుపైగా పెండ్లిండ్లు..! రూ.5.5లక్షల కోట్ల వ్యాపారం..



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా భారీగా పెండ్లిండ్లు జరుగుతున్నాయి. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 42లక్షలకుపైగా వివాహాలు జరుగనున్నట్టు అంచనా. ఇందులో దేశ రాజధాని ఢిల్లీలోనే నాలుగు లక్షకుపైగా వివాహాలు జరుగుతాయని అంచనా. వివాహ వేడుకల నేపథ్యంలో రూ.5.5లక్షల కోట్లకుపైగా వ్యాపారం జరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. పెండ్లి బట్టలు, బంగారు ఆభరణాలు, వాహనాలతో పాటు పెండ్లిండ్ల భోజనాలకు సంబంధించి భారీగా డిమాండ్ సష్టిస్తుందని అంచనా వేస్తున్నారు. దాంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ నిత్యవసర సరుకుల వస్తువులకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత పెండ్లిండ్ల సీజన్‌లో జూలై 15 వరకు దేశవ్యాప్తంగా దాదాపు 42 లక్షల వివాహాలు జరగనున్నాయి.

రాజ్యాల విస్తరణకే యుద్ధాలు

మతాల కోసం కాదు చరిత్రకు సంఘ్, ముస్లింలీగ్ వక్రీకరణలు

- శివాజీ భారతజాతికి సింబల్ : ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ రాం పునియాని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజుల మధ్య జరిగిన యుద్ధాలు ఆయా రాజ్యాల విస్తరణ కోసం జరిగినవే తప్ప ఆ రాజుల వ్యక్తిగత మతాల విస్తరణకు జరిగినవి కావని ముంబై ఐఐటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ రాం పునియాని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ కుమార్ సమన్వయంతో "ఛత్రపతి శివాజీని ఎందుకు స్మరించుకోవాలి?" అనే అంశంపై ఆదివారం నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ్ పరివార్, ముస్లింలీగ్, హిందూ మహాసభ తదితర సంస్థలు వక్రీకరణలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనుస్మృతిని తిరిగి అమల్లోకి తెచ్చి బ్రాహ్మణీయ ఆధిక్యతతో తమ పెత్తనం కొనసాగించేందుకు బీజేపీ పరమత ద్వేషం పెంచుతున్నదని విమర్శించారు. శాస్త్రీయత లేకుండా మూఢనమ్మకాలతో నిండిన సమాజాన్ని తయారు చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఛత్రపతి శివాజీతో పాటు అక్బర్, మహారాణా ప్రతాప్ తదితర రాజులకు వారి పేర్లను బట్టి ఆయా మతాలకు ఆ రాజులను చిహ్నాలుగా చూపిస్తున్నారని విమర్శించారు. అయితే ఆ రాజులు ఏ మతాలకు చెందిన వారైనా... వారి సైన్యంలో హిందువులు, ముస్లింలు ఉన్నారని గుర్తుచేశారు. ఇలాంటి విషయాలను పక్కన పెట్టి ఘర్‌వాపసీ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ హింసను ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. ముస్లింలుగా, క్రైస్తవులుగా హిందువులు మారడానికి సంఘ్ ప్రచారం చేస్తున్న రాజుల పాలన కారణం కాదనీ, హిందూమతంలో ఉన్న కులవ్యవస్థ, అంటరానితనమేనని స్పష్టం చేశారు. అరబ్ దేశాల నుంచి సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసుకునేందుకు కేరళ మల్ బార్ వచ్చిన వారితో మొదటిసారి అక్కడి హిందువులు ఇస్లాంను స్వీకరించారని తెలిపారు. అదే విధంగా మరి కొందరు హిందువులు క్రైస్తవంలోకి వెళ్లారని తెలిపారు. ఛత్రపతి శివాజీ గొప్ప విలువలతో కూడిన రాజు అని తెలిపారు. ఆ కాలంలో హిందూ జాతీయవాద భావనే లేదనీ, కేవలం నేటి పాలకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నాటి రాజులకు ఈ భావనను అంటగడుతున్నారని కొట్టిపారేశారు. మత రాజకీయ జాడ్యం పాకిస్తాన్, ఉత్తర భారతదేశంలో ఆందోళనకరస్థాయిలో పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమం, మతాలకు అతీతంగా అందరినీ సమానంగా పాలించిన శివాజీని హిందూ జాతీయవాదిగా చిత్రీకరిస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శివాజీ పాలనలో అనేక మంచి నిర్ణయాలను తీసుకున్నారని తెలిపారు. యుద్ధం జరుగుతున్న సమయంలో, సైన్యం ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న సందర్భంలో అక్కడ పంట పొలాలకు నష్టం కలిగించవద్దని తన సైన్యాన్ని ఆదేశించారని చెప్పారు. గ్రామాల స్థాయిలో పంటలపై ఇష్టానుసారంగా వేసే పన్నుల విధానాన్ని రద్దు చేసి హేతుబద్ధీకరించిన రైతు శ్రేయోభిలాషి శివాజీ అని కొనియాడారు. యుద్ధం గెలిచిన సమయంలో ఇతర మతాలకు చెందిన మహిళలను బందీలుగా తీసుకొస్తే తన సైన్యాన్ని శిక్షించి ఆ మహిళలను తన తల్లులతో సమానమని చెప్పిన గొప్ప వ్యక్తి శివాజీ అని గుర్తుచేశారు.

రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఢిల్లీ రైతు పోరాటం స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలి : ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధు ప్రసాద్, అనిత రాంపాల్
- 'భారత్ బచావో' అఖిల భారత విద్యార్థుల సదస్సు



నవతెలంగాణ - ముషీరాబాద్

రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వాక్ స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం హరిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'భారత్ బచావో' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే అఖిల భారత విద్యార్థుల సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కులు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న వారిపై పోలీసులు లాఠీలు ఝుళిపించారని, వారిని అరెస్టు చేసి జైళ్ళలో నిర్బంధించారన్నారు. ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమే అన్నారు. సామ్రాజ్య వాదం, ఫాసిజం ఎదుర్కొనేందుకు అందరూ సమిష్టిగా పోరాటం నిర్వహించాలని నొక్కి చెప్పారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధు ప్రసాద్ మాట్లాడుతూ. దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లు వారిపై లైంగిక దాడులు జరుగుతున్నాయని నిరసన తెలిపితే పాలకులు నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతని పక్షం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాలే కాక యూనివర్సిటీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని జైలుకు పంపుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ అనిత రాంపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గళమెత్తిన వారిపై నిర్బంధం ప్రయోగించినట్టుగానే విశ్వవిద్యాలయాల్లో హక్కుల కోసం ఉద్యమిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులపైనా తీవ్రమైన అణచివేత ప్రయోగిస్తున్నారన్నారు. భారత విద్యా వ్యవస్థ ప్రమాదంలో ఉందన్నారు.

బీజేపీ ప్రభుత్వం అమలుచేయాలని చూస్తున్న నూతన విద్యా విధానం 2020 ద్వారా విద్యలో మత, మూఢ విశ్వాసాలను చొప్పించే ప్రమాదముందన్నారు. విద్యలో మత విశ్వాసాల చొరబాటు ప్రజాస్వామిక, లౌకిక సమాజ మనుగడకు విఘాతమని తెలిపారు. దేశంలో విద్యా పరిరక్షణ కోసం బలమైన ఉద్యమాలు జరగాలని, ఆ పోరాటాలకు ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమమే స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. అన్నదాతల పోరాటం స్ఫూర్తితో నేటి విద్యార్థులకు తక్షణమే ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు కె గోవర్ధన్, జీ ఝాన్సీ, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, జస్టిస్ కోల్సే పాటిల్, భారత్ బచావో నేతలు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎమ్. ఎఫ్. గోపీనాథ్, జంజర్ల రమేశ్ బాబు, వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థి నేతలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేసి నల్లగొండ జిల్లాలోని పరివాహక ప్రాంత గ్రామాలకు తాగు నీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం లేఖ రాశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ప్రారంభమైందని పేర్కొన్నారు. చెరువులు పూర్తిగా ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. మంచి బోర్లు ఎండిపోయి తాగు నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు కూడా గ్రామాలకు రావడం లేదని తెలిపారు. ఇటీవల సాగర్ నుంచి ఖమ్మం జిల్లా, పాలేరు ప్రాజెక్టుకు ముందు జాగ్రత్తగా నీరు విడుదల చేశారనీ, నల్లగొండ జిల్లా, సాగర్ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లోని చెరువులకు కూడా నీరు విడుదల చేసి నింపినట్లయితే ఆ ప్రాంతాల్లో భూగర్భ జలాల లభ్యత పెరుగుతుందని తెలిపారు. దీంతో చేతి పంపు బోర్ల ద్వారా తాగు నీటి సౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుందని సూచించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాకు రూ. కోటి విడుదల చేసినా, బోర్లు ఎండిపోయినందున అట్టి నిధులను పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఉండదని పేర్కొన్నారు. నిండు వేసవిలో పరిస్థితి మరింత తీవ్రత ఏర్పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నల్లగొండ జిల్లా, నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుండి పరివాహక ప్రాంతంలోని చెరువులను నింపాలనీ, తద్వారా భూగర్భ జలాల నీటి లభ్యతతో చేతి పంపు బోర్ల ద్వారా ప్రజలకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని లేఖ ద్వారా సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఆధార్ దందా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణీకుల గొడవలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై మహిళలు ఆధార్ అప్‌డేట్ కోసం మీ సేవా కేంద్రాలు, పోస్టాఫీసుల్లో బారులు తీరారు. ఆధార్‌ను సులభతరం చేయడం మానేసి, ఒక దానికి మరో ధృవీకరణ పత్రాన్ని ప్రామాణికంగా చేర్చడంతో ప్రజలు వాటికోసం ఎమ్మార్వో ఆఫీసులు, మున్సిపల్ వార్డు కార్యాలయాలు, గ్రామ పంచాయతీ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొట్టక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఆధార్‌లో చిరునామా మార్పు చేసుకోవాలంటే ఎమ్మార్వో ఆఫీసు నుంచి నివాస ధృవీకరణ పత్రం తేవాలని షరతు విధించారు. పేరు మార్పు కోసం నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. చనిపోయిన వ్యక్తుల పేర్ల ఆస్తులు ఉంటే, దస్తావేజుల్లో ఉన్న పేరే ఆధార్‌లోనూ ఉండాలనే నిబంధనతో వారసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ పెన్షనర్లూ కష్టాలను ఎదుర్కొంటున్నారు. అప్పుడెప్పుడో ఉద్యోగాల్లో చేరినప్పుడు రాసిన పేర్లతో పోల్చినప్పుడు ఆధార్ కార్డులో ఏ చిన్న అక్షరం తేడా వచ్చినా పెన్షన్‌ను నిలిపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నాపేరు మాధవీ లత. భర్త బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తూ మరణించారు. ఆయన తన ఆఫీసు పత్రాల్లో నామినీ పేరు 'మాధవి' అని రాసారట... నా ఆధార్‌కార్డులో మాధవీలత అని ఉంది. దీనితో ఆ కార్డును సరిచేసుకొస్తేనే పెన్షన్ మంజూరు చేస్తామని అధికారులు కొర్రీ పెట్టారు. చాలా సార్లు మీ సేవా కేంద్రానికి వెళ్లాను. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా, రిజెక్ట్ చేస్తున్నట్టే వస్తుంది. దీనితో మీసేవా కేంద్రం వాళ్లుఅమీర్‌పేటలోని యూఐఏఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడికి వెళ్తే ఇవాళ రేపు అని మూడు నెలలుగా తిప్పుతున్నారు" అని ఓ బాధితురాలు 'నవతెలంగాణ'తో వాపోయింది.

ఉచితం లేదు...

ఆధార్ కార్డులో సవరణలు ఏవీ ఉచితం కాదు. అడ్రస్ మార్పు మొదలు, మొబైల్ నెంబర్ యాడ్ చేయించుకున్నా డబ్బులు చెల్లించాల్సిందే. కానీ ఆధార్ వెబ్‌సైట్‌లో మాత్రం కొన్ని రకాల సేవలు ఉచితం అని దర్శనమిస్తున్నాయి. ఆధార్ కేంద్రాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సేవలు పొందవచ్చని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. అయితే ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల్లో 60 శాతానికి పైగా రిజెక్ట్ అవుతున్నాయని బాధితులు చెప్తున్నారు. మీ సేవా కేంద్రమైనా, ఆన్‌లైన్ అయినా ఒకసారి దరఖాస్తు చేసినప్పుడు అది రిజెక్ట్ అయితే, మరోసారి దరఖాస్తు చేసుకుంటే మళ్లీ డబ్బు చెల్లించాల్సిందే. ఈ విధంగా కుటుంబసభ్యుల ఆధార్ కరెక్షన్స్ కోసం వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందని రుత్విక్ అనే యువకుడు వాపోయాడు.

చార్జీల పెంపు

గతంలో ఆధార్ కార్డు నమోదు సమయంలో కేవైసీ చేసుకోవాల్సి వస్తే రూ.30 చార్జి చేసేవారు. ఆ మధ్య దాన్ని రూ.50కి పెంచారు. తాజాగా ఈ చార్జీని రూ.100కి పెంచారు. చిరునామా మార్పు, పుట్టిన తేదీ, పేరు మార్పు, ఫోన్ నెంబర్ మార్పులు వంటి సేవలకు ఆధార్ వెబ్‌సైట్ ద్వారా స్వయంగా చేసుకుంటే రూ.50 చెల్లించాలి. మీసేవా ప్రయివేటు ఫ్రాంచైజ్ కేంద్రాల్లో ఈ చార్జీలను ఇష్టం వచ్చినట్టు వసూలు చేస్తున్నారు. జనాభా నవీకరణ



(డెమోగ్రఫిక్ అప్‌డేట్) పేరుతో ఫోటో గుర్తింపు, బయోమెట్రిక్, ఐరిస్ వంటి సేవల చార్జీని రూ.100కి పెంచారు. ఈ సేవలన్నీ ఒకేసారి అప్‌డేట్ కావు. డెమోగ్రఫిక్ అప్‌డేట్ అయ్యేందుకు కనీసం 15 రోజులు సమయం పడుతుంది. ఆ తర్వాత మళ్లీ డబ్బు చెల్లించి, అడ్రస్ మార్పు, మొబైల్ నెంబర్ కూర్పు వంటి సేవల్ని పొందాల్సి ఉంటుంది. దీనితో ప్రజలు పలుమార్లు యూఐఏఐకి డబ్బు చెల్లించి, సేవల్ని పొందాల్సి వస్తున్నది. ఏ కారణంగా ఆధార్ అప్‌డేట్ దరఖాస్తు రిజెక్ట్ అయ్యిందో యూఐఏఐ ఎలాంటి వివరణ ఇవ్వట్లేదు. దీనితో తలపట్టుకోవడం, మళ్లీ మళ్లీ డబ్బులు చెల్లించి దరఖాస్తులు చేసుకోవడమే ప్రజలకు సరిపోతుంది. దీనివల్ల సమయంతో పాటు ఆర్థికంగానూ జనం నష్టపోతున్నారు. దేశంలోని ప్రజలందరిదీ ఇదే పరిస్థితి. తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మితోపాటు గృహలక్ష్మి పేరుతో రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి అన్ని సేవలకూ ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో ప్రజలకు తిప్పలు తప్పట్లేదు.

కేంద్రాల కుదింపు

కేంద్ర ప్రభుత్వం ఆధార్ కేంద్రాల సంఖ్యను గణనీయంగా తగ్గించేసింది. గతంలో జాతీయ బ్యాంకులు సహా పలు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఉండేవి. తాజాగా వీటన్నింటినీ తీసేసింది. రాష్ట్ర జనాభా 4 కోట్లకు పైగానే ఉంది. వారందరికీ ఆధార్ తప్పనిసరి. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న ఆధార్ నమోదు కేంద్రాలు కేవలం 2,376 మాత్రమే ఉన్నాయి. వీటిలోనూ అన్ని సేవలు ఒకేచోట లభించవు. డెమోగ్రఫిక్ అప్‌డేట్స్ ఒక చోట ఉంటే, ఎన్‌రోల్‌మెంట్, కరెక్షన్స్ వంటి సేవలు మరోచోట ఉన్నాయి. ఏ ఆధార్ కేంద్రానికి వెళ్లినా వందల్లో ప్రజలు క్యూలైన్లలో కనిపిస్తున్నారు.

అంతా ఉత్తిదే...

తాజాగా ఆధార్ వెబ్‌సైట్‌లో 2024 మార్చి 14వ తేదీ వరకు గుర్తింపు, చిరునామా ధృవీకరణ పత్రాలు ఉచితంగా అప్‌లోడ్ చేసుకోవచ్చనే ప్రచారం కనిపిస్తుంది. నిజమే అని విశ్వసించి, దానిలో దరఖాస్తు చేస్తే, చివర్లో సర్వీసు చార్జీ కింద రూ.50 చెల్లించమని చెప్తుంది. డబ్బు వసూలు చేస్తూ ఉచితం అని ఎలా ప్రచారం చేసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇష్టారాజ్యం

ఆధార్ విధివిధానాల్లో ఇష్టారాజ్యంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. 0-5 సంవత్సరాల్లోపు చిన్న పిల్లలకు ఆధార్ ఉచితంగా ఇచ్చేవారు. అలాగే 15 సంవత్సరాలలోపు యువతీయువకులు తమ ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకొనేందుకు కూడా సేవల్ని ఉచితంగా అందించేవారు. ఇప్పుడు ఏవీ ఉచితం కాదు. సర్వీస్ చార్జీల పేరుతో అన్ని సేవల్ని డబ్బులు చెల్లించి కొనుక్కోవల్సిందే!

ప్రజాస్వామ్య రక్షణలో మీడియా వైఫల్యం

- రాజ్యాంగ పరిరక్షణ, వాస్తవాల వెలికితీతలో కూడా...
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసఫ్



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసఫ్ మీడియాపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో మీడియా దారుణంగా విఫలమైందని ఆయన విమర్శించారు. వాస్తవాల వెలికితీతలో కూడా వైఫల్యాన్ని మూటకట్టుకున్నదని చెప్పారు. నిర్భీతితో కూడిన వాస్తవాలు బయటికి రావడం లేదని, నాలుగో స్తంభమైన మీడియా విఫలం కావడమే ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని అన్నారు. క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబులిటీ అండ్ రిఫామ్స్ (సీజేఏఆర్) సంస్థ ఏర్పాటు చేసిన సెమినార్‌ను ఉద్దేశించి కురియన్ ప్రసంగించారు.

'ఈ సమావేశానికి ముందు మనం కొన్ని విషయాలను చర్చించాం. వాటన్నింటినీ మనం ఏ మీడియాలో అయినా చదవగలమా? ఎలక్ట్రానిక్ మీడియాలో చూడగలమా? ఏవో కొన్ని డిజిటల్ ప్రైవేటు మీడియా సంస్థల ప్రసారాలలోనే వాటిని మనం చూడగలం' అని కురియన్ వ్యాఖ్యానించారు. చట్టవిరుద్ధమైన, అనైతిక పనులకు పాల్పడే వారి గుట్టు రట్టు చేసే వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఇప్పుడు వారి పైనే ఆశలు మిగిలాయని ఆయన చెప్పారు. వారు ప్రజాస్వామ్యానికి ఐదో స్తంభం వంటి వారని అన్నారు. 'మొదటి మూడు స్తంభాలను గురించి మరచిపోండి. నాలుగో స్తంభమే మీడియా. అయితే అది ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో విఫలమైంది. నిజాన్ని వెలికితీయడంలో కూడా విఫలమైంది' అని తెలిపారు.

'అవినీతిపరులను గురించి మనల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే వ్యక్తులు కూడా ఇప్పుడు క్రియాశీలకంగా ఉండడం లేదు. వారిలో కొందరు మాత్రమే ఇప్పటికీ చైతన్యం ప్రదర్శిస్తున్నారు. కాబట్టి మనం వారికి మద్దతు ఇవ్వాలి. వారికి బాసటగా నిలవాలి. అప్రమత్తంగా ఉండాలి' అని జస్టిస్ కురియన్ సూచించారు.

ఇజ్రాయెల్ సమస్యపై భారత్ మౌనం

- పాలస్తీనా సంఘీభావ సదస్సులో సుభాషిణి అలీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ భారతదేశాన్ని "ఇజ్రాయెల్ , పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి స్థావరం"గా మార్చారని ఆదివారం నాడిక్కడ జరిగిన పాలస్తీనా సంఘీభావ సదస్సులో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ విమర్శించారు.

'అంతర్జాతీయ న్యాయస్థానం - గాజాలో న్యాయం' అనే అంశంపై ఇక్కడి 'కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా' హాలులో ఏర్పాటు చేసిన సదస్సులో సుబాషిణి అలీ మాట్లాడుతూ, పాలస్తీనాపై యూదు దురహంకార ఇజ్రాయిల్ దురాక్రమణను వ్యతిరేకించకుండా హమాస్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అమెరికా మాదిరిగానే భారత్ కూడా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. "గాజా , వెస్ట్ బ్యాంక్‌లో మారణ హోమం" సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌కు అదానీ-నిర్మిత డ్రోన్‌లను, ఆయుధాలను భారత్ పంపుతూ దీనిని కూడా గర్వకారణంగా చెప్పుకోవడం మోడీ ప్రభుత్వ దివాళాకోరుతనాన్ని తెలియజేస్తోందన్నారు.

సైన్స్ మ్యూజియంలోని గ్యాలరీని ఈ నెత్తుటి మరకలు కలిగిన అదానీ గ్రూప్‌నకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ లండన్‌లో మహిళలు, పిల్లలు నిరసన తెలిపారని సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పేర్కొన్నారు.ఇజ్రాయిల్ అనుసరిస్తున్న ' జాతీయవాదం, అణచివేత ,నిఘా' నమూనానే మోడీ ప్రభుత్వం కూడా అవలంబించిందని ఆయన విమర్శించారు. కాశ్మీర్‌లోను, భారతదేశంలోని రైతులకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తయారు చేసిన స్పైవేర్, డ్రోన్‌లను మోడీ ప్రభుత్వం నిర్లజ్జగా ఉపయోగిస్తున్నదని ఆయన విమర్శించారు.

ఇజ్రాయిల్ అనుసరిస్తున్న వర్ణవివక్షపై దక్షిణాఫ్రికా ఆ దేశాన్నిఅంతర్జాతీయ న్యాయ స్థానానికి లాగగా, 200 సంవత్సరాల వలసవాదం, సామ్రాజ్యవాదానికి గురైన భారతదేశం మాత్రం ఇజ్రాయెల్ దుర్మార్గాలను మౌనంగా వెనకేసు కొస్తోందని అన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తన సంక్షిప్త ప్రసంగంలో, బీజేపీ ప్రభుత్వం "పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి లొంగిపోవడం" తనకు ఏమాత్రం ఆశ్చర్యం కలిగించలేదని అన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆరెస్సెస్ సిద్ధాంతకర్త గురు గోల్వాల్కర్ భారతదేశానికి శత్రువులు బ్రిటిష్‌వారు కాదని, క్రైస్తవులు, ముస్లింలు, కమ్యూనిస్టులేనని చెప్పడాన్ని బట్టే ఆరెస్సెస్ ఎవరికి ఊడిగం చేస్తుందో అర్థమవుతోందన్నారు. భారతదేశాన్ని ఫాసిస్టు మత రాజ్యంగా మార్చే ఆర్ఎస్ఎస్ ఎజెండాను మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు.

పాలస్తీనాకు భారత ప్రజలు అండగా నిలుస్తారని సదస్సు పేర్కొంది. అమెరికాతో సహా పశ్చిమ దేశాలకు అండగా నిలవడంలో భారత ప్రభుత్వం విఫలమైందని, ఇజ్రాయెల్‌ను ఖండించడానికి, భారత్ ఫాసిస్ట్ శక్తుల కుట్రలకు బలికాకుండా చూసేందుకు భారతీయులంతా ఏకం కావాలని సదస్సు పిలుపునిచ్చింది.

అన్నదాతలపై కాల్పులు అమానుషం

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

- సీఎంగా మోడీ మాటలు.. పీఎంగా ఆచరించట్లే
- స్వామినాథన్ సిఫారసులు అమలుతోనే భారతరత్నకు సార్థకత
- సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని

ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా..



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ ప్రభుత్వం కాల్పులు జరపడం అమానుషమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంఎస్పీపై ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీ చైర్మెన్‌గా వ్యవహరించిన నాడు గుజరాత్ సీఎం నరేంద్ర మోడీ నేడు ప్రధానమంత్రిగా ఆ కమిటీ సూచనలను ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే ఆయనకిచ్చిన భారతరత్నకు సార్థకత చేకూరుతుందని.. స్వయంగా ఆయన కుమార్తె మధుర వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక మంచికంటి మీటింగ్ హాలులో ఆదివారం నిర్వహించిన సదస్సులో పోతినేని మాట్లాడారు.

ధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నీతి ఆయోగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా.. ఆయన మరణానంతరం భారతరత్న ఇవ్వడం అవార్డుకు సార్థకత చేకూరినట్టు కాదని తెలిపారు. వాస్తవ ధరకు కౌలు, పెట్టుబడి, శ్రమ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు.. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని మొత్తం ఖర్చుపై 50 శాతం అదనంగా ఎంఎస్పీ నిర్ధారించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలనే ఆరు డిమాండ్ల సాధన కోసం రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. భూసేకరణ చట్టం- 2013ను సైతం మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విలువైన పంట భూములను కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. పెసా, 1/70 చట్టాలను కూడా తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. ఢిల్లీలో రైతుల ఆందోళనలకు మద్దతుగా నిర్వహించే ఉద్యమాలకు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్
- నేటి ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి, హర్యానా ముఖ్యమంత్రిపై హత్యానేరం మోపాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో మృతిచెందిన యువ రైతు శుభకరన్ సింగ్ స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. టియర్‌గ్యాస్ ప్రయోగించడం, రైతులపై దాడి చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, మనోహర్ లాల్ ఖట్టర్, అనిల్ విజ్ రాజీనామా చేయాలని, వారిపై సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కాల్పులు, ట్రాక్టర్లకు జరిగిన నష్టంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, పాడైన 100 ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఫిబ్రవరి 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో జరిగే ఆందోళనలో పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నిజామాబాద్ పట్టణంలో గాంధీ చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గంగాధరప్ప, పల్లపు వెంకటేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమన్న, నాయకులు డి.కృష్ణ గౌడ్, శ్రీనివాసరెడ్డి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో 300 మంది నర్సుల నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించిన తుది జాబితాను నిమ్స్ ఆస్పత్రి విడుదల చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాంట్రాక్ట్ నర్సుల పోస్టుల కోసం 30,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 300 మందిని అధికారులు ఎంపిక చేశారు. ఎంపికైన వారు సోమవారం నుంచి మార్చి 4వ తేదీ వరకు విధుల్లో చేరాలని ఆదేశించారు. ఈ పోస్టులకు సంబంధించి గత నెల 4న నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

లాస్య కుటుంబానికి కేటీఆర్ పరామర్శ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. సికింద్రాబాద్ కార్ఖానాలోని లాస్య నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని, లాస్య తల్లి గీత, సోదరీలు నమ్రత, నివేదితకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే లాస్య రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. తాను విదేశాల్లో ఉన్న కారణంగా లాస్య అంత్యక్రియలకు హాజరుకాలేక పోయానని తెలిపారు. లాస్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఏడాది వ్యవధిలోనే సాయన్న, లాస్యలు మరణించడం కంటోన్మెంట్ ప్రజానీకానికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుతున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అలా వెంకటేశ్వర రెడ్డి పాల్గొని లాస్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒప్పందంలో భాగమే

- కవితకు సీబీఐ నోటీసులపై జగ్గారెడ్డి



(ఫైల్)

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సీబీఐ నోటీసులు ఇచ్చిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి చెప్పారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు మరో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఆమెను అరెస్టు చేస్తే సానూభూతి వస్తుందని భావిస్తున్నదని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ ఓట్లు చీల్చాలనేది ఆ పార్టీ నేతల ఆలోచన అని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం అని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం కోసం నిర్విరామంగా పనిచేస్తానన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ ప్రధానిగా కాకుండా బీఆర్ఎస్, బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపీ సీట్లు గెలవడమే తమ లక్ష్యంగా ముందుకు పోతామన్నారు. లిక్కర్ స్కామ్ తెరపైకి వచ్చినప్పుడు ఎంపీ బండి సంజయ్..ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవుతుందని చెప్పారని ఏమైంది? అని ప్రశ్నించారు. ఇప్పుడు కవితకు నోటీసుల విషయం కూడా అంతా డ్రామానే అని ఎద్దేవా చేశారు.

వారు పోరాడుతుంటే.. కేసీఆర్ జాడ లేకుండా పోయారు

గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తనపై ఆయన తీవ్ర ఒత్తిడి చేశారని చెప్పారు. ఎన్నికల రోజు తనను అరెస్ట్ చేయాలని ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. తనను 12 గంటల పాటు హౌస్ అరెస్ట్ చేశారని.. అయిన తన వర్గమే ఆ ఎన్నికల్లో గెలిచిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు.. కేసీఆర్‌ను పక్కన పెట్టడం వల్లే.. అప్పటి టీఆర్ఎస్ పార్టీను పెట్టారని.. తెలంగాణ కోసం కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ ఎక్కడ లేరని చెప్పారు. పార్లమెంట్‌లో మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మధుయాష్కి, పెద్దపల్లి వివేక్ వెంకటస్వామి, సిరిసిల్ల రాజయ్య, మంద జగన్నాథం తెలంగాణ కోసం పోరాడారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్‌లు పార్టీ లైన్‌లో పని చేశారని వివరించారు. ఢిల్లీ గెస్ట్ హౌస్‌లో టీవీ చూసుకుంటూ కేసీఆర్ ఉన్నాడని చెప్పారు. తెలంగాణ ప్రకటించిన అనంతరం కేసీఆర్ మీడియా సమావేశం పెట్టి ఉద్యమాన్ని తన ఖాతాలో వేసుకున్నారని చెప్పారు. 10 ఏళ్ల కేసీఆర్ అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని జగ్గారెడ్డి మండిపడ్డారు.

గ్రామీణ ఖర్చు పెరిగింది!

(మొదటి పేజీ తరువాయి)



చేయలేదు. వినియోగ స్థాయిలకు సంబంధించి గణనీయమైన అంతరాలు కన్పించాయని, అందుకే నివేదికను విడుదల చేయలేదని వివరణ ఇచ్చింది. అయితే బయటికి పొక్కిన సర్వే సమాచారం ప్రకారం వినియోగ వ్యయం పడిపోయింది. గ్రామీణ ప్రాంతాలలోని చివరి ఐదు శాతం జనాభా సగటు నెలసరి తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) రూ.1,373 ఉండగా 2001లో పట్టణ జనాభాలో చివరి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ రూ.2,001గా నమోదైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని జనాభాలో మొదటి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ రూ.10,501, రూ.20,824గా ఉంది. మరో మాటలో చెప్పాలంటే గ్రామీణ జనాభాలో మొదటి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ దాని చివరి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ కంటే 7.65 రెట్లు అధికంగా ఉంది. పట్టణ జనాభాలోని మొదటి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ దాని చివరి ఐదు శాతం ప్రజల ఎంపీసీఈ కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంది.

ఆహారేతర వస్తువులకే ప్రాధాన్యత

2022-23లో ప్రజలు తాము పెట్టిన ఖర్చులో ఆహారానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. గ్రామీణ ప్రాంతాలలో ఆహార వ్యయం 46 శాతం (రూ.1,750) ఉంటే పట్టణ ప్రాంతాలలో అది 39 శాతం (రూ.2,530) గానే ఉంది. 2011-12లో ఈ వ్యయం గ్రామాలలో 52.90 శాతం, పట్టణాలలో 42.62 శాతంగా నమోదైంది. దీనివల్ల ద్రవ్యోల్బణ ఆధారిత వినియోగ ధరల సూచీలో కొన్ని సమస్యలు తలెత్తాయి. గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ ఆహారేతర వ్యయం పెరగడం గమనార్హం. 2022-23లో ఆహారేతర అవసరాల కోసం గ్రామీణ ప్రజలు తమ ఆదాయంలో 54 శాతం, పట్టణ ప్రజలు 61 శాతం ఖర్చు చేశారు. 2011-12తో పోలిస్తే 2022-23లో రవాణా, వినియోగ సేవలు, నాణ్యమైన వస్తువుల కొనుగోలుపై వారు ఎక్కువ ఆసక్తి చూపారు. అదే సమయంలో ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలపై ఖర్చు ఓ మాదిరిగా పెట్టారు.

'ఉచితాల'తో పెద్దగా తేడా లేదు

ప్రభుత్వం పంపిణీ చేసిన ఆహార ధాన్యాలు, ప్రభుత్వ పథకాల ద్వారా ఇచ్చిన ఉచిత వస్తువుల ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకుంటే గ్రామీణ ప్రాంతాలలో సగటు నెలసరి వినియోగ వ్యయం రూ.3,860, పట్టణ ప్రాంతాలలో రూ.6,521గా నమోదైందని సర్వే నివేదిక తెలిపింది. ఉచిత వస్తువుల విలువను కలపని పక్షంలో వినియోగ వ్యయం గ్రామాలలో రూ.87, పట్టణ ప్రాంతాలలో రూ.62 మాత్రమే పెరిగింది. ఉచిత వస్తువుల విలువను కలిపిన పక్షంలో గ్రామీణ జనాభాలోని చివరి ఐదు శాతం ప్రజలు రూ.1,441 ఖర్చు చేశారు. కలపకపోతే పెట్టిన ఖర్చు రూ.1,373 కంటే ఇది కొంచెం మాత్రమే ఎక్కువ. పట్టణ ప్రాంతాలకు సంబంధించి ఉచిత వస్తువుల విలువను కలపకపోతే రూ.2,001, కలిపితే రూ.2,087 ఖర్చవుతుంది.

ఇది వాస్తవాల పత్రమే

వస్తువులు, సేవలపై కుటుంబాల వినియోగానికి సంబంధించి హెచ్‌సీఈసీ సమాచారం సేకరించింది. పది సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం ఈ సర్వే విడుదలైంది. 2017-18 సర్వే ఫలితాలు బయటకు పొక్కడంతో దానిని ప్రభుత్వం రద్దు చేసింది. కోవిడ్ కారణంగా 2020-21లో సర్వే జరగలేదు. 2022 ఆగస్టులో ప్రారంభమైన సర్వే గత జూలై వరకూ కొనసాగింది. 2022-23కు సంబంధించి ఇప్పుడు విడుదల చేసింది కేవలం వాస్తవాల పత్రం మాత్రమేనని, సవివరమైన నివేదికను త్వరలో విడుదల చేస్తానని మంత్రిత్వ శాఖ తెలిపింది.

తిండి కంటే ఇతర ఖర్చులే ఎక్కువ..

న్యూఢిల్లీ : దేశంలో గత 20 సంవత్సరాల కాలంలో ఆహార వ్యయంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆహారంపై తక్కువ ఖర్చు చేయడమంటే మిగిలిన వస్తువుల కొనుగోలుపై ఎక్కువ ఖర్చు చేయడమే. నాణ్యమైన వినియోగ వస్తువుల నుండి బట్టలు, చెప్పుల కొనుగోలు వరకూ, వాహనాలలో పెట్రోల్ లేదా డీజిల్ పోయించేందుకు, చివరికి వినోదంపై కూడా ప్రజలు ఎక్కువ ఖర్చు చేస్తున్నారట. 1999-2000 నుండి 2022-23 వరకూ గ్రామీణ, పట్టణ కుటుంబాలలో ఆహారంపై వ్యయం తగ్గుతూ వచ్చింది. గ్రామాలలో మొత్తం వినియోగ వ్యయంలో ఆహారంపై పెట్టే ఖర్చు 50 శాతం కంటే తక్కువగా, పట్టణాలలో 40 శాతం కంటే తక్కువగా ఉండడం ఇదే మొదటిసారి అని తాజాగా విడుదలైన కుటుంబ వినియోగ వ్యయ సర్వే తెలిపింది. 1999-2000లో గ్రామీణ ప్రాంతాలలో వినియోగ వ్యయంలో ఆహార వాటా అత్యధికంగా 59.4 శాతంగా ఉంది. నూతన సహస్రాబ్దిలోని తొలి దశాబ్దంలో అది 50 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో 46.38 శాతంగా రికార్డయింది. పట్టణ ప్రాంతాలలో సగటు నెలసరి తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ)లో ఆహార వాటా 48.06 శాతం (1999-2000) నుండి 39.17 శాతం (2022-23)కి తగ్గింది.

వరి, గోధుమలు వంటి ఆహార ధాన్యాలపై కాకుండా పౌష్టికాహారం కోసం భారతీయులు ఏ మేరకు ఖర్చు చేస్తున్నారో కూడా సర్వే తెలుసుకుంది. 1999-2000లో గ్రామీణ కుటుంబాల మొత్తం వినియోగ వ్యయంలో ఆహారధాన్యాలపై పెట్టిన ఖర్చు 22 శాతంగా ఉంది. ఇప్పుడది దారుణంగా 4.91 శాతానికి పడిపోయింది. పట్టణ ప్రాంతాలలో ఈ ఖర్చు 12 శాతం నుండి 3.64 శాతంకి తగ్గిపోయింది. ఆసక్తికరమైన విషయమేమంటే గత రెండు దశాబ్దాలలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో గుడ్లు, చేపలు, మాంసం, పండ్లు, కూరగాయలపై ఖర్చు పెరుగుతోంది. అయితే ఇక్కడ ఆందోళన కలిగించే విషయం కూడా ఒకటుంది. పట్టణ ప్రాంతాలలోని కుటుంబాలు



తమ ఆదాయంలో 2.43 శాతం పాన్, పొగాకు, మత్తు పదార్థాలపై ఖర్చు చేస్తున్నాయి.

వినోదంపై 1.58 శాతం వ్యయం చేస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అద్దెలపై పెట్టే ఖర్చు కూడా ప్రజలకు భారంగా మారుతోంది. గ్రామీణ ప్రజలు తమ ఆదాయంలో 0.78 శాతం, పట్టణ ప్రజలు 6.56 శాతం అద్దె రూపేణా చెల్లించాల్సి వస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వారు బయలుదేరి ముందుగా గన్ ఫౌండ్రీలో ఉన్న అమరవీరుల స్థూపం దగ్గర నివాళ్లర్పించారు. అనంతరం గాంధీ భవన్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, కాంగ్రెస్ అంబర్‌పేట్ అభ్యర్థి రోహిన్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫాసియుద్దీన్, టీటీయూసీ శివకుమార్, టీటీయూసీ పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ కార్పొరేటర్లు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూ వివాదంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



నవతెలంగాణ-శాయంపేట

భూమి విక్రయంలో మిగిలిన డబ్బులు చెల్లించాలని అడగడంతో కొనుగోలుదారుడు అమ్మకందారుడ్ని కులం పేరుతో దూషించిన ఘటన హన్మకొండ జిల్లాలో చోటుచేసుకుంది. దాంతో బాధితుని ఫిర్యాదు మేరకు కొనుగోలుదారుడు, కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట గ్రామానికి చెందిన మారేపల్లి సుమన్‌కు హన్మకొండ పట్టణం లోని గోపాలపురంలో భూమి ఉండగా తన అవసరాల నిమిత్తం భూమి అమ్మకానికి పెట్టాడు. కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆ భూమిని రూ.17 లక్షలకు కొనుగోలు చేశాడు. భూమి అమ్మిన సమయ ంలో సుమన్‌కి రూ.11 లక్షలు చెల్లించిన పోలేపల్లి.. మిగతా రూ.6 లక్షలకు ఒక నెల గడువు పెట్టారు. గడువు ముగియడంతో సుమన్ తనకు రావాల్సిన డబ్బులు పోలేపల్లి ని అడగగా, రేపు మాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఈనెల 7వ తేదీన డబ్బుల కోసం సుమన్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేయగా.. కులం పేరుతో దూషించి చంపుతా అని బెదిరించినట్టు బాధితుడు తెలిపారు. బాధితుడు సుమన్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

మల్కాజిగిరి బరిలో ఎవరు..?

- లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనపై పార్టీల కసరత్తు
- బీఆర్ఎస్ నుంచి భద్రారెడ్డి..బీజేపీ నుంచి ఈటల పేర్లు దాదాపు ఖరారు
- కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ
- ఈ నెల 29న బీజేపీ మొదటి జాబితా

నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మరో పది రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. మరోపక్క ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కోసం తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ నెల 29న బీజేపీ మొదటి జాబితా విడుదల కానుంది. ఇందులో మల్కాజిగిరి అభ్యర్థి పేరు ఉంటుందా..? మరో విడతలో ఖరారు అవుతుందో తేలనుంది. ఇక కాంగ్రెస్‌లో దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు వచ్చింది. దరఖాస్తు చేసుకున్న వారి పేరును ప్రకటిస్తారా..? లేక కొత్త వారిని బరిలో దించుతారా..? అనేది చూడాల్సి ఉంది. బీఆర్ఎస్ నుంచి పెద్దగా పోటీ లేకపోవడంతో అభ్యర్థి ప్రకటన ఈజీ కానుంది. మార్చి మొదటి వారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించే ఛాన్స్ ఉంది.

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ 'మినీ ఇండియా'. ఇక్కడ దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ఇందులో 7 లక్షల వరకు నార్త్ ఇండియన్స్ ఉండటంతో బీజేపీ ఈ సెగ్మెంట్‌పై కన్నేసింది. దీనికితోడు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ రెండో స్థానంలో నిలవడంతో ఓటు బ్యాంక్ కూడా పెరిగింది. ఇక సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడంతో ఈ సెగ్మెంట్ విషయంలో కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారితోపాటు కొత్తగా పార్టీలో చేరిన, చేరే నాయకుల్లో ఒకరిని పోటీ చేయించినా ఆశ్చర్య పోనక్కర్లేదు. బీఆర్ఎస్ నుంచి పెద్దగా పోటీ కనిపించడం లేదు. సెగ్మెంట్ పరిధిలోని అన్ని నియోజకర్గాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా.. లోక్‌సభ నుంచి పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. టికెట్ ఆశించిన జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్‌లో చేరడంతో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబానికి లైన్ క్లియర్ అయ్యింది.

బీజేపీ, బీఆర్ఎస్ ముందంజ..


ఇప్పటికే ఇంద్రవెల్లి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించగా.. విజయ సంకల్ప యాత్ర పేరుతో బీజేపీ సైతం ఎన్నికల కదన రంగంలోకి దిగింది. ఇప్పటికే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ యాత్ర ముగిసింది. ఈ ఇరు పార్టీలూ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చాయి. ఇదిలా ఉంటే బీఆర్ఎస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న పలువురు అభ్యర్థులు ప్రస్తుతం పార్లమెంట్ పరిధిలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ తరుపున మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి ఉచిత మెడికల్ క్యాంపులతో అన్ని నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. బీజేపీ నుంచి దాదాపు ఏడు నుంచి పది మంది వరకు అభ్యర్థులు వాల్ పోస్టర్లు, భారీ కటౌట్లతో ప్రచారంలోకి దిగారు. కొందరు అభ్యర్థులు సెగ్మెంట్ పరిధిలోని ముఖ్య నాయకులతో సమావేశ మవుతున్నారు. ఇక కాంగ్రెస్ ఆశావహులు మాత్రం ఇప్పటి వరకు జనాల్లోకి వెళ్లలేదు.


పోటాపోటీ..

బీజేపీ నుంచి చాలా మంది ఆశావహుల పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత మల్క కొమురయ్య, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్‌తోపాటు రూరల్ జిల్లా అధ్యక్షులు హరీశ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి పోటీ పడుతున్నారు. కానీ అధిష్టానానికి పంపిన షార్ట్ లిస్టులో మురళీధర్‌రావు, ఈటల రాజేందర్, మల్క కొమురయ్య పేర్లు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, సినీ నిర్మాత బండ్ల గణేష్‌తోపాటు నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్థన్‌రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. టికెట్ కేటాయిస్తే 'మర్రి' పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్టు జిల్లా కాంగ్రెస్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

దాదాపు వీరి పేర్లు ఖరారు..

ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్.. గెలుపు గుర్రాల ఎంపికపై ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో మాజీ మంత్రి మల్లారెడ్డి భేటీ అయ్యి మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిత్వంపై చర్చించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు తన కుమారుడు బరిలో ఉంటాడని బహిరంగంగా చెప్పారు. తదనంతరం ఆ పార్టీ నుంచి భిన్న స్వరాలు వినిపించకపోవడంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా భద్రారెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఇక బీజేపీ నుంచి తాము బరిలో ఉంటామని ఇప్పటికే పలువురు నేతలు బహిరంగంగా ప్రకటించినా అధిష్టానం మాత్రం మాజీ మంత్రి ఈటల రాజేందర్ వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక తరగతిలో బలమైన నేత కావడం ఒక కారణం అయితే.. టికెట్ కేటాయించకపోతే పార్టీ మారి నష్టం జరిగే ప్రమాదం ఉందని భావించిన బీజేపీ అధిష్టానం దాదాపు ఈటల పేరునే ఫైనల్ చేసినట్టు సమాచారం.





కవిత్వం, సినిమాలు ఆయనకు రెండు కళ్లు

"మేర గోరా రంగ్ లైలే.." అంటూ మొట్టమొదటిసారిగా బిమల్ రాయ్ సినిమాకు రాసినా.. **"మైనే తెరెలియే హి సాత్ రంగ్ కె సప్నే చునే"** అంటూ 'ఆనంద్'లో ప్రేమకి జ్ఞాపకానికీ లంకె వేసినా..

"ముసాఫిర్ హో...యారో .. నా ఘర్ హై నా టిఖానా ..." అంటూ 'పరిచయ్'లో మనమంతా యాత్రికులమే పయనించే దారిని యాత్రని ఆనందించాల్సిందే అన్నాడు గుల్జార్.

"దిల్ హోం హోం కరే ఘబ్ రాయే" అని 'రుడాలి'లో వేదన పడ్డా, **"మేర కుచ్ సామాన్ తుమ్హారే పాస్ పడా హై.."** అంటూ 'ఇజాజత్'లో ప్రేమ విఫలమైన ప్రేమికురాలి దు:ఖం వేదన ఒంటరితనం అన్నింటిని కలగలిపి ఇజాజత్‌లో రాసినా, వాటిల్లో వాడిన ఆ భాష ఆ భావసాంద్రత గుల్జార్ కే చెల్లింది. ఇట్లా సినిమా పాటల గురించి రాస్తూ పోతే ఎన్నో ఎన్నెన్నో పాటలు ఆయన కలం నుండి వెలువడ్డాయి. అవన్నీ పాఠకుడి మనసుని కట్టిపడేస్తాయి.


ఇక సంభాషణల విషయానికి వస్తే "బాబూమొషై జిందగీ బడీ హెూనీ చాహియే, లంబీ నహి", "జబ్ తక్ జిందా హూ తబ్ తక్ మరా నహీ, జబ్ మర్ గయా సాలా మై హీ నహీ", "మౌత్ తో ఏక్ పల్ హయ్, (జీవతం ఉన్నత మైంది కావాలి, కాని దీర్ఘమయింది కాదు, బతికి ఉన్నంతవరకూ చావలేదు, చచ్చింతర్వాత నేనే లేను, మరణం ఒక క్షణమే)... ఇలాంటి తాత్విక సజీవమయిన సంభాషణలు 'ఆనంద్' సినిమాలో గుల్జార్ రాశారు. అట్లా ఆయన పాటలు, సంభాషణలే కాదు గుల్జార్ గొప్ప కవి, సినీ గేయ రచయిత, రచయిత, సినీ దర్శకుడు. గుల్జార్ రచనలు, సినిమాలు, గజల్స్ అన్నీ సృజనాత్మకంగానూ తాత్వికంగానూ వుండి ఆయనలోని సున్నితత్వాన్ని, సరళత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఆయన కవిత చదివే పద్ధతి కూడా శ్రోతల్ని అమితంగా ఆకట్టుకుంటుంది. ఇట్లా పలు రంగాల్లో తన ముద్రను చాటుకున్న గుల్జార్ అనువాదంలో కూడా ఉన్నతమయిన కృషి చేసాడు, చేస్తున్నాడు. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పంజాబీ, బెంగాలి భాషల్లో ప్రావీణ్యమున్న గుల్జార్ దేశంలోని ఇతర భాషల రచనల్ని చదవడానికీ ఇష్టపడతాడు. 'మన మెదడు ఆంటెన్నా (antenne) ను తెరిచి వుంచాలి, అప్పుడే ఇతర ప్రాంతాల్లో ఇతర భాషల్లో ఏమి జరుగుతుందో తెలిసి వస్తుంది' అంటాడు గుల్జార్. అట్లా భాషల్లో, సాంస్కృతిక ప్రక్రియల్లో నిరంతర కృషి కొనసాగిస్తున్న గుల్జార్ ఒక లివింగ్ లెజెండ్. దర్శకుడిగా హిందీ చలన చిత్ర సీమలో తన ముద్రను చాటుకున్నవాడు గుల్జార్. సినిమా రంగంలో విశేషమయిన్ కృషి చేసిన ఆయనకు ఆ రంగంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో అనేక పురస్కారాలు, సత్కారాలు లభించాయి. ఆస్కార్, గ్రామీ, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం, అనేక జాతీయ పురస్కారాలు వచ్చాయి.

'ఎక్కువ మంది నేను సినిమాల్లోనూ సినిమాల కోసమూ రాసిన వాటిని ఇష్టపడతారు, ప్రేమిస్తారు, అభిమానిస్తారు. కానీ నేను మనిషి పడే బాధ, సంఘర్షణ, దేశాన్ని ప్రేమించడం లాంటి అనేక విషయాల్నీ అభిమానిస్తాను. అంతేకాదు అందరూ జీవితంతో అనుబంధం పెట్టుకోవాలని అందరికీ చెబుతాను అప్పుడే ఆనందంగా వుంటారనీ చెబుతాను' అంటాడు గుల్జార్.

కవిత నిడివి గురించి అడిగితే 'నువ్వు అధికంగా మాట్లాడ్డం ప్రారంభించగానే జనం నిన్ను వినడం మానేస్తారు. అధికంగా చెప్పిన ఏదయినా దాని ప్రభావాన్ని కోల్పోతుంది. క్లుప్తంగా రాసిన కొన్నిమాటలే ఎక్కువ శక్తివంతమయినవి, ఎంతో ప్రభావ వంతమయినవి. నేనయితే నా కవిత్వంలో ముఖ్యమయిన విషయాల్ని అతి తక్కువ మాటల్లో చెప్పే ప్రయత్నం చేస్తాను అంటాడు గుల్జార్.

గుల్జార్ గా అందరికీ పరిచయమున్న ఆయన అసలు పేరు సంపూరన్ సింగ్ కల్రా. ఆగస్ట్ 18,1936 రోజున ప్రస్తుతం పాకిస్తాన్ లో వున్న దీన పట్టణంలో సిక్కు కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటినుంచీ అంతాక్షరీ ఆడడంలో ఆసక్తిగా వుండే ఆయన అప్పటినుండే భాష పట్ల పదాల పట్ల మక్కువను పెంచుకున్నాడు. చిన్నప్పటినుండే హిందుస్తానీ సంగీతం పట్ల మక్కువ కలిగిన గుల్జార్ రవిశంకర్, అలీ అక్బర్ ఖాన్ ల కచేరీలకు వెళ్ళేవాడు. గుల్జార్ కుటుంబం దేశ విభజనలో తీవ్రంగా ప్రభావితమయింది. సొంతవూరు విడిచి అమృత్‌సర్ కి వలస వచ్చింది. అప్పుడు ఆయన చూసిన హింస, దౌర్జన్యాలు, పడ్డ వేదన దు:ఖం ఆయన కవిత్వంలో అంతర్లయగా ధ్వనిస్తూనే వుంటుంది.

'మన మెదడు ఆంటెన్నా (antenne) ను తెరిచి వుంచాలి, అప్పుడే ఇతర ప్రాంతాల్లో ఇతర భాషల్లో ఏమి జరుగుతుందో తెలిసి వస్తుంది' అంటాడు గుల్జార్. అట్లా భాషల్లో, సాంస్కృతిక ప్రక్రియల్లో నిరంతర కృషి కొనసాగిస్తున్న గుల్జార్ ఒక లివింగ్ లెజెండ్. దర్శకుడిగా హిందీ చలన చిత్ర సీమలో తన ముద్రను చాటుకున్నాడు.




ఇక తమ కుటుంబ వ్యాపారమయిన మెకానిక్ షాప్‌లో పనిచేయడంతో గుల్జార్ జీవితం ఆరంభమయింది. ప్రమాదంలో సొట్టలు పడ్డ కార్లకు కలర్ మాచ్ చేసే పని చేసేవాడు. తన పదమూడేళ్ళ వయస్సులోనే చదవడం పైన ఆసక్తి కలిగిన గుల్జార్ తమకి దగ్గరలో ఓ కాందిశీకుడు నిర్వహించే పుస్తకాలు కిరాయికిచ్చే షాప్ నుండి అపరాధ పరిశోదక నవలలు, మాజిక్ ఫాంటసీ రచనల్ని లాంతరు ముందు చదవడం ఆరంభించాడు. వారానికి పావలా రుసుము చెల్లిస్తే ఎన్ని పుస్తకలయినా చదివే వీలుండేది అక్కడ. దాంతో తమ షాప్ పని అయిపోగానే రోజుకు ఒకటి అని కాకుండా రెండు మూడు పుస్తకాలు చదవడం చేసేవాడు గుల్జార్. ఒక నాటికి షాప్ లోని దాదాపు పుస్తకాలు అయిపోవడంతో షాపతను ఇట్లా ఒక్క పావలాకు ఎన్ని చదువుతావు అంటూ సజ్జ మీదవున్న పుస్తకమొకటి తీసి ఇచ్చాడు. అది టాగోర్ రాసిన 'గార్డనర్'. అది చదివింతర్వాత గుల్జార్‌లో చదివే దృక్పథమే మారిపోయింది. ఆ తర్వాత ప్రేంచంద్ నుంచి మొదలు అనేక మంది గొప్ప రచయితల రచనలు చదవడం మొదలుపెట్టాడు. సరిగ్గా అదే సమయంలో ఆయనకు ప్రగతిశీల రచయితలు, కళాకారులతో పరిచయం కలగడం పిడబ్ల్యూఎ కార్యక్రమాలల్లో పాల్గొనడం మొదలయింది. అప్పుడే శైలేంద్ర పరిచయం అయ్యాడు. అదే సమయంలో బిమల్ రాయ్ 'బందిని' సినిమా తీయడం మొదలు పెట్టాడు. శైలందర్ పరిచయంతో గుల్జార్, బిమల్‌దాను కలుసుకున్నాడు. మొట్ట మొదటి సినిమా పాట 'మేర గోరా అంగ లయిలే.." తో ఆరంభమయింది. అయితే బిమల్ దా గుల్జార్ తో మాటాడుతూ సినిమాలకు పనిచేయడం నీకిష్టం లేదని తెలుసు కానీ నువ్వు నా దగ్గర ఆసిస్టంట్ గా చేరు. అంతే కానీ ఇక ముందు తన మెకానిక్ షాప్ కు వెళ్ళకు. రచనల పైన దృష్టి పెట్టాలని సూచించాడు. దాంతో గుల్జార్ పూర్తి స్థాయిలో సృజన మీదే దృష్టి కేంద్రీకరించాడు. బిమల్‌దాకి పూర్తి స్థాయి సహాయకుడిగా ఉండిపోయాడు. తర్వాత హ్రిషికేశ్ ముఖర్జీ, అసిత్ సేన్ లాంటి దర్శకుల సినిమాలకు రచనలు చేయడం ఆరంభించాడు.

ఇక తర్వాత 1971 లో 'మేరె అప్నే' సినిమాతో దర్శకుడిగా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టాడు గుల్జార్. జితేంద్ర ప్రధాన పాత్రధారిగా 1972లో 'పరిచై' తీసాడు. 1972లో అయన రచించి దర్శకత్వం వహించిన 'కోషిష్' అత్యంత సున్నితమయిన మానవీయ దృక్పథంతో తీసిన సినిమాగా మిగిలి పోయింది. సంజీవ్ కుమార్, జయాభాధురి ప్రధాన భూమికల్ని పోషించిన 'కోషిష్'లో ఇద్దరు మూగ చెవిటి వాళ్ళ జీవితం దాంట్లో వారు ఎదుర్కొన్న అవస్థలు హృద్యంగా చూపిస్తాడు గుల్జార్. ఇంకా దర్శకుడిగా గుల్జార్ 'కితాబ్, పల్కొంకీ చావ మే, శాహీరా, చత్రన్, సునేయే, ఆల్కా, ఇజాజత్, లిబాస్, మాచిస్, హు టు టు' లాంటి సినిమాలు రూపొందించాడు.

టెలివిజన్ రంగంలో ఆయన రూపొందించిన సీరియల్స్ గొప్పగా విజయవంతమయి కల్ట్ గా మిగిలిపోయాయి. రచయితగా, దర్శకుడిగా ఆయనలోని సున్నితత్వం ప్రతిభ విశేషంగా పేరు గడించింది. ఆయన రూపొందించిన 'మిర్జా గాలిబ్' సీరియల్ ఆ మహాకవి కవిత్వాన్ని జీవితాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. అందులో గాలిబ్ గా నసీరుద్దిన్ షా, గాయకుడిగా జగ్ జీత్ సింగ్ తమ అద్భుత ప్రదర్శనను అందించారు. వారి ప్రతిభను ఆవిష్కరించడంలో గుల్జార్ భావుకత, నిబద్ధత ప్రధాన భూమికను పోషించాయి.

ఇక గేయ రచయితగా గుల్జార్ 100 పైగా సినిమాలకు పాటలు రాసాడు. అలనాటి బందినితో మొదలయిన ఆయన ప్రస్తానం సలిల్ చౌదరి, ఎస్.డి.బర్మన్, ఆర్.డి.బర్మన్, మదన్మోహన్, విశాల్ భరద్వాజ్, ఎ.ఆర్. రెహమాన్ లాంటి ప్రాచీన ఆధునిక సంగీతకారులతో అవిశ్రాంతంగా సాగింది. అలనాటి మెలోడీ పాటలు గొప్పగా రాసిన గుల్జార్ 'కజరారే..' (బంటీ ఆర్ బబ్లూ), "చయ్యా చయ్యా చయ్యా" (దిల్ సే) లాంటి ఆధునిక పాటల్ని కూడా రాసాడు. ఇవ్వాళ మెలొడీకి స్థానం లేదని బీట్‌కే ప్రధాన పాత్ర అని ఆయన అంటారు. కాలానుగుణంగా సినిమాలు రచనలు వస్తాయని ఆయన అభిప్రాయ పడతారు. ఏ.ఆర్.రెహమాన్ తో కలిసి "జై హో.." పాటకు గుల్జార్ ఆస్కార్ అవార్డును అందుకున్నారు.

గుల్జార్ కవిత్వం, వచనం మనసుకు హత్తుకునేలా రాశారు. ఆయన రాసిన 'గ్రీన్ పోయెమ్స్'ని నేను ఆకుపచ్చ కవితలు పేర తెలుగులోకి అనువదించాను, వర వర రావు గారు 'సస్పెక్టెడ్ పోయెమ్స్'ని అనుమానిత కవితలు గా అనువదించారు.



గుల్జార్ కూడా అనేక అనువాదాలు చేశారు. 'ఏ పోయేమ్ ఏ డే' పేర భారీ సంకలనాన్ని తెచ్చారు. అందులో 34 భారతీయ భాషల్లోని 279 కవుల 365 కవితల్ని అనువదించి ప్రచురించారు.

అయన 1973 లో ప్రముఖ నటి రాఖీ ని వివాహం చేసుకున్నారు. తర్వాత కొంత కాలానికి వేరై వేరుగా వుంటున్నారు. వారి కూతురు మేఘన గుల్జార్ దర్శకురాలిగా 'ఫిల్ హాల్, జస్ట్ మారీడ్, దస్ కహానియా, తల్వార్, రాజీ, చాపాక్, సామ్ బహదూర్' సినిమాలు రూపొందించారు. అంతేకాదు తన తండ్రి పైన 'బికాస్ హి ఈస్' పుస్తకం రాసారు.

గుల్జార్ బహుముఖీన ప్రతిభలో ఆయన రాసిన రచనలు భారతీయ హిందీ, ఉర్దూ సాహిత్య రంగాల్లో విలక్షణతను విశేష ఖ్యాతిని పొందాయి. ఆయన రవీంద్రనాథ్ రచనల్ని అనేకం అనువాదం చేసారు. గ్రీన్ పోయెమ్స్, సస్పెక్టెడ్ పోయెమ్స్, జిందగీ నామా, హాఫ్ ఎ రూపీ, సేలేక్తేడ్ పోయెమ్స్, 100 లిరిక్స్, మేరా కుచ్ సమ్మాన్, సైలేన్సేస్, టూ లాంటి ఎన్నో రచనలు విశేష ప్రశంసల్ని అందుకున్నాయి.

గుల్జార్ ఇప్పటికే పద్మభూషణ్, సాహిత్య అకాడమి అవార్డు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు లు అందుకున్నారు. ఇప్పుడు జ్ఞానపీఠ పురస్కారం అందుకోవడంతో ఆయన కవిత్వం మరింతగా పాఠకులకు చేరుతుంది. ఆయనకు హృదయపూర్వక అభినందనలు.

-వారాల ఆనంద్,
9440501281
కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత



వాళ్లు ఏమి అడిగారు



వాళ్లు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వాగ్దానాలను
నిలబెట్టుకోవాలని అడిగారు
వాళ్లు ఏమి కోరారు
పంటకు మద్దతు ధర చట్టబద్ధంగా కల్పించమన్నారు
వాళ్లు ఎందుకు ఏమని
మేమంతా ఒక్కటేనని పిడికిలెత్తి నినాదం ఇచ్చారు
వాళ్లు దేన్ని కొడవలిలా
గొంతెత్తి ప్రశ్నించారు నిరసనలు ప్రదర్శించారు
వాళ్లు కూరగాయలను రోడ్డుమీద పారబోసుకుంటున్నప్పుడు
వాళ్ల పంటలకు పొలాల్లో మంటపెట్టుకుంటున్నప్పుడు
గిట్టుబాటు ధర రాక రైతు అప్పుతో
ఆత్మహత్య చేసుకుంటున్నప్పుడు
చంపి చావు ఖర్చులు ఇచ్చినట్టు మొసలి కన్నీటి ఓదార్పు
ఇదంతా రాజ్యం నిర్వాకం కదా
చెవులు పిండి చేతిలో పెట్టినట్టు
ప్రభుత్వాల రైతు సహాయ పథకాలు
గ్రామ గల్లీలలో నివసించే వారు
వాళ్ల ఢిల్లీని ముట్టడిస్తానన్నారు
లోహ కంచెలు సిమెంటు గోడలు
రోడ్డుపై ఇనుప మేకులు నాటారు
ఇప్పుడు ఖాకీ పహరాలో కోరికల జెండాను నిలువరించబోయి
మహా గొప్ప దేశ రాజధాని తనకు తాను కట్టడి వేసుకున్నది
టియర్ గ్లాసు సెల్స్
సరిహద్దులు కాపాడాల్సిన తుపాకులు
రైతులపై పెలెట్ల బుల్లెట్ల వర్షం కురిపిస్తుంది
చతురత చర్చల ముగింపు కాదు
వ్యవసాయదారిని ఆశ ఓ కొలిక్కి రాదు
వెలిగిపోతూ వికసిస్తున్న భారతం
పరిశ్రమలకు ఇసుమంత శ్రమ లేకుండా
అడ్డగోలుగా లక్షల కోట్లు రుణాలు
దారుణంగా మాఫీ అయిపోతాయి
ఈ దేశం కంట్లో నలుసు
రైతు అంటేనే ప్రతొక్కడికి అలుసు
కనులు పోగొట్టుకొని ప్రాణాలు ఎదురెడ్డి
వాళ్ల రోడ్లమీద రక్త సంతకాలు చేస్తుంటారు
మన కడుపుకింత తిండి పెడుతున్నోళ్లు
రౌద్రంతో కళ్ళు ఎర్ర మందార సముద్రాలయ్యారు
అడగంది అమ్మయినా అన్నం పెట్టదు
చచ్చిన తర్వాత సమాధిమీద ఆవు కట్టేసినట్టు
అశాంతిని రేపి శాంతి మంచం జప తపం
పంట పొలాన్ని నివాస స్థలాన్ని విడిచి వచ్చి ఏమి అడిగారు
దళారుల నుంచి కాపాడమన్నారు
పంటకు మద్దతు ధర చట్టబద్ధం చేయమన్నారు
వాళ్ల బతుకును బతకులా
వికసించనీయమన్నారు బతకనీయమన్నారు

- జూకంటి జగన్నాథం, 9441078095

సాహితీ వార్తలు

మార్చి 3న నెల్లూరులో అక్షరోత్సవం

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలులో మార్చి 3న ఉదయం 10 గంటలకు 'అక్షరోత్సవం' సాహితీ కార్యక్రమం జరగనుంది. ఇందులో తుంగా శివప్రభాత్ రెడ్డి, డా॥నందమూరి లక్ష్మీపార్వతి, మాడభూషి సంపత్ కుమార్, శ్రీరామకవచం సాగర్, బీరం సుందరరావు పాల్గొంటారు. యాకుబ్‌కు అవార్డును, బంగారాజు కంఠకు, మల్లెతీగ కలిమిశ్రీకి సాహిత్య పురస్కారాలను అందజేస్తారు. కవి సమ్మేళనం, కవులకు ఆత్మీయ సత్కారం వుంటాయి.

మార్చి 3న జలకవనం

వేసవిలో తాగునీటి సమస్యలను దృష్టిలో కారణంగా కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని సాహితీ స్రవంతి అనంతపురం జిల్లా పెనుకొండలోని గగన్‌మహల్ వేదికగా మార్చి 3వ తేది ఉ.10.30 గంటల నుండి రాత్రి 7.00వరకు నిరవధికగా జలకవనం నిర్వహిస్తున్నది. ఇందుకోసం కవులు, కళాకారులు తమపేర్లు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు : 9491355200

మార్చి 3న కథా గౌరవ సభ

పల్లిపాలెం కథా గౌరవ సభ మధునాపంతుల కామరాజు సాంస్కతిక ప్రాంగణం. పల్లిపాలెంలో మార్చి 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఇందులో ఆకుల మల్లేశ్వరరావు, తిరుపతి, అనిల్ డ్యానీ, భగవంతం, వంశీకష్ణ, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, కిరణ్ మధునాపంతుల పాల్గొంటారు. డా॥ చింతకింది శ్రీనివాస రావు, శ్రీమతి ఎండపల్లి భారతికి కథా గౌరవ పురస్కారాలు అందజేస్తారు. వివరాలకు : 9704186544.

సైన్స్ ఫిక్షన్ నవలల పోటీకి పునరాహ్వానం!

విశాల లలిత - కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలల పోటీకి నవలలు ఎక్కువగా రానందున గడువు పొడిగిస్తున్నారు. బహుమతుల విషయంలో కూడా కొన్ని ఆకర్షణీయమైన మార్పులు చేసి ప్రకటిస్తున్నారు. ఇదివరకే మాకు అందిన వాటి మార్పులు చేసి కూడా మళ్ళీ పంపవచ్చు. కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలలు పిల్లలూ, పెద్దలూ ఆసక్తిగా చదివేలా ఉండాలి. ఏ వయసు వారైనా 50-60పేజీలలోపు పోస్టు/ కోరియర్ ద్వారా మాత్రమే ఆగస్టు 1వ తేదీ లోపు 304, ఎండికోస్ కౌంటి అపార్ట్మెంట్, జెక్ కాలని, వీధి నెం: 2, సనత్ నగర్ - 500018 చిరునామాకు పంపాలి. వివరాలకు - వి.ఆర్. శర్మ 9177887749.

కొలకలూరి పురస్కారాలు - 2024

శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారం - 2024 కు ఎంపికైన కథలు... 1. 'కామునికంత' (హుమయున్ సంఘీర్) 2. 'కలుంకూరి గుట్ట' (కె.వి. మేఘనాథరెడ్డి). 'కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం - 2024' కు ఎంపికైన నవలలు 1. 'అడవి బతుకులు' (డా॥ దిలావర్), 2. 'నిర్మాల్యం' (సింహప్రసాద్). కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం - 2024'కు ఎంపికైనా విమర్శనాత్మక గ్రంథాలు : 1. 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' (డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి), 2. 'నవలా హృదయం -3' (వి. రాజారామమోహనరావు). ఈ నెల 26 వ తేదీ సాయంత్రం పురస్కార ప్రదాన సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (నాంపల్లి, హైదరాబాద్)లో జరుగుతుంది.



- ప్రొ॥కాత్యాయనీ విద్మహే,
9440550379

బన్న అయిలయ్య చైతన్య శక్తి


బన్న అయిలయ్యతో నాది మూడు దశాబ్దాలకు పైబడ్డ అనుబంధం. కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పదేళ్ల పాఠాలు చెప్పి బదిలీ మీద 1987లో తెలుగు విభాగంలోకి వచ్చేటప్పటికి అయిలయ్య ఎమ్.ఏ. రెండవ సంవత్సరం విద్యార్థి. ఆ రకంగా చూస్తే మా అధ్యాపక విద్యార్థి సంబంధ కాలం ఏడాది కూడా లేదేమో...! అయితేనేమి? సహ 'అధ్యాపకుడై జీవితకాలపు ఆత్మీయుడయ్యాడు. అతనితో పాటు సీతారాం, పంతంగి వెంకటేశ్వర్లు కూడా నాకు విద్యార్థి అధ్యాపక మిత్రులే. వాళ్ళ ముగ్గురి స్నేహం ముచ్చట గొలిపేది.

అంతర్జాతీయంగా మహిళా దశాబ్ది చైతన్యం, దేశీయంగా మరీ ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి కారంచేడు దళితుల మీద జరిగిన దాడి, అత్యాచారం ఘటనలపట్ల ఆగ్రహ ప్రకటనగా వ్యక్తమైన ఆత్మగౌరవ చైతన్యం కారణంగా 1985 తరువాత తెలుగుసాహిత్యం కొత్తవస్తువును, అభివ్యక్తి రీతులను, పదజాలాన్నీ సమకూర్చుకొని కొత్తశక్తితో, హెచ్చరికలతో తెలుగు సమాజాన్ని గొప్ప కుదుపుకు లోను చేసింది. ఆ కాలం కొలిమిలో కాలి 'నిప్పుకణిక' అయినవాడు అయిలయ్య. ఈ కాలానికి ప్రాతినిధ్యం వహించే రెండు కవితా సంకలనాలు చిక్కనవుతున్న పాట (1995), పదునెక్కినపాట (1996). ఆ రెండింటిలో అయిలయ్య కవితలు ఉన్నాయి.

"నడుస్తున్న కాలం మీద మణి కిరీటాన్ని నేను
మట్టి చరిత్ర వినా
మలిన చరిత్ర లేనివాణ్ణి" (అమలిన చరిత్ర, 1994) అంటూ ఆత్మగౌరవ ప్రకటనతో తన కవితా యాత్ర ప్రారంభించాడు.

"క్షతగాత్రమైన దేహాన్ని మోస్తూ/ కారంచేడు తిమ్మ సముద్రం చుండూరు" అనుభవాల నుండి "ఏ వ్యూహాలు లేకుండానే తెరచాపల్లెత్తి/ బతుకు సముద్రంలోకి దిగిన దళితులను ఇక ఏ తుఫానులూ అడ్డుకోలేవని నమ్మకాన్ని ప్రకటించటం ఈ కవితకు ముగింపు. అయిలయ్య రాసిన దీర్ఘ కవిత 'నిప్పుకణిక' 1998 లో ప్రచురించబడింది. దీనికి ముందుమాట రాసిన మద్దూరి నగేష్ బాబు "ఎన్ని హరితవనాలు మావి కాకుండాపోయాయి/ ఎన్ని అడవులమీది గాలులు మమ్మల్ని తాకకుండా వీదాయి" అన్న పంక్తులను ఉదహరిస్తూ ఒక ఉద్యమ నిర్లక్ష్య సూచన వాటిలోని విశేషమని, సమకాలీన దళితుల వాదనలోని అతి ప్రధానమైన అంశాన్ని సులభ సూత్రంగా కవిత్వం చేయగలిగాడని చెప్పటం అందుకు నిదర్శనం.

అదే సమయంలో దళిత కోణం నుండి సాహిత్య అధ్యయన విమర్శలు ప్రారంభించాడు అయిలయ్య. 1999 మార్చ్ లో తెలుగు విభాగం 'మహాభారతం నేటి ఆవశ్యకత' అనే అంశం మీద సెమినార్ పెడితే అందులో పత్రసమర్పణకు అతను ఎంచుకొన్న అంశం "మహాభారతం వర్ణవ్యవస్థ". దళిత కోణం నుండి చరిత్రను, జీవితాన్ని చూస్తూ వ్యాఖ్యానించటం తిరగ రాయటం, తిరిగి నిర్వచించటం దళిత ఉద్యమ లక్ష్యం అయినప్పుడు సాహిత్యం కూడా అందుకు మూలవనరు అవుతుంది. అప్పటికి స్త్రీవాద ఉద్యమ సందర్భం నుండి మహిళా జనజీవన కోణంతో ప్రాచీన ఆధునిక సాహిత్య అధ్యయన విమర్శ కొనసాగిస్తున్న నాకు డిపార్ట్‌మెంట్‌లో అయిలయ్య అలా దళితవాద కోణం నుండి ప్రాచీన సాహిత్య అధ్యయనానికి పూనుకొనటం సంతోషాన్ని కలిగించింది.



దళిత సామాజిక వర్గం నుండి వచ్చిన కవులు, కథకులపై విస్తృతంగా పరిశోధనలు చేయించటమైనా, దళిత రచయితల రచనలపై తాను స్వయంగా విమర్శలు రాయటమైనా అందులో భాగమే. తెలుగుసాహిత్యంపై మహాత్మగాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రభావం అనే అంశం మీద 2009-2011 లో మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్ కు పని చేయటం దానికి కొనసాగింపే.

తరువాత అతను ప్రబంధ సాహిత్యాన్ని కూడా వర్ణ వ్యవస్థ కోణం నుండి అధ్యయనం చేస్తూ ఒక వ్యాసం రాసాడు. కానీ ఎందుచేతనో దానిని తరువాతి కాలంలో పెద్దగా కొనసాగించలేదు. అలాగని అతను దళితవాద అధ్యయనం వదిలేశాడని కాదు, ఆధునిక సాహిత్యం పట్ల ఉన్న అభినివేశంతో వచన కవిత్వానికి, వచన సాహిత్య ప్రక్రియలైన కథ, నవలలకు పరిమితం చేసుకొన్నాడు అంతే! దళిత సామాజిక వర్గం నుండి వచ్చిన కవులు, కథకులపై విస్తృతంగా పరిశోధనలు చేయించటమైనా, దళిత రచయితల రచనలపై తాను స్వయంగా విమర్శలు రాయటమైనా అందులో భాగమే. తెలుగుసాహిత్యంపై మహాత్మగాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రభావం అనే అంశం మీద 2009-2011 లో మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్ కు పని చేయటం దానికి కొనసాగింపే.

అయిలయ్య దళిత అస్తిత్వ చైతన్యం నుండే కాదు, అదే స్థాయిలో ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం నుండి కూడా పనిచేశాడు. 1997 లో వరంగల్ లో జరిగిన జన సభ ప్రజాస్వామిక ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ అని ప్రకటిస్తూ విడుదల చేసిన వరంగల్ డిక్లరేషన్ ప్రేరణగా తెలంగాణా సాహిత్యం పై తెలుగు విభాగం 1998 మార్చ్ లో నిర్వహించిన సెమినార్ తెలంగాణ సాహిత్యం ఒక ప్రత్యేకమైన పేపర్‌గా ఎమ్మే విద్యార్థుల అధ్యయనానికి రూపొందించాలని, పరిశోధనలు, విమర్శ తెలంగాణా సాహిత్యం కేంద్రంగా విస్తరింప చేయాలనీ తీర్మానాలు చేయబడ్డాయి. ఆ నేపథ్యంలో అయిలయ్య తెలంగాణ కవులు, రచయితలకు సంబంధించిన రచనలపైన పరిశోధనకు విద్యార్థులను ప్రోత్సహించాడు.

ఇక తెలుగువిభాగంలో వివిధ హోదాలలో ఇద్దరం కలిసి పనిచేసిన కాలపు అనుభవాలు అనేకం. తెలంగాణా సాహిత్యం, దళిత సాహిత్యం పేపర్లు రూపొందించటం, తెలంగాణ సాహిత్యం కాప్ స్పెషల్ అసిస్టెన్స్ రెండవ దశ ప్రాజెక్ట్ కోసం ఇద్దరం కలిసి ప్రతిపాదనలు తయారుచేయటం, కలిసి డిల్లీ వెళ్లి యూజీసీ టీమ్ ముందు చర్చకు పెట్టి గ్రాంట్స్ సాధించుకొని రావటం, ప్రాజెక్ట్ పనులను ప్రణాళికా బద్ధంగా నిర్వహించటం, అరుదైన పుస్తకాల సేకరణలో ఆనందం పొందటం, తెలంగాణ సాహిత్య గ్రంథాలయాన్ని అభివృద్ధిపరచటం, సెమినార్లు నిర్వహించటం అన్నీ తలచుకొంటే ఎంతో తృప్తిగా అనిపిస్తుంది. సాహిత్య విమర్శకు, తెలుగు విభాగం వికాసానికి సంబంధించిన ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకొనటం మా స్నేహాన్ని సాంద్రతరం చేశాయని చెప్పగలను. నేను రిటైర్ అయి ఎనిమిదేళ్ళయినా మీరు డిపార్ట్‌మెంట్ మనిషి అంటూ సెమినార్లు మొదలైన సందర్భాలలో సంప్రదిస్తూ, నన్నూ భాగస్వామిని చేస్తూనే వచ్చాడు అయిలయ్య. అయిలయ్య కూడా రిటైర్ అవుతున్నాడంటే నమ్మలేకపోతున్నాను. మనకు ఇష్టమున్నా లేకపోయినా కాలం తెచ్చే అనివార్యమైన సందర్భాలు మనలను నడిపిస్తాయి. ఉద్యోగ విరమణ తరువాత కూడా చేతినిండా పని ఉండాలని, అయిలయ్య శక్తులు వినియోగంలోనే ఉండాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

అమెరికాలో అగ్నిప్రమాదంలో భారత్ జర్నలిస్ట్ మృతి

నూయార్క్ : అమెరికాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. న్యూయార్క్ నగరంలోని హార్లెమ్ ప్రాంతంలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో భారత్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ ప్రాణాలు కోల్పోయాడు.స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భారత్‌కు చెందిన ఫాజిల్ ఖాన్ (27) గతంలో ఓ ప్రముఖ మీడియా సంస్థలో కాపీ ఎడిటర్‌గా పనిచేశాడు. అయితే జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసేందుకు 2020లో న్యూయార్క్ వెళ్లాడు. అక్కడి కొలంబియా జర్నలిజం స్కూల్‌లో కోర్సును పూర్తి చేశాడు. అనంతరం అతడు అక్కడే ఉంటున్నాడు. శుక్రవారం ఫాజిల్ నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది.

అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఈబైక్ బ్యాటరీ కారణంగా మంటలు వ్యాపించాయి. ఈ మంటలు వేగంగా భవనం మొత్తం చెలరేగాయి. దీంతో భవనంలో చిక్కుకుపోయిన ఫాజిల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో సుమారు 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. పలువురు ప్రాణాలు దక్కించుకునేందుకు కిటికీల్లోంచి బయటకు దూకేశారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించింది.

మరోవైపు ప్రమాద ఘటనపై భారతీయ ఎంబసీ స్పందించింది. ఫాజిల్ మృతిపట్ల విచారం వ్యక్తం చేసింది. అతడి కుటుంబసభ్యులతో టచ్‌లో ఉన్నామని, వారికి కావాల్సిన అన్ని సహాయసహకారాలు అందిస్తామని ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. మృతదేహాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొంది.

యూపీలో అగ్నిప్రమాదం..

- నలుగురు మృతి



రాయ్‌బరేలి : ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కౌశాంబి జిల్లాలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడుసంభవించింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు మరణించారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మన్ కీ బాత్‌కు తాత్కాలిక బ్రేక్

- వచ్చే మూడు నెలలు ప్రసారం కాదు : ప్రధాని మోడీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీ ప్రతి నెలా చివరి ఆదివారం ఆల్ ఇండియా రేడియోలో చేస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమానికి తాత్కాలిక బ్రేక్ పడింది. రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మన్ కీ బాత్ కార్యక్రమం వచ్చే మూడు నెలలు ప్రసారం కాదని మోడీ స్వయంగా వెల్లడించారు. మన్ కీ బాత్ 110 వ ఎపిసోడ్‌లో మోడీ ఈ విషయాన్ని ప్రకటించారు. ఆదివారం ఉదయం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. 'లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వచ్చే మూడు నెలల పాటు మన్ కీ బాత్ ప్రసారాలు ఉండవు' అని ప్రకటించారు. ఎన్నికల అనంతరం ఈ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'మన్ కీ బాత్ మూడు నెలల పాటు ఆగిపోవచ్చు. కానీ దేశం సాధించిన విజయాలు మాత్రం ఆగవు. అందువల్ల మన్ కీ బాత్ హ్యాష్‌ట్యాగ్‌తో సమాజం, దేశం సాధించిన విజయాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఉండండి' అని తన 110 వ ఎపిసోడ్‌లో మోడీ తెలిపారు. ఎన్నికల అనంతరం 111వ ఎపిసోడ్ ప్రసారం అవుతుందని వెల్లడించారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- హోదా ఇస్తేనే అసలైన నిబద్ధత నిరూపితం
- వెంకయ్య నాయుడు, ప్రధాని మోడీ ఇద్దరూ సమాధానం చెప్పాలి : కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీ జోక్యం చేసుకుని.. ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కల్పించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014 ఫిబ్రవరిలో రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీ మేరకు ప్రధాని మోడీ రాష్ట్రానికి ప్రత్యేక కేటగిరీ హోదా కల్పిస్తేనే ఆంధ్రప్రదేశ్ పట్ల అసలైన నిబద్ధత నిరూపితమవుతుందని పేర్కొన్నారు. గత వారం రోజులుగా మంగళగిరిలో ఎయిమ్స్, తిరుపతిలో ఐఐటీని ప్రధాని మోడీ ప్రారంభించారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. "ఈ రెండు సంస్థలు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఇచ్చిన హామీలే. అయితే ప్రధాని మోడీ ఇప్పుడు వీటిని తన వల్లే వచ్చినట్టు చెప్పుకుంటున్నారు" అని జైరాం రమేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిని పటిష్టం చేసేందుకు ప్రధాని రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తేనే ఆంధ్రప్రదేశ్ పట్ల ఉన్న నిజమైన నిబద్ధత నిరూపితమవుతుందని అన్నారు. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదా హామీకి కట్టుబడి ఉన్నారని రమేశ్ చెప్పారు.

"మన్మోహన్ సింగ్ ఇచ్చిన మాట ప్రకారం ఏపీకి ప్రత్యేక హోదాకు ఐదేండ్ల పాటు కట్టుబడి ఉంటామన్నారు. అప్పటి బీజేపీ ఎంపీ ఎం. వెంకయ్య నాయుడు లేచి ఇలా ప్రకటించారు. కేవలం ఐదేండ్లు ఎందుకు? బీజేపీ ప్రభుత్వం వస్తే.. పదేండ్లు ఇస్తుందని అన్నారు" అని జైరాం రమేశ్ గుర్తు చేశారు. "వెంకయ్య నాయుడు, ప్రధాని మోడీ ఇద్దరూ సమాధానం చెప్పాలి" అని రమేశ్ అన్నారు.

కొనసాగుతోన్న రైతు ఆందోళన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతుల ఆందోళన కొనసాగుతూనే ఉన్నది. ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. రైతుల పండించిన అన్ని పంటలకు సి2 ప్లస్ 50 శాతంతో కూడిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టం చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని, రైతులకు బీమా, పెన్షన్ సదుపాయం కల్పించాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఆదివారం హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభు, ఖానౌరీ ప్రాంతాల్లో రైతుల ఆందోళనల్లో భారీ సంఖ్యలో రైతులు, వివిధ వర్గాల ప్రజలు చేరారు. అందులోనూ మహిళలు ఎక్కువ మంది ఆందోళనలో భాగమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించిన ఐదో రౌండ్ చర్చలకు తేదీ ఇంకా ఖరారు కాలేదు. దీంతో రైతులు తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తున్నారు. పోలీసుల కాల్పుల్లో యువ రైతు మరణం నేపథ్యంలో 29 వరకు సరిహద్దుల్లోనే రైతులు తమ ఆందోళన కొనసాగించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు కాల్పులు జరిపిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో ఆ యువ రైతు పోస్టుమార్టానికి రైతు సంఘాలు, కుటుంబ సభ్యులు అనుమతించలేదు. అలాగే హర్యానాలోని ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్, బల్క్ మెసేజ్ లు, వాయిస్ కాల్స్‌ను పునరుద్ధరించారు. ఢిల్లీ-హర్యానా సరిహద్దులైన సింఘూ, టిక్రీల వద్ద పోలీసులు బారికేడ్లు పాక్షికంగా తొలగించారు. రాకపోకలకు అనుమతించారు.

నేడు వాహనాల ర్యాలీ

డబ్ల్యూటీవో నుంచి భారత్ బయటకు రావాలి

- ఎస్‌కేఎం పోస్టర్ ఆవిష్కరణలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) నుంచి భారతదేశం బయటికి రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీ నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ర్యాలీ పోస్టర్‌ను ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, వి. ప్రభాకర్, పల్లపు ఉపేందర్‌రెడ్డి, ఆర్.వెంకట్ రాములు, గౌని ఐలయ్య, డేవిడ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు అబుదాబీలో డబ్ల్యూటీవో సదస్సు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా క్విట్ ఇండియా డేగా పాటిస్తున్నట్టు తెలిపారు. రైతులకు మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎంఎస్పీ) మంజూరు చేయకుండా భారత ప్రభుత్వాన్ని బలవంతం చేయడంతో పాటు సబ్సిడీల ప్రయోజనాలను నేరుగా బదిలీ చేయాలని వాదించడం ద్వారా పీడీఎస్‌ను ఉపసంహరించుకోవాలని డబ్ల్యూటీవో ఒత్తిడి చేస్తున్నదని ఆరో పించారు. ఈ రెండు ప్రతిపాదనల వల్ల రైతులు, పేద ప్రజలు, ఆహార భద్రత తో పాటు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేసి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిరసనలో మృతి చెందిన వారికి రూ. కోటి నష్ట పరిహారంతో పాటు, ధ్వంసమైన 100 ట్రాక్టర్ల మరమ్మతు ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే మార్చి 14న ఛలో ఢిల్లీ కార్య క్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం నాయకులు గోవర్దన్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, హన్మేష్, అరుణ, అనురాధ, సీతారామయ్య, శంకర్ డీవైఎఫ్ఐ నాయకులు కోట రమేష్, పీవైఎల్ నాయకులు ప్రదీప్.పీడీఎస్‌యూ నాయకులు గడ్డం శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత, ఉపాధికి ఉద్యమం

నిరుద్యోగాన్ని పెంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే




అమరావతి : ఆహార భద్రత, పట్టణ ఉపాధి హామీ చట్టం కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, జగన్ ప్రభుత్వాలు ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగంలోని లక్షలాది ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు జరిగిన ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగంలో మహిళలు పెరుగుతున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు పెడుతోందని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో పది కోట్ల జాబ్ కార్డులు తగ్గిపోయాయని చెప్పారు. ప్రభుత్వం జాబ్ కార్డులను డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫారంతో లింక్ చేస్తోందని, అయితే, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయని విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ప్రభుత్వం 'ఉపాధి' బడ్జెట్‌ను తగ్గించి గ్రామీణ భారతదేశంలో ఏదో ఒక రకమైన పనిని పొందే హక్కును కూడా ప్రజలకు లేకుండా చేస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని మోడీ గొప్పలు చెబుతున్నా, వాస్తవం దానికి భిన్నంగా ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం అత్యల్పంగా ఉందని తెలిపారు. తలసరి ఆదాయంలో ప్రపంచంలో మన దేశం 142వ స్థానంలో ఉందని వివరించారు. గ్రాడ్యుయేట్లలో దాదాపు 50 శాతం మంది నిరుద్యోగులు ఉన్నారని, ప్రయివేటీకరణ కారణంగా అనేకమంది ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు జరుగుతున్న కుట్రలను ఖండించారు.

మహిళల్లో రక్తహీనత

ఆంధ్రప్రదేశ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో మహిళలు రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతున్నారని మరియం ధావలే తెలిపారు. దేశంలో రక్తహీనత పెరిగిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) తెలిపిందని గుర్తు చేశారు. ఆ సర్వే నివేదిక ఇచ్చినందుకు ఎన్ఎఫ్‌హెచ్ఎస్ డైరెక్టర్‌ను కేంద్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడమే కాకుండా సర్వే రిపోర్టు ఇవ్వడం ఆపివేయాలని నిర్ణయించడం శోచనీయమన్నారు. నిజాలు ఎవరికీ తెలియరాదనే ఆ పని చేసిందని విమర్శించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, ఏపీలో 14 రకాల నిత్యావసర వస్తువులను చౌకధర దుకాణాల ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో ఐదు కేజీల బియ్యం తప్ప మరేమీ దొరకడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకులను 2024 ఎన్నికల్లో ఓడించకపోతే సాధారణ ప్రజలు నష్టపోతారని తెలిపారు. మీడియా సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షులు పికె.శ్రీమతి, కోశాధికారి ఎస్.పుణ్యవతి, ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ వై.సత్యవతి పాల్గొన్నారు.

అది యుద్ధం కాదు, మారణహోమం

ఇజ్రాయిల్‌పై మండిపడ్డ బ్రెజిల్ అధ్యక్షుడు లూలా



డెయిల్ అల్-బలా, గాజా : గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడుతోందంటూ బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా విమర్శించారు. గాజపై ఇజ్రాయిల్ మిలటరీ దాడులు నాజీల అకృత్యాలను తలపిస్తున్నాయంటూ వారం రోజుల క్రితమే లూలా తీవ్రంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో నేడు మరోసారి ఘాటుగా విమర్శించారు. 'అబద్ధాలు, అసత్యాలకు పరువును వదులుకోను' అంటూ ఎక్స్‌లో లూలా పోస్టు పెట్టారు. గాజాలో ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరును నాజీల దారుణాలతో పోలుస్తూ తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వస్తున్న డిమాండ్లను ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు పెట్టారు. 'ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తోంది యుద్ధం కాదు, మారణహోమం, మహిళలు, పిల్లలను హతమారుస్తున్నారు.' అని ఆయన శనివారం నాటి పోస్టులో స్పష్టం చేశారు. లూలా గత వారం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఇజ్రాయిల్ ఆయనను అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించింది. బ్రెజిల్ రాయబారిని పిలిపించి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్‌లో బ్రెజిల్ రాయబారిని చర్చల నిమిత్తం లూలా వెనక్కి పిలిపించారు. ఇజ్రాయిల్‌పై విచారణ చేపట్టాలంటూ గత నెల్లో దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయ స్థానంలో ఫిర్యాదు చేసింది.

టార్గెట్ యెమెన్

- అమెరికా కూటమి దాడులు





అమెరికా, బ్రిటన్ ల కూటమి నౌకాదళ వాయుసేన శనివారం నుంచి హౌతీస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని యెమెన్ పైన దాడులు చేస్తోంది. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననానికి నిరసనగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ జలాలలో గత నవంబర్ నుంచి వాణిజ్య రవాణా నౌకలపైన హౌతీస్ చేస్తున్న దాడులకు ప్రతిగా అమెరికా యెమెన్ పైన దాడులు చేస్తోంది. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న ఘోరమైన దాడులలో ఇప్పటికే 35వేలమందికి పైగా పాలస్తీనా జాతీయులు చనిపోయారు.

అమెరికా, బ్రిటీష్ దళాలు సంయుక్తంగా చేస్తున్న నాలుగవ దాడి యెమెన్ లోని 18లక్ష్యాలపైన జరిగింది. దాడులకు గురైన ప్రాంతాలలో భూగర్భంలో దాచిన ఆయుధాలు, మిసైల్స్, వైమానిక దాడుల నుంచి రక్షించుకునే వ్యవస్థలు, రాడార్లు ఉన్నాయని అమెరికా, బ్రిటన్ కూటమి దేశాలైన ఆస్ట్రేలియా, బహరైన్, కెనడా, డెన్మార్క్, నెదర్లాండ్స్, న్యూజీలాండ్ దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. హౌతీస్ మిలిటెంట్లు ఇప్పటి వరకు 45సార్లు దాడులు చేశారని, దీనికి అంతర్జాతీయ సమాజం స్పందించాలని ఆ ప్రకటన కోరింది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన జల మార్గంలో వాణిజ్యం సజావుగా సాగటానికి ఎటువంటి చర్యలనైనా తీసుకోవటానికి సిద్ధంగా ఉంటామని అమెరికా రక్షణ శాఖ ఒక ప్రత్యేక ప్రకటనను విడుదల చేసింది.

యెమెన్ పైన వైమానిక దాడులు జరిగిన గంటలలోనే హౌతీస్ ఒక అమెరికా చమురు నౌకపైన, యుద్ధ నౌక పైన దాడులు చేశారని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ రిపోర్ట్ చేసింది. అంతకుముందు అమెరికా, బ్రిటీష్ దళాల యెమెన్ దురాక్రమణను తిప్పికొడతామని హౌతీ మిలిటెంట్లు ప్రకటించారు.

ప్రపంచ సమరం

పశ్చిమ దేశాల పతనం అనివార్యం!

- లాటిన్ అమెరికా నాయకుడు



అమెరికా ఆర్థిక వ్యవస్థ అపరిమితంగా డాలర్లను ప్రింట్ చేయటమనే బూటకపు పునాది మీద ఆధారపడి ఉందని, ఈ బుడగ అనివార్యంగా పేలినప్పుడు పశ్చిమ దేశాల నాగరికత పతనం అవుతుందని ఎల్ సాల్వెడార్ అధ్యక్షుడు నయిబ్ బర్కిలీ అన్నాడు. 84% ఓట్లతో రెండవ సారి ఎల్‌సాల్వెడార్ అధ్యక్షుడిగా గెలిచాక కన్సర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కమిటీ(సిపిఏసి) సమావేశంలో పాల్గొనటానికి శనివారం మేరీల్యాండ్ కి వచ్చినప్పుడు చేసిన ఉపన్యాసంలో ఆయన ఇలా మాట్లాడాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సమూల మార్పులు తేవాలని ఆయన తన ఉపన్యాసాన్ని ముగిస్తూ విజ్ఞప్తి చేశాడు. బర్క్ లీ బిట్ కాయిన్ ను చట్టబద్ధం చేయటాన్ని, క్రిమినల్ గ్యాంగ్‌లను నిర్దాక్షిణ్యంగా అణచివేయటాన్ని అమెరికాలోని మితవాదులు విపరీతంగా పొగుడుతున్నారు.

పన్నులు ఎక్కువగా ఉండటమే సమస్య అని అమెరికన్ మితవాదులు తరచూ చెబుతుంటారని, అది సరియైనది కాదని ఎల్ సాల్వెడార్ అధ్యక్షుడు అన్నాడు. అసలు సమస్య ఏమిటంటే ఎక్కువ స్థాయిలో పన్నులు చెల్లించి ప్రభుత్వాన్ని నడుపుతున్నామనే భ్రమలో వీరు ఉంటారని, వాస్తవం అది కాదని ఆయన అన్నాడు. అసలు జరుగుతున్నదేమంటే ప్రభుత్వం ట్రెజరీ బాండ్ల తో నడుస్తోందని, ఈ బాండ్లను ఫెడరల్ రిజర్వ్(అమెరికా రిజర్వ్ బ్యాంక్ పేరు) తాను ప్రింట్ చేసిన డబ్బుతో, ఆ బాండ్ల హామీతోనే కొంటుందని బర్క్‌లీ అన్నాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే "ప్రభుత్వానికి నిధులు నగదును ప్రింట్ చేయటం ద్వారా అందుతాయని, కాగితాన్ని కాగితం హామీతో ప్రింట్ చేయటమనే బుడగ అనివార్యంగా పేలుతుంది. ఈ విషయం అమెరికన్లకు, మిగిలిన ప్రపంచానికి అర్థం అయితే మీ కరెన్సీపైన విశ్వాసం పోతుంది. డాలర్ పతనం అవుతుంది. దానితోపాటు పశ్చిమ దేశాల నాగరికత పతనం అవుతుంది. ఒకవేళ రాబోయే అమెరికా అధ్యక్షుడు అవసరమైన విధాన నిర్ణయాలను, నిర్మాణంలో మార్పులను చేపట్టకపోతే ఎప్పుడోఒకప్పుడు ఈ బుడగ పేలుతుంది. ప్రభుత్వాన్ని పై నుంచి కింద దాకా రీఇంజినీరింగ్ చేయవలసి ఉంటుంది."

1971లో డాలర్ కు బంగారం హామీని రద్దు చేసి రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఆవిర్భవించిన బ్రెట్టన్ వుడ్స్ వ్యవస్థ నియమాలను అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఉల్లంఘించాడు. ఆ వ్యవస్థ లో డాలర్ ను ఒక ఫిక్స్‌డ్ రేటులో బంగారానికి మార్చుకునే ఏర్పాటు ఉండేది. అప్పటి నుంచి అమెరికా జాతీయ ఋణం విపరీతంగా పెరిగింది. 1971లో 232బిల్లియన్లు గావున్న అమెరికా జాతీయ ఋణం ఈ సంవత్సరం ప్రారంభంలో 34ట్రిల్లియన్లు (1ట్రిల్లియన్ 1000బిల్లియన్లకు సమానం) అయింది. గత జూన్ లో అమెరికా జాతీయ ఋణ పరిమితిని పెంచటానికి రిపబ్లికన్ శాసన సభ్యులు అధ్యక్ష భవనంతో ఒక ఒప్పందం చేసుకున్నారు. అలా ఒక పెను దివాళాను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ ఒప్పందం 2025దాకా అమలులో ఉంటుంది.

2019లో బర్కిలీ అధ్యక్షుడు అయ్యేనాటికి ఎల్ సాల్వెడార్ లో ఒక లక్ష మందికి 38 హత్యలు జరుగుతుండేవి. వీటిని గత సంవత్సరాంతం కల్లా 2.4కి ఆయన తగ్గించగలిగాడు. 2022లో దేశంలో ఎమర్జన్సీని విధించి 75వేల మంది అనుమానిత హంతక ముఠాలను బర్కిలీ జైళ్ళలో పెట్టాడు. ఈ చర్యను మానవ హక్కుల సంఘాలు నిరసించాయి. అమెరికా నగరాలలో విచ్చలవిడిగా సాగుతున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని, విపరీతంగా పెరుగుతున్ననేర ప్రవత్తిని నియంత్రించటానికి తన అనుభవాన్ని ఉపయోగించుకోవాలని ఆయన అమెరికాకు విజ్ఞప్తి చేశాడు

ఫేక్‌పోల్స్ షెడ్యూల్‌ను నమ్మకండి

- మీడియా సమావేశం ద్వారానే ఎన్నికల ప్రకటన : ఎన్నికల సంఘం వివరణ
- రాష్ట్రాలు, యూటీలకు ఈసీ కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించినదిగా చెప్పబడుతున్న ఫేక్ షెడ్యూల్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారటంపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. ఇందులో నిజం లేదని వెల్లడించింది. ఎన్నికల షెడ్యూల్ మీడియా సమావేశం ద్వారా ప్రకటిస్తామనీ, టెక్స్, వాట్సాప్ మెసెజ్‌ల ద్వారా కాదని స్పష్టం చేసింది. లోక్‌సభకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయంటూ ఓ ఫేక్ మెసేజ్ ప్రచారంలోకి రావటంతో పై విధంగా ఈసీ వివరణనిచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఒక ఫేక్ మెసేజ్ మార్చి 12న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనీ, నామినేషన్ల దాఖలుకు గడువు మార్చి 28 అనీ, పోలింగ్ తేదీ ఏప్రిల్ 19, ఫలితాలు మే 22న వెలువడతాయని వివరించింది. పోల్ బాడీకి చెందిన లెటర్‌హెడ్ కనిపించే ఈ నకిలీ సమాచారం వాట్సాప్ గ్రూపుల్లో హల్ చల్ చేసింది. దీంతో ఇది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికలను ఒకే దశలో ఎలా నిర్వహిస్తారని పలు ప్రశ్నలు వెల్లడయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం జోక్యం చేసుకొని ఫేక్ మెసేజ్‌పై స్పందించాల్సి వచ్చింది.

బీజేపీకి ఒమర్ అబ్దుల్లా సవాల్



ముంబయి : జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బీజేపీకి సవాలు విసిరారు. ముంబయిలో 'ఐడియాస్ ఆఫ్ ఇండియా' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 2024లో జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో అభివృద్ధి, శాంతి స్థాపనకు కృషి చేశామని బీజేపీ చెప్పుకోవటాన్ని తప్పు పట్టారు. కేంద్ర ఎన్నికల సంఘంతో కాకుండా సుప్రీం కోర్టుతో జమ్మూకాశ్మీర్ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పించడమేమిటని ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నిల్లో తమ పార్టీ జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.2019 తర్వాత ఐదేండ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించకపోవడం సిగ్గుచేటని అన్నారు. 2024లో జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని, తాము బీజేపీతో పోరాడతామని అన్నారు. జమ్ముకాశ్మీర్ ప్రజల హక్కులు, భూములతో పాటు కాశ్మీర్‌ను యథాస్థితికి తీసుకురావడానికి పోరాడతామని అన్నారు. 2019 తర్వాత కాశ్మీర్‌లో శాంతి స్థాపన జరిగినపుడు ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.

సొంత ఇలాకాలో నిక్కీ హేలీ పరాజయం

- ఓడించిన డొనాల్డ్ ట్రంప్






వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్నారు. దక్షిణ కరోలినా రిపబ్లికన్ ప్రైమరీలో ఘన విజాయం సాధించారు. ట్రంప్ హవా ధాటికి సొంత రాష్ట్రంలో నిక్కీ హేలీకి ఓటమి తప్పలేదు. మాజీ అధ్యక్షుడికి 63 శాతం ఓట్లు రాగా హేలీకి 36.8 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయన ఇప్పటికే న్యూ హాంప్ షైర్, నెవడా, ఐయోవా, వర్జిన్ ఐలాండ్స్‌లో విజయం సాధించారు.

రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న భారత సంతతికి చెందిన హేలీ గతంలో రెండుసార్లు సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేశారు. తన కంచుకోటలోనే ఓడిపోవడంతో.. అధ్యక్ష పదవి పోటీకి ట్రంప్ అభ్యర్థిత్వం ఖాయమైపోయినట్లేనని ప్రచారం జరుగుతున్నది. నిక్కీ హేలీ పార్టీ అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీ నుంచి తప్పుకోవాలని ట్రంప్ వర్గం డిమాండ్ చేస్తున్నది. అయితే తాను రేసు నుంచి తప్పుకునేది లేదని ఆమె ప్రకటించారు. మార్చి 5న జరిగే పలు స్టేట్ ప్రైమరీ ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

ఐఎన్ఎల్డీ హర్యానా చీఫ్ నఫే సింగ్ రాఠీపై కాల్పులు జరిపి హత్య





చండీగఢ్: ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్డీ) పార్టీకి చెందిన హర్యానా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నఫే సింగ్ రాఠీ కారుపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. బులెట్ల గాయాలైన ఆయన అక్కడికక్కడే మరణించారు. హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. బహదూర్‌గఢ్‌లోని బరాహి గేట్ సమీపంలో హ్యుందాయ్ ఐ10లో ఉన్న షుటర్లు నఫే సింగ్ ప్రయాణిస్తున్న కారుపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పారిపోయారు. ఈ కాల్పుల్లో నఫే సింగ్‌తోపాటు ఆ కారులో ఉన్న మరో ఇద్దరు పార్టీ నేతలు మరణించారు. ముగ్గురు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.

తెలంగాణలో రెండు రోజులు వానలు.

హైదరాబాద్ : తెలంగాణలో రెండురోజులపాటు వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని పేర్కొంది.

వైవిధ్య భారత్‌ను కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

సందేహాలకు తావులేని విధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆకాంక్షించారు. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఆదివారం 'రాజ్యాంగం, జాతీయ ఐక్యత' సదస్సు నిర్వహించారు. జమ్ముకాశ్మీర్ పూర్వ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా సదస్సులో ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, కర్నాటక సామాజిక న్యాయ శాఖ మంత్రి ఎంహెచ్ మహదేవప్ప, పార్టీ సీనియర్ నేత సూర్జేవాలా పాల్గొన్నారు.

కాశ్మీర్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే : ఫరూఖ్

జమ్ముకాశ్మీర్ ఇదివరకు, ఇప్పుడు, భవిష్యత్‌లో ఎల్లప్పుడూ భారత్‌లో అంతర్భాగమేనని సదస్సు ప్రారంభోపన్యాసంలో ఫరూఖ్ అబ్దుల్లా చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ల వినియోగంపై కొన్ని అనుమానులు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సందేహాలను నివృత్తి చేసి, ఎన్నికలను సజావుగా నిర్వహించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'కాశ్మీర్ ప్రజల తరపున మీకందరికీ శుభాకాంక్షలు. కాశ్మీర్ భారత్‌లో భాగమే. ఇదివరకు భారత్‌లోనే భాగంగా ఉంది. భవిష్యత్‌లోనూ భాగంగానే ఉంటుంది' అని అబ్దుల్లా అన్నారు. దేశ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. విశిష్టమైన ఈ లక్షణాన్ని మరింత పటిష్టపర్చుకోవాల్సివుందని ఆయన తెలిపారు. మతం మనల్ని ఎప్పుడు విడదీయలేదని, వాస్తవానికి ఐక్యం చేస్తుందని ఆయన చెప్పారు. చెడు ఏదైనా దానికి మతం ఉండదని, మనమే దానికి మతం అంటగడుతున్నామని పేర్కొన్నారు. పురోగమనంలో వెళ్లాలనుకుంటే ఒకరినొకరు కలిసికట్టుగా సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్లడమే ఏకైక మార్గమని చెప్పారు. దేశ ప్రజానీకం గతంలోనూ ఎన్నో సవాళ్లను ఐక్యంగా ప్రతిఘటించిందని, విడదీసే ప్రయత్నాలను తిప్పికొట్టిందని ఈ సందర్భంగా ఫరూఖ్ గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ రాజ్యాంగమే ప్రమాదంలో పడిందని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఐక్యతతో కృషి చేసి పరిరక్షించుకొని, మరింత పటిష్టపర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక వేళ మనం ఈ కృషి చేయకపోతే రాబోయే రోజుల్లో చింతించాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. ఇప్పుడు ఈవీఎంల విషయంలో చింతిస్తున్నట్లే రాజ్యాంగం విషయంలోనూ విచారపడాల్సివస్తుందని పేర్కొన్నారు. 'ప్రస్తుతం ప్రజల్లో ఓటింగ్ యంత్రాలపై నమ్మకం లేదు. ఇవిఎంల్లో అక్రమాలకు పాల్పడే అవకాశాలను కొట్టిపారేయలేం. సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది' అని ఆయన అన్నారు.



(ఫైల్)

ఫాసిస్టు బాట పడుతున్న బీజేపీ : ఏచూరి

లౌకిక, ప్రజాస్వామ్య భారత్‌ను ఫాసిస్టు 'హిందూ రాష్ట్ర'గా మార్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ నిర్దేశంలో బీజేపీ ముమ్మరంగా ప్రయత్నిస్తోందని సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. మనుస్మృతి భావజాలంతో అసమానతలు, అంటరానితనంతో కూడిన కులాధిపత్య సమాజాన్ని నిర్మించాలన్నదే వారి లక్ష్యమని పేర్కొన్నారు. 'రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో ఈ జాఢ్యాలన్నిటిని మనం చరిత్రలో కలిపేశాం. బీజేపీ ఈ రుగ్మతల దిశగా మనల్ని తిరోగమనం పట్టించేందుకు యత్నిస్తోంది. మనం దేశాన్ని ప్రగతిశీల వెలుగులతో పురోగమనం వైపు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాం. అందువల్ల ఇప్పుడు జరుగుతున్న పోరాటం భారత తిరోగమనాన్ని కోరుకుంటున్న మితవాద శక్తులకు, భారత పురోగమనం కాంక్షిస్తున్నవారికి మధ్య జరుగుతున్న పోరాటం' అని ఏచూరి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దానికి నేతృత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఏచూరి విమర్శించారు. ఇలాంటి వారిని ఓడించితీరాలని ఆయన కోరారు. దేశ పరిరక్షణ కోసం అమృతకాలాన్ని నిజమైన ప్రజల అమృతకాలంగా మార్చేందుకు భారత ప్రజలమంతా ఐక్యంగా పోరాడాలని, మన గౌరవాన్ని, మన వైవిధ్యతను, సమానత్వాన్ని పునరుద్ధరించుకోవాలని ఏచూరి పిలుపునిచ్చారు.

విశాఖలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభం



విశాఖ : విశాఖ మహానగరం దేశంలో పర్యాటక రంగానికే తలమానికంగా నిలవనుందని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి అన్నారు. బీచ్ రోడ్డులో వైఎంసిఎ సమీపాన విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి (నీటిపై తేలియాడే వంతెన)ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా సాగరతీరంలో సుమారు 25 కిలో మీటర్ల మేర పలు ప్రాజెక్టులను చేపట్టామని, దానిలో భాగంగానే సుమారు రూ.1.60 కోట్ల వ్యయంతో ఫ్లోటింగ్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కైలాసగిరి వద్ద రూ.5 కోట్లతో స్కై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించామని, అది కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్వహణను పర్యవేక్షించేందుకు విఎంఆర్‌డిఎ నుంచి ఒక అధికారి ఉంటారని తెలిపారు. పర్యాటకులు వంతెనపైకి వెళ్లినప్పుడు వారిని అనుసరిస్తూ రెండు బోట్లు సంచరిస్తాయని, గజ ఈతగాళ్ల అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పీ గన్నవరం మండలం ముంగండ గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పున:ప్రతిష్ట కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఆదివారం నాడామె అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలనీ, రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని ప్రార్థించినట్టు తెలిపారు. 400 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ముత్యాలమ్మ అమ్మవారి పున:ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడాన్ని అదృష్టంగా భావిస్తున్నాని చెప్పారు.

కారు బానెట్‌పై వ్యక్తి.. యూపీలో ఆపకుండా మూడు కి.మీ...

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఓ వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుతూ మరో వ్యక్తి కారు బానెట్‌పై వేలాడుతున్నా పట్టించుకోకుండా మూడు కి.మీ. అలాగే వెళ్లిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కారును వెంబడించి అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని నోయిడాకు చెందిన రమేశ్ కుమార్‌గా గుర్తించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు తన కారును వెనుక నుంచి తాకడంతో ప్రశ్నించడానికి అతని దగ్గరకు వెళ్లానని చెప్పాడు. తాను మాట్లాతున్నా పట్టించుకోకుండా సదరు వ్యక్తి కారును ముందుకు పోనిచ్చాడని, దానితో తాను కారు బానెట్‌పైకి ఎక్కానని అయినా కూడా అలాగే మూడు కిలో మీటర్ల మేర ఆపకుండా వెళ్లిపోయాడని వాపోయాడు. సంఘటనా స్థలంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. కారును సీజ్ చేశామన్నారు. నిందితుడి వివరాలు తెలియాల్సి ఉంది.

బీజేపీ అఘాయిత్యాలను ఎదిరిస్తున్నా..

- మొదటి నుంచీ నాపై కక్షపూరిత వైఖరి : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్




న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ సర్కారు మొదటి నుంచీ తనపై కక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నదని, తన పాలనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నదని ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీలో తనను పాఠశాలలు, ఆస్పత్రులు కట్టకుండా అడ్డుకున్నదని విమర్శించారు.

వాళ్ల పిల్లలతో సామానంగా సామన్యుల పిల్లలు కూడా చదువుకోవడం బీజేపీ పాలకులకు అస్సలు ఇష్టంలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. బీజేపీ కుట్రలను ఎదుర్కొంటూ ఢిల్లీలో పరిపాలన ఎలా కొనసాగిస్తున్నానో తనకు మాత్రమే తెలుసని ఆయన చెప్పారు. అందుకుగానూ తనకు నోబెల్ బహుమతి ఇవ్వాలని వ్యాఖ్యానించారు.ఓ బహిరంగసభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. బీజేపీ అఘాయిత్యాలను ఎదిరిస్తూ ఢిల్లీ ప్రభుత్వాన్ని నడుపుతున్న నాకు మీరే నోబెల్ బహుమతులని ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఢిల్లీలో ఏ గల్లీకి వెళ్లినా మేం మిమ్మల్నే నమ్ముకున్నాం, మీరే జీవితాలను మార్చాలని జనం చెబుతున్నారని కేజ్రీవాల్ చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఢిల్లీ వాసులు సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

5 ఎయిమ్స్ ఆస్పత్రులు ప్రారంభం


- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ



విజయవాడ : దేశవ్యాప్తంగా ఐదు చోట్ల నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ఎయిమ్స్‌లను ప్రారంభిస్తూ.. జాతికి అంకితం చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌తోపాటు రాజ్‌కోట్, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి, పంజాబ్ రాష్ట్రంలోని బఠిండా, పశ్చిమ బెంగాల్‌లోని కల్యాణి నగరాల్లో నిర్మించిన ఎయిమ్స్‌లను ప్రధాని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా మంగళగిరిలో 183 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,618 కోట్లతో నిర్మించిన ఎయిమ్స్‌లో 960 పడకలతో 125 మెడికల్ సీట్లు వున్నాయి. దీనికి 2015లో శంకుస్థాపన జరగ్గా, 2019 నుంచి ఓపి సేవలు మొదలయ్యాయి. దాదాపు ఐదేళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు జాతికి అంకితం చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. విశాఖ పెదవాల్తేరులోని స్టేట్ ఫుడ్ ల్యాబ్ క్యాంపస్‌లో నిర్మించిన మైక్రో బయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, మరో 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రధాని ప్రారంభించారు. మంగళగిరి ఎయిమ్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు భారతి ప్రవీణ్ పవార్, ప్రహ్లాద్ జోషి, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అపాయింటెడ్ డే అమలు చేయండి

ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగలేఖ





నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే 'అపాయింటెడ్ డే' అమలు చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఆయన సీఎంకు బహిరంగలేఖ రాసారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన విషయం తెలిసిందేననీ, ఎన్నికల కోడ్ రావడంతో 'అపాయింటెడ్ డే' నిర్వహించలేదనీ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలు దాటినా, ఇంతవరకు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించిన 'అపాయింటెడ్ డే' ప్రకటించలేదని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించినప్పుడే ఆర్టీసీ విలీనానికి సంబంధించిన జీవో విడుదల చేస్తారని కార్మికులు, ఉద్యోగులు ఆశించారనీ, కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులు ముఖ్యంగా మహిళా కండక్టర్లపై పనిభారం పెరిగిందనీ, ఓవర్ లోడ్ వెహికిల్ నడపలేక డ్రైవర్లు, కిక్కిరిసిన బస్సుల్లో కలియ తిరుగుతూ టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ఎంతో శ్రమించాల్సి వస్తున్నదని తెలిపారు.

డ్రైవర్లు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తున్నదనీ, వారి అదనపు శ్రమను దృష్టిలో పెట్టుకుని అయినా వెంటనే 'అపాయింటెడ్ డే'ని ప్రకటించి, విలీన జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి నెల నుంచైనా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో రద్దీ దృష్ట్యా మరో రెండువేల బస్సులను అదనంగా కొనుగోలు చేయాలని కోరారు. 2013లో జారీ చేసిన పీఆర్సీ బాండ్స్‌కు నగదు చెల్లించాలని ఆ లేఖలో కోరారు.

అందరికీ థ్యాంక్స్ : టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్




(ఫైల్)

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చి, తిరిగి క్షేమంగా స్వగ్రామాలకు వెళ్లిన యాత్రీకులకు టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణీకులు అందర్నీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది చేసిన కృషి వెలకట్టలేనిదని అభినందనలు తెలిపారు. తక్కువ సమయంలోనే మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి, ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ స్కీంను జాతరలో సిబ్బంది విజయవంతంగా అమలుచేశారనీ, సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించి, ఉన్నతస్థాయి వృత్తి నైపుణ్యాన్ని కనబరిచారని కొనియాడారు. టీఎస్ఆర్టీసీ ఎల్లప్పుడూ ప్రజలకు మెరుగైన సేవల్ని అందించడంలో ముందుంటుందని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.

టికెట్ వచ్చిందని ఇగోలకు పోవద్దు

- జగన్ కుట్రలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- పార్టీ నాయకులతో టిడిపి అధినేత చంద్రబాబు



అమరావతి: టికెట్ వచ్చిందనే అహంకారం (ఇగో)తో వ్యవహరిస్తే కుదరదని పార్టీ అభ్యర్థులతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఎంత సీనియర్ నేతయినా, నియోజకవర్గంలో ఎన్ని సానుకూల అంశాలున్నా చివరి వరకు ప్రజల్లో ఉండి కష్టపడాలని సూచించారు. టిడిపి-జనసేన తొలి జాబితాలో సీట్లు పొందిన అభ్యర్థులకు చంద్రబాబు ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలతో పాటు గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక జరిగిందని, వచ్చే ఎన్నికలు అత్యంత కీలకమని, ఎక్కడా చిన్న తప్పు, పొరపాటు జరగకూడదని చంద్రబాబు చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇంత ముందుగా అభ్యర్థుల ప్రకటన జరగలేదన్నారు. ఒక్క సీటూ ఓడిపోవడానికి వీల్లేదన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించామని, ఇప్పుడు 99 చోట్ల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలను కలుపుకుని వెళ్లాలని సూచించారు. తటస్థులను కలిసి రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరించి, అన్ని తరగతుల మద్దతు కోరాలన్నారు. మిత్రపక్షంగా ఉన్న జనసేన నేతలను గౌరవించాలని, వారిని కలుపుకొని వెళ్లాలని తెలిపారు. రెండు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తే 100 శాతం ఓట్ల బదిలీ జరుగుతుందన్నారు. ఐదేళ్ల పాలనపై గ్రామాల్లో వైసిపి నేతలు, కార్యకర్తలు కూడా అసంతృప్తితో ఉన్నారని, పార్టీలోకి వస్తే ఆహ్వానించాలని సూచించారు. ప్రచార విభాగాన్ని బలోపేతం చేసుకోవాలని, ప్రతి అభ్యర్థీ న్యాయవాదిని నియమించుకోవాలని సూచించారు. ఊహించని స్థాయిలో వైసిపి అధినేత జగన్ కుట్రలు, కుతంత్రాలు చేస్తారని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. జగన్ తన పాలనను కాకుండా దౌర్జన్యాలు, అక్రమాలు, దొంగ ఓట్లను నమ్ముకున్నారని విమర్శించారు. ఎన్నికలకు జగన్ సిద్ధంగా లేరని, సభలు నిర్వహిస్తూ అభ్యర్థులను మాత్రం ప్రకటించలేకపోయారని అన్నారు.

టికెట్ రాని నేతలకు బుజ్జగింపులు

టిడిపి తొలి జాబితాలో చోటుదక్కని నేతలకు పార్టీ అధిష్టానం బుజ్జగించేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు ఆదివారం ఉండవల్లిలో తన నివాసంలో కొంతమంది నేతలను పిలిపించుకుని వారికి సర్ది చెప్పారు. తెనాలి సీటు ఆశించిన మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, అనకాపల్లి సీటు ఆశించిన పీలా గోవింద సత్యనారాయణకు పొత్తులో భాగంగా త్యాగం చేయక తప్పదని చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం రాగానే తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మైలవరం నుంచి వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పోటీ చేస్తారని, పెనమాలూరు నుంచి పోటీ చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో చెప్పినట్లు తెలిసింది. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని చెప్పారు. గంటా విశాఖ నుంచి గానీ, భీమిలి నుంచి గానీ పోటీ చేస్తానని తన అభిప్రాయం చంద్రబాబుతో చెప్పారు. బిజెపి అడగకపోతే రాజమండ్రి లోక్‌సభ సీటు కేటాయిస్తానని బొడ్డు వెంకటరమణతో అన్నట్లు తెలిసింది. సోమవారం కూడా పలువురు నేతలతో చంద్రబాబు చర్చలు జరపనున్నారు.

మదనపల్లెలో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను, లారీని ఢీకొన్న స్కార్పియో వాహనం
- ఐదుగురు దుర్మరణం



మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మదనపల్లె రామారావు కాలనీకి చెందిన ఆరుగురు స్కార్పియో వాహనంలో బెంగళూరుకు వారి సొంత పనిపై వెళ్లారు. పని ముగించుకుని ఆదివారం బెంగుళూరు నుంచి మదనపల్లెకు తిరుగు పయనమయ్యారు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మదనపల్లె మండలం బార్లపల్లె వద్దకు రాగానే పాలు పోయడానికి బైక్‌పై వెళ్తున్న కోళ్లవారిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు చంద్ర (50), సుబ్రమణ్యం (62)లను వారి వాహనం ఢీకొట్టింది. దీంతో, రైతులు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన నేపథ్యంలో అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని స్కార్పియో కారు వేగంగా ఢీకొంది. దీంతో, ఆ వాహనంలోని ముగ్గురు అక్కడికక్కడే దుర్మణం చెందారు. వారిలో తిలక్, విక్రమ్, శ్రీను ఉన్నారు. కారులో ఉన్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతులందరూ మదనపల్లి పట్టణం, రూరల్ మండలానికి చెందివారు. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బార్లపల్లె వాసులు చెప్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మదనపల్లె నియోజకవర్గ వైసిపి కన్వీనర్ నిస్సార్ అహ్మద్ పరామర్శించారు.

హెల్త్ ఆన్ అస్ యాప్ షురూ : ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్: కరోనా తర్వాత వైద్యరంగం కొత్త పరిస్థితులు చూస్తోంది అని ప్రముఖ నటుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'హెల్త్ ఆన్ అస్' యాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "సమాజంలో అందరికీ ఆరోగ్య వసతులు అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తోన్నా. 'హెల్త్ ఆన్ అస్' యాప్ వెనుక ఎంతో కృషి ఉంది. ఇలాంటివి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. వైద్య నిపుణులంతా కలిసి ఈ యాప్‌ని ముందుకు తీసుకెళ్లాలి. వైద్య విద్యపూర్తి చేసుకున్న అందరికీ ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వలేవు.. కానీ, ఇలాంటి యాప్‌లు ఇస్తాయి. ఒక్కోసారి ఆస్పత్రులన్నీ బిజీగా ఉంటున్నాయి.. బెడ్ కావాలంటే మంత్రులు రికమండేషన్ కావాల్సిన పరిస్థితి. కొవిడ్ తర్వాత ఇంటివద్దే మెడికల్ కేర్ కావాలనుకుంటున్నారు. జనాభా పెరుగుదలతో పాటు మెడికల్ కాలేజీలు పెరుగుతున్నాయి. ఈ యాప్ మెడికల్ కేర్, డాక్టర్స్‌ని ఇంటికి తెస్తుంది" అని తెలిపారు.

భారత్-జపాన్ సేనల ధర్మ గార్డియన్ విన్యాసాలు షురూ

భారత్ ,జపాన్ ల మధ్య రక్షణ సహకారం | బలోపేతం దిశగా కీలక ముందడుగు



జైపూర్: భారత్, జపాన్ మధ్య రక్షణ సహకారం మరింతగా బలోపేతం దిశగా కీలక ముందడుగు పడింది. 'ధర్మ గార్డియన్' పేరిట ఇరుదేశాల సైనిక బందాల సంయుక్త విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి మొదలైన ఈ విన్యాసాలు రాజస్థాన్‌లోని మహజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మార్చి 9 వరకు కొనసాగనున్నాయి. 'ధర్మ గార్డియన్' అనేది వార్షిక విన్యాస ప్రక్రియ. భారత్, జపాన్‌లలో ప్రత్యామ్నాయంగా నిర్వహిస్తుంటారు. ఇరుదేశాల నుంచి 40 మంది చొప్పున సిబ్బంది పాల్గొంటారు. జపనీస్ బందానికి 34వ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్‌కు చెందిన సైనికులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. భారత్ తరపున రాజ్‌పుతానా రైఫిల్స్‌కు చెందిన బెటాలియన్ పాల్గొంది. ఇరుదేశాల మధ్య సైనిక సహకారాన్ని పెంపొందించడం, సెమీ-అర్బన్ వాతావరణంలో ఉమ్మడి కార్యకలాపాలను అమలు చేసేందుకు సంయుక్తంగా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడమే ఈ విన్యాసాల లక్ష్యం. శారీరక ధృఢత్వంతో పాటు ఉమ్మడి ప్రణాళిక, వ్యూహాత్మక కసరత్తులు, ప్రత్యేక ఆయుధ నైపుణ్యాలు వంటి ప్రాథమిక అంశాలపై దృష్టిపెట్టనున్నాయి.

ఈ విన్యాసాల సమయంలో సాధన చేయాల్సిన వ్యూహాత్మక కసరత్తుల్లో తాత్కాలిక ఆపరేటింగ్ బేస్ ఏర్పాటు, ఇంటెలిజెన్స్, నిఘా గ్రిడ్ ఏర్పాటు చేయడం, మొబైల్ వెహికల్ చెక్ పోస్ట్ ఏర్పాటు, శత్రువుల కదలికల్ని పసిగట్టి వారిని మట్టుబెట్టేందుకు నిరంతరం సోదాలు జరపడం వంటి అనేకం ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా భారత్‌లో పెరుగుతున్న రక్షణ పారిశ్రామిక సామర్థ్యాన్ని ప్రదర్శించే ఆయుధ సామగ్రిని సైతం ప్రదర్శించనున్నారు. జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ కమాండింగ్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ తోగాషి యుచి మార్చి 3న ఈ విన్యాసాలను తిలకించేందుకు రాబోతున్నట్టు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'ధర్మ గార్డియన్' విన్యాసాలు ఇరు దేశాల సైనిక వ్యూహాలు, సాంకేతికత, వ్యూహాత్మక విధానాల్లో ఉత్తమ అభ్యాసాలను పంచుకొనేందుకు ఇరు పక్షాలకు వీలు కల్పిస్తుందని పేర్కొంది. దీంతో పాటు రెండు స్నేహపూర్వక దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంపొందించడంతో పాటు రక్షణ సహకార స్థాయిని మెరుగు పరుస్తుందని పేర్కొంది.

పరుగు పందెంలో విజయలక్ష్మికి స్వర్ణం



నవతెలంగాణ-హయత్ నగర్

400మీటర్ల పరుగు పందెంలో హయత్ నగర్‌కు చెందిన నేనావత్ విజయలక్ష్మి స్వర్ణం సాధించిందని కోచ్ వినోద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ కొల్లూరు గార్డియాన్ స్పోటీయా ఇంటర్నేషనల్ స్కూల్లో 6వ ఛాంపియన్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుండి హయత్ నగర్‌కు చెందిన నేనావత్ విజయలక్ష్మి స్వర్ణం, ఇస్లావత్ నితిన్ సిల్వర్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు.

'వినియోగదారులను ముఖ్య అతిథులుగా పరిగణించాలి'



నవతెలంగాణ సంతోష్ నగర్

వినియోగదారులను ముఖ్య అతిథులుగా పరిగణించి, సేవ చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటి మాచన రఘునందన్ సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మాన్ ఘాట్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్, డీజిల్ నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ బాటిల్స్‌లో పెట్రోల్ అమ్మకాలు చేయొద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.

జల్‌పల్లిలో పెద్ద చెరువుల పరిశీలన



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని పెద్ద చెరువులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అనుచర గణం భూకబ్జాలపై జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అంతేకాదుఈ విషయంపై త్వరలోనే కలెక్టర్‌తో రివ్యూ మీటింగ్ కూడా ఏర్పాటు చేద్దామని మంత్రి శ్రీధర్ బాబుకు తెలియజేయడం జరిగిందన్నారు. ఇండ్లు లేని పేదలను గుర్తించి, వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, జల్ పల్లి మాజీ ఉప సర్పంచ్, సీనియర్ నాయకులు జహంగీర్, జల్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





ఫొటో 6,7

నవతెలంగాణ - బడంగ్‌పేట్

సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో ఉన్న జీపీఆర్ కన్వెన్షన్ హాల్లో గుర్రంగూడ గిరిజన సంక్షేమ సంఘం నాయకులు శంకర్ నాయక్ అధ్యక్షతన ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే బాలు నాయక్, లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ కుమార్ జాదవ్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేడు గిరిజనులు విద్య, ఉద్యోగ రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించారని కొనియాడారు. సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి శివ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు వర్కింగ్ ప్రసిడెంట్ బి.మోతీలాల్ నాయక్, సలహాదారులు నేనావత్ జ్యోతి జైపాల్ నాయక్, మహిపాల్ నాయక్, రతన్ నాయక్, సోమా నాయక్, రవీందర్ నాయక్, శ్రీధర్ నాయక్, గోపాల్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి నగర్ సౌత్ రెసిడెన్స్
వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నాగోల్

శ్రీ సాయి నగర్ సౌత్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ని కాలనీ పెద్దలు, ప్రముఖుల ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బద్దం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.రేవంత్ గౌడ్, వై సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ ఉమేష్ గౌడ్, కోశాధికారిగా పీఎస్ రాము, సంయుక్త కార్యదర్శులుగా ఏ.పరమేశ్వర్ రెడ్డి, ఎస్.శివకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం వీర కృష్ణారెడ్డి, పి. బుచ్చిరెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బద్దం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. మాపై నమ్మకం పెట్టుకొని ఏకగ్రీవంగా ఎన్నుకొని బాధ్యతలను అప్పగించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. నూతన కమిటీ సమావేశమై..మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొనున్నట్లు పేర్కొన్నారు.

చార్మినార్ టు గోల్కొండ ఫోర్ట్
హిస్టారికల్ 10కే రన్



నవతెలంగాణ- నాగోల్

హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గర కేఎస్ఆర్ సైక్లింగ్ ఈవెంట్స్ కె.నాగరాజు ఆధ్వర్యంలో హిస్టారికల్ రన్ 2.0 చార్మినార్ నుండి గోల్కొండ ఫోర్ట్ వరకు హిస్టారికల్ 10కే రన్, హైదరాబాద్ హిస్టారికల్ టూ కే వాక్ ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా ఆ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఔత్సాహికులు, స్థానిక యువకులు, ప్రజలు, 200 మంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

- కార్పొరేటర్ సుజాత నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. రెడ్డి కాలనీ ప్రతి నిధులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఎస్ఎన్డీపీ ద్వారా చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులు పూర్తికావడంతో గుంతల మయంగా మారిన రోడ్డును మరమ్మత్తులు చేయించాలన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. రెడ్డి కాలనీ పార్క్‌ను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తానని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నర్సిరెడ్డి, ఫణికుమార్, స్వామి రెడ్డి, కర్నాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మమత మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.



మాజీ ఎంపీటీసీ గౌర వెంకటేష్ వర్ధంతి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లో జీవా యూత్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ గౌర వెంకటేష్ 10వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు లిక్కి మమత కృష్ణారెడ్డి, బంగారు అనిత ప్రభాకర్, గ్రామ సీనియర్ నాయకులు సామ సంజీవ రెడ్డిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌర వెంకటేష్ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్య, పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం నాదర్ గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథశ్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె బల్వంత్, వట్టి వెంకటేష్ యాదవ్, అశంగారి శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, గౌర కిషోర్, దొడ్డి మల్లికార్జున్, ఈశ్కే వెంకటేష్, చిత్రం శ్రీనివాస్, చిన్నరావుల యాదయ్య, కేశవరెడ్డి, సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రాజు, నాగభూషణం భాస్కర్, రమాకాంత్, శ్రీనివాస్ గౌడ్, రజినీకాంత్, కుమార్, విజయ్ కుమార్, శివకుమార్, గౌర శ్రీనివాస్, రాకేష్, శ్రీకాంత్, గౌర సాయి, నిఖిల్, సుధాకర్ తదతరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి ఘన సన్మానం



నవతెలంగాణ - సంతోష్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓల్డ్ మలక్‌పేట్‌కు ఆదివారం విచ్చేసిన సందర్భంగా...చాదర్ఘాట్ జలాలుద్దీన్ స్వీట్ హౌస్ వద్ద సెట్విన్ మాజీ చైర్మన్ మక్సూద్ అహ్మద్ ఏర్పాటు చేసిన స్వాగత ఏర్పాటులో భాగంగా ఆయనను గజమాలతో సత్కరించి, సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఆరు సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, చౌకి రవి కుమార్, జాఫర్ ఇక్బాల్, ఆకుల రాజు, రామకృష్ణ, మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని ధర్నా



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందీ హిల్స్ కాలనీలో ఎలాంటి అనుమతి లేకుండా చేపట్టిన భవన నిర్మాణాన్ని కూల్చివేయాలని నందీహిల్స్ కాలనీ అసోసియేషన్, చైతన్య హిల్స్ కాలనీ, టీచర్స్ కాలనీ, విజ్ఞానపురి కాలనీ, ప్రశాంతి హిల్స్, శివా హిల్స్, నాగార్జున హిల్స్, సెవెన్ హిల్స్, చుట్టుపక్కల కాలనీవాసులందరూ ఆదివారం నందీహిల్స్ రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డును ఆక్రమించుకొని నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకే ధర్నాకు దిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా మీర్‌పేట్ మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు
అంతరాయం లేకుండా ప్రత్యేక కార్యాచరణ



ఎస్ఈ కరుణాకర్ బాబు

నవతెలంగాణ- హయత్ నగర్

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యుత్, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని సరూర్ నగర్ డివిజన్ విద్యుత్ ఎస్ ఈ కరుణాకర్ బాబు అన్నారు. హయత్ నగర్‌లో సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఎవరైనా సరే నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీక్ లోడ్ అవర్స్ లో సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అధికారులు తప్పని సరిగా వారి పరిధిలో ఉన్న ఎఫ్ ఓ సీ పరిధిలో విద్యుత్ సరఫరా ను పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ ఏడాది వేసవిలో 30శాతం విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున టెక్నికల్‌గా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వినియోగదారులకు కావాల్సిన నాణ్యమైన విద్యుత్ మా వద్ద ఉందని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైనా విద్యుత్ సమస్యలు వస్తే కంట్రోల్ రూమ్ 7901679095 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అలాగే సరూర్ నగర్ పరిధిలో 9490153567, కొత్తపేట 9490153568, ఆర్కే పురం 9490153569, ఎల్బీనగర్ 9490153571, గ్రీన్ హిల్స్ కాలనీ 7013174759, బండ్లగూడ 8333924861, హయత్ నగర్ 9490153577, ఆటో నగర్ 9493193148, శాంతి నగర్ 9490153588, పెద్ద అంబర్‌పేట 8333924864 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సరూర్ నగర్ డీఈ రామకృష్ణ, ఏ డీ ఈ యుగంధర్, ఏ ఈ ఆంజనేయులు, చంద్ర మౌళి, దిలీప్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మానవతా హృదయంతో సేవ చేయడం అదృష్టం

- అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నీ కుమార్





నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి సమాజంలో అనాథలకు మానవతా హృదయంతో సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్ని కుమార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఉన్న సాయినగర్‌లో నివాసముండే శాంతమ్మకు ఎవరూ లేరు. అనారోగ్యంతో కాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఈ క్రమంలో అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నీ కుమార్ ఆ వృద్ధురాలిని సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులతో మాట్లాడి, ఆపరేషన్ ద్వారా కాలును తొలగించడం జరిగిందని సన్నీ కుమార్ తెలి పారు. తన సంస్థ ద్వారా ఎంతో మంది అనాథలను చేరదీసి, వారికి అంకిత భావంతో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

'అక్రమ నిర్మాణాల తొలగింపు'





నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్‌పేట గ్రామ రెవెన్యూ సర్వే నెం.64/పి లోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ఆక్రమణకు గురైన సర్వే నెం.64/పిలో నిర్మించిన నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ దత్తు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరీపై ఉందన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. భూ ఆక్రమణల వివరాలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయు నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం శివాలయ నిర్మాణానికి భూమి చేశారు. ఈ పూజలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా బంద్



నవతెలంగాణ - ధూల్ పేట్

జలమండలి డివిజన్‌లోని అల్లాబండ రిజర్వాయర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లకు మరమ్మత్తులు చేస్తున్నట్టు జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లాబండ, గోడేటీకబర్ సెక్షన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు ఈ కింద తెలిపిన ప్రాంతాల్లో మంచినీటి సరఫరా జరగదని తెలియజేశారు. జుంగూర్ బస్తీ, టక్కెర్వాడీ, సాయిబాబా దేవాలయం మల్లిపుర ధూల్పేట్ మినీ స్టేడియం, పార్థివాడ, సంతోషిమాత ఆలయం, గోడేలీకబర్, బడా బండ, ముస్తాయిడ్ రంజోషివాడ, గంగా బౌలి, మక్కరా 2 జెబస్టాప్, ఇందిరానగర్, మల్లన్నగుట్ట, జియాగూడ తదితర ప్రాంతాల ప్రజలు మరమ్మతు పనులకు సహకరించాలని ఆయన కోరారు.



తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక వైస్ చైర్మెన్ గా నియమితులైన మాజీ మంత్రి చిన్నారెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఐ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు, పాశం రాజేందర్ యాదవ్, నర్సింగ్ రావు , పోల్కం వినయ్ రాజ్ తదితరులు.
నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

- మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రామ్ చందర్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మహరాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రామ్ చందర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎండాకాలంలో పలు జాగ్రత్త లు పాటించాలని సూచించారు. వేడిని తట్టుకునేందుకు ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలన్నారు. ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు తల్లి పాలు తప్పని సరిగా పట్టించాలని చెప్పారు. వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే అత్యవసర సమయాల్లోనే బయటకు వెళ్లాలన్నారు. ప్రజలు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని, పోషకాలుండే పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ లాంటి పండ్లరసాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవడం శరీరంలో వేడి తగ్గడంతోపాటు విలు వైన పోషకాలు లభిస్తాయి అన్నారు. కీరదోష, క్యారట్, బీట్రూట్ లాంటి పచ్చికూర గాయలను తీసుకోవాలని సూచించారు. తమ ఆస్పత్రిలో బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులకు మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు.

ఆదివాసీలకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రిష్ణా నాయక్



నవతెలంగాణ - ధూల్‌పేట్

గిరిజనులు ఆదివాసీలు వ్యతిరేకంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ విభజన రాజకీయ కుట్రలు చేస్తున్నదని గిరిజన యువజన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ప్రతినిధులు రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రిష్ణా నాయక్‌లు అన్నారు. డీవైఎఫ్ఐ ముంబైలో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు కామ్రేడ్ అశోక్ ధావలే ప్రారంభించిన అఖిల భారత గిరిజన యువజన సమ్మేళన సదస్సు సందర్భంగా డీవైఎఫ్ఐ, గిరిజన యువజన ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా ఈ సదస్సుకు హాజరైన ప్రతినిధులు ట్రైబల్ యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా గిరిజనుల ఆదివాసీల వ్యతిరేకంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదన్నారు. ఆదివాసి గిరిజన వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం సమగ్రంగా ప్రోత్సహించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హక్కులు, చట్టాలను కాలరాస్తూ వివక్షకు గురిచేస్తున్నదన్నారు. గిరిజనులు ఆదివాసులు అట్టడుగు వర్గాలపై దాడులు దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలో గిరిజనులు, ఆదివాసి వర్గాలు విద్య, వైద్యం అందక వెనుకబడి ఉన్న పరిస్థితి దేశంలో, రాష్ట్రంలో ఇంకా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు, ఆదివాసుల సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నదని అన్నారు. దేశవ్యాప్తంగా గిరిజనులు ఆదివాసులకు విద్య వైద్యం ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ట్రైబల్ యూత్ కన్వెన్షన్ తీర్మానం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ప్రతినిధులు రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రిష్ణా నాయక్, రాష్ట్ర కమిటిసభ్యులు నరేష్ పటేల్, క్రిష్ణబాబు, ప్రసాద్ లు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



ఉమా నూతక్కికి మాడభూషి రంగాచార్య స్మారక పురస్కారం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం 2023 సంవత్సరానికిగాను ఉమా నూతక్కి '25వ గంట' కథా సంపుటి పుస్తకానికి దక్కింది. హైదరాబాద్‌లోని కోఠిలోని శ్రీ కృష్ణదేవ రాయ తెలుగు భాషా నిలయంలో ఆదివారం రూ. 10 వేల నగదు, జ్ఞాపికను రచయిత్రి పక్షాన రచయిత్రి కుమారుడు ప్రవీణ్, కుమార్తె మేఘనలు ముఖ్య అతిథి ప్రముఖ కథా నవలా రచయిత శ్రీధర, సభాధ్యక్షురాలు శీలా సుభద్రదేవి, రంగాచార్య సంఘం కన్వీనర్ మాడభూషి లలితాదేవిలు కలిసి అందజేశారు. పుస్తకంపై స్త్రీ వాద పత్రిక భూమిక సంపాదకురాలు కొండవీటి సత్యవతి ప్రసంగించారు. అనంతరం ప్రముఖ కథా రచయితలు బి కామేశ్వరి, ఇంద్రగంటి జానకి బాల, పరిమళ సోమేశ్వర్లు రచించిన ప్రముఖ మన కథళలు నాలుగో సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాహి త్య పరిషత్ మాజీ చైర్మెన్ నందిని సిద్ధారెడ్డి, సుధామ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- సీఎం రేవంత్ రెడ్డికి 14 బీసీ సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్రంలోని 20 లక్షల మంది ఇంజనీరింగ్/ మెడిసిన్/ పీజీ/ డిగ్రీ విద్యార్థుల మొత్తం ఫీజుల బకాయిలు రూ. 5వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యానగర్ బిసి భవన్ లో 14 బీసీ సంఘాల నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర కాలేజీ కోర్సులు చదివే బీసీ/ ఈబిసి/ఎస్సీ/ఎస్టి విద్యార్థుల రూ. 5వేల కోట్ల ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని.. దాంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫీజులు బడ్జెట్ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయక పోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. కోర్సులు పూర్తయినా వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని.. మొత్తం ఫీజులు విద్యార్థులు కట్టిన తర్వాతనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేక పోతే క్లాసులకు రానివ్వటం లేదని.. దీని మూలంగా విద్యార్థుల చదువు దెబ్బతింటుందని చెప్పారు. పేద కులాలు చదువుకుంటే సంపన్న వర్గాల దోపిడీ పాలన అంతమవుతుందని గత ప్రభుత్వం భయపడి ఇవ్వలేదని.. చదువు ద్వారా పేద కులాలలో చైతన్యం పెరిగి రాజ్యాధికారం దిశగా ఉద్యమాలు వస్తాయని భయపడుతున్నారని తెలిపారు. వెంటనే ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సైకాలజిస్ట్స్ కౌన్సిల్ వెంటనే ఏర్పాటు చేయాలి



- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల సైకాలజిస్ట్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు అయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సైకాలజిస్టులు సంఘటితంగా పోరాటం చేస్తే ఇది అసాధ్యమేమి కాదన్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరిగిన వరుస ఆత్మహత్యల నేపథ్యంలో విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావాన్ని, పరీక్షల ఒత్తిడిని తగ్గించి వారిలో మానసిక ప్రశాంతతను అందించుటకుగాను సైకాలజిస్టుల అవసరం ఎంతైనా ఉందని, కావున వెంటనే సైకాలజిస్టుల నియామకంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రతీ సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదగాలని ఇందుకు సంఘానికి దిన చర్యలో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. ఇది మీ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సమజాంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులపై వెంటనే ప్రతీ సైకాలజిస్ట్ స్పందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శ్రీపూజ, కార్యదర్శి సుధాకర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.శర్మిల కున్ను, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆలీయా పర్వీన్, నాయకులు శ్రీదేవి, వైదేహి దలాల్, ఉమర్ ఖాన్, విజయరాణి, వైష్ణవి, డా.లావణ్య, అనితా పగిడిపాటి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు 18 శాతానికి రిజర్వేషన్ పెంచాలి



- తెలంగాణ దళిత పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్రంలో దళిత ప్రజలకు 18 శాతానికి రిజర్వేషన్ పెంచాలని తెలంగాణ దళిత పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్ కుమార్ డిమాండ్ చేశారు .తెలంగాణ దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో దళిత ప్రజలకు 18 శాతం రిజర్వేషన్ పెంచాలని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా ఉద్యోగం సంక్షేమం ఉపాధి రాజకీయాల్లో రిజర్వేషన్ సవరించి పెరిగిన జనాభాకు ప్రకారం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే అన్ని పార్టీలు వారి మ్యానిఫెస్టోలలో రిజర్వేషన్ గురించి చేర్చాలని కోరారు. ఈ ధర్నాలో ప్రధాన కార్యదర్శి బండి అజయ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు

మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రామలక్ష్మి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రామలక్ష్మి అన్నా రు. ఆదివారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని చెప్పారు. మహిళలు మరింతగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య ం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆత్మవిశ్వాసం, ధైర్యం ప్రధాన ఆయుధాలుగా భావించి జీవితంలో ముందుకు సాగాలని చెప్పారు. మహిళలకు సహనం, ఓర్పు, నేర్పు ఆప్యాయత, జ్ఞానం, మనోధైర్యం అనే గుణా లు స్త్రీలకు స్వతగా ఉండేవని వీటిని చక్కగా అలవర్చుకుంటే ఏ రంగంలోనైనా మహిళలకు తిరిగి ఉండదని అలాంటి మహిళలు ఉన్న ఏ రంగమైన ఏ దేశమైనా సుసంపన్నం అవుతుందని మహిళా శక్తి గొప్పదని చెప్పారు.

విశ్వనాథ్ సినిమాలు చరిత్రలో సుస్థిరం



- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి
- షరాన్ లోవెన్‌కు సత్కారం

నవతెలంగాణ-కల్చరల్

దేశంలో వంద ఉత్తమ సినిమాలలో పది సినిమాలు విశ్వనాథ్ వే ఉంటాయని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన శంకరాభరణం, సాగర సంగమం, స్వర్ణ కమలం, స్వాతి కిరణం వంటి భిన్న కథా చిత్రాలు చరిత్రలో సుస్థిరంగా ఉంటాయని జస్టిస్ కొని యాడారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణ లో కె.విశ్వనాథ్ జయంతి సందర్భంగా స్వర్ణ కమలంలో నటించిన షరాన్ లోవెన్ ను జస్టిస్ రాధారాణిని సత్కరించి మాట్లాడారు. అమెరికా దేశీయురాలైన షరాన్ లోవెన్ భారతీయ నాట్య ప్రక్రియల పై అధ్యయనం కోసం వచ్చి ఒడిస్సీ, కథక్ వంటి నాట్యాలలో పరిణత సాధించి స్వర్ణ కమలంలో నటించి ప్రేక్షకులమన్ననలు అందుకున్నారని ప్రశంసించారు. షరాన్ లోవేన్ మాట్లాడుతూ ప్రతీ దేశానికి కళలు సంస్కృతి సంప్రదాయాలు ప్రాథమిక లక్షణాలు అన్నారు. తనకు తన అమెరికా సంస్కృతి పట్ల గౌరవం ఉందని అలాగే భారతీయ సంస్కృతి పట్ల కూడా ఆసక్తి ఉందని చెప్పారు. విశ్వనాథ్ చిత్రాలలో వున్న సంస్కారం అందరికీ అదర్శమన్నారు.విశ్వనాథ్ కుమారుడు నాగేందర్ మాట్లాడుతూ తమ తండ్రి చివరి రోజుల్లో ఎక్కువ సార్లు స్వర్ణ కమలం సీడీ చూసేవారు అని చెప్పారు. తాను తండ్రి వారసత్వం కొనసాగించక పోయినా అయన సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేశాయన్న ఆనందం ఉందన్నారు. ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఎస్.పీ.భారతి అధ్యక్షత వహించిన వేదిక పై వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సినీ నిర్మాతలు బద్రి నాథ్,మురళి దర్,దయాకర్ స్వామి పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు పుష్ప కార్యదర్శి సురేందర్ సారథ్యం లో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

సంత్ సేవాలాల్ చూపిన మార్గం ఆదర్శనీయం



- మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్

నవతెలంగాణ -ముషీరాబాద్

సమాజ శ్రేయస్సు కోసం సంతు సేవాలాల్ చూపించిన మార్గం ఆదర్శనీయం అని మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో మాజీ మంత్రి అమర్ సింగ్ తీ లావత్, రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ జగన్నాథ రావు,భారతి లక్పతి నాయక్ ఐఏఎస్, ప్రభుత్వసెక్రటరీ బొజ్జ నాయక్, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ గోర్ బంజారా బాలాజీ నాయక్, హాజరయ్యారు.

ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటా నికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం సంతు సేవాలాల్ చూపించిన మార్గము ఆదర్శనీయం అన్నారు. ఆయన బోధనలను అందరూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ లాల్, రాంబాబు నాయక్, జగన్నాథరావు ఐపీఎస్, అమర్ సింగ్ తిలావత్ ఎక్స్ మినిస్టర్, భారతి లక్పతి నాయక్ , ఐఏఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు



స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ - ముషీరాబాద్

నగరంలోని రోడ్డుపైన జీవిస్తున్న అనాధలకు నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 247 వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని సభ్యులు ఎం శ్రీవిద్య, ఖుషి కోమల్, జోషి నేహా, ఆకాంక్ష, సంతోషి, సుధా గౌతమ్, కష్ణ, నిఖిల్, వివిన్ రెడ్డి, అఖిల్ ,ఇర్ఫాన్, శుభం ,వంశీ, జయరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ప్రతిభావంత యువతులకు ఆహ్వానం

నవతెలంగాణ-కల్చరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వై.ఎస్.అర్.చారిటబుల్ ట్రస్ట్ హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా నిర్వహణలో జరుగనున్న వేడుకల్లో సంగీతం, నృత్యం, సాహిత్యం, క్రీడలు, వైద్య విద్యారంగంతో పాటు మరే రంగం లోనైన ప్రతిభ కనబరిచే యువతులను సత్కరించే నిమిత్తం దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి గల వారు మార్చి 8 తేదీ లోగా ysrm2319@Gmail. com కు పం పాలని నిర్వహకులు కోరారు



గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆదేశాలతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని జాంబాగ్ డివిజన్ జనరల్ సెక్రెటరీ కె.రామకష్ణ (కట్టప్ప) తెలిపారు. డివిజన్ లోని ఎస్ డి నగర్, సేవక్ నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టామన్నారు.
నవతెలంగాణ-సుల్తాన్ బజార్



భారత్ బచావో అఖిల భారత విద్యార్థుల రెండు రోజుల సదస్సు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మధు ప్రసాద్, ప్రొఫెసర్ అనిత రాంపాల్ పాల్గొని ప్రసంగించగా వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థి నేతలు హాజరయ్యారు. నవతెలంగాణ-ముషీరాబాద్




ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్ హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్స్ లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ముషీరాబాద్

కూకట్‌పల్లిలో 'ప్రాజెక్ట్ అమృత్'



నవతెలంగాణ-సిటీబ్యూరో

సంత్ నిరంకారీ మిషన్ ద్వారా బాబా హరదేవ్ సింగ్ జీ మహరాజ్ వారి ఉపదేశాల ప్రేరణతో 'ప్రాజెక్ట్ అమృత్' స్వచ్ఛ నీరు, స్వచ్ఛ మనసు అనే కార్యక్రమాన్ని కూకట్‌పల్లిలోని ఐడీఎల్ లేక్ 'రంగదాముని చెరువు' వేదికగా నిర్వహించారు. నీటి పారిశుద్ధత, స్వచ్ఛమైన మనసు దిశగా కూకట్‌పల్లి బ్రాంచ్ సేవాదళ్ మహాత్ములు 200 మంది ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా వచ్చేశారు. వారు మిషన్ చేసే సేవలను అడిగి తెలుసుకుని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ శిరీషా బాబురావు, కూకట్‌పల్లి బ్రాంచి ముఖి ప్రభాకర్ రెడ్డి, సేవాదళ్ ఇన్‌చార్జి జంగయ్య, లక్ష్మీసాయి, జ్ఞానప్రచారకులు మాధవి, రత్న పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరంలో స్మై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 247వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాహనంలో సంచరిస్తూ ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు.

కష్టపడి చదివితేనే కలలు సాకారం



- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదివితే భవిష్యత్తులో కలను సాకారం అవుతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.పి.ఆర్.ట్రస్ట్ చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి విద్యార్థులకు సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోగల సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కైసర్ నగర్‌లో గల(ప్రతిభా స్కూల్) ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం పాఠశాల గ్రౌండ్స్‌లో విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు పాఠశాల కరస్పాండెంట్ జి.ప్రవీణ్ రెడ్డి, ప్రిన్సిపల్ జి.కవితా రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అప్పుడే వారు లక్ష్యాన్ని చేరుకుంటారని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైన ఉందన్నారు. విద్యతో పాటు సామాజిక విలువలు నేర్పడంతోపాటు, క్రీడలు, శాస్త్రసాంకేతిక రంగాలలో శిక్షణనిచ్చి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని అధ్యాపక బృందానికి చెప్పారు. పాఠశాల కరెస్పాండెంట్ జి.ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నామని వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇతరులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన

- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవచ్చు
- మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి





నవతెలంగాణ-దుండిగల్

నేటితరం యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ. కె.వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా కళాశాల సెమినార్ హాల్లో ఇంజినీరింగ్ విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ.. ట్రాఫిక్ పట్ల విద్యార్థులు బాధ్యతాయుతం గా వ్యవహరించాలని, అతివేగం తగ్గించి, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని ప్రతి ఒక్కరు సమాజం పట్ల మర్యాదగా నడుచుకోవాలని అన్నారు. మనం చేసే ఏ మంచి పనైనా ఇంకొకరి పై చెరగని ముద్ర వేయాలని, మన ప్రవర్తన మన బాధ్యతేనని, మనం చేసిన తప్పులకు కానీ, మన చెడు ప్రవర్తనకు కానీ ఇతరులను బాధ్యులు చేయడం సరికాదని తెలిపారు. అలాగే సమయపాలనతో వ్యవహరించాలని సూచించారు. తద్వారా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకోవాలని ఆకాంక్షించారు. మరిన్ని ట్రాఫిక్ నియమాల పై కొంపల్లి ట్రాఫిక్ జోన్ ఇన్స్ స్పెక్టర్ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు పలు జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలని, తద్వారా ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సిగ్నల్స్ పై నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అలా పాటించని కారణానికి ఇటీవల మైసమ్మగూడలోని పలు ఇంజినీరింగ్ విద్యార్థులు మృత్యువాత పడ్డారని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తప్పవని తద్వారా విద్యార్థులు తమ జీవితాన్నే కాక తమ తల్లిదండ్రుల జీవితాన్ని కూడా పణంగా పెట్టినట్టని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, తప్పని సరిగా తెలుసుకుని పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ఉల్లంఘిస్తే మనిషి తన వ్యక్తిత్వాన్నే కోల్పోయినట్టని, తప్పకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి , కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, సాక్ డీన్ డా.టీ. ల్ రామదాసు, సాక్ కన్వీనర్ శైలజ రెడ్డి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-దుండిగల్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో అనేక సంవత్సరాలుగా ప్రజల సమస్యలు అపరిష్కృతంగా నెలకొన్నాయని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన నాయకులు ఆదివారం కుత్బు ల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాసరెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్ రెడ్డిలను కలిసి జర్నలిస్ట్ కాలనీకు ఆహ్వానించి, సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భం గా కొలను హనుమంత రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ సమస్యలు ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార దిశగా కృషి చేస్తుందని ఈ సమస్యలపై ప్రజా ప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. మహిళ అధ్యక్షురాలు ఇందిర, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధు సూదన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, లక్ష్మారెడ్డి, ఎం.శ్రీనివాస్, గంగాధర్, నిజాంపేట్ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 'మన్ కీ బాత్'



- విద్యార్థులతో కలిసి వీక్షించిన మల్క కొమరయ్య

నవతెలంగాణ-కాప్రా

నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. పల్లవీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మెన్ మల్క కొమరయ్య, సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావు విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశప్రజలను ఉద్దేశించి మాట్లాడిన మాటలను విద్యార్థులు చాలా శ్రద్ధతో విన్నారు. దేశాభివద్ధి కోసం ప్రధాని ప్రారంభించిన పలు సంక్షేమ పథకాలు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలపై ఈ చర్చ జరిగింది. ఈ ఏడాదిలో ఇది రెండో మన్ కీ బాత్ కార్యక్రమం. ఈ కార్యక్రమం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (కేంబ్రిడ్జ్) క్యాంపస్‌లో ప్రత్యక్ష ప్రసార స్క్రీనింగ్ చేయగా, విద్యార్థులు చాలా ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ "ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో ముందుచూపు ఉన్న నాయకుడు. ప్రజా ప్రతినిధి కూడా. అందుకే దేశప్రజలందరికీ చేరువవ్వాలన్న ఉద్దేశంతో ఈ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎప్పుడూ ప్రజలతో మమేకమవుతుంటారు. ఈ కార్యక్రమాన్ని మేం మా విద్యార్థులతో వీక్షించడం ఆనందంగా ఉంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని సునీతా రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల న్యాయం చేయండి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్‌లో కొలన్ హన్మంత్ రెడ్డి ఎంపీపీగా ఉన్న సమయంలో పేదలకు సర్వే నెంబర్ 578, 580లో స్థలాలు ఇవ్వడం జరిగింది. ఆ స్థలంలో గల లక్ష్మీనగర్-2, అంబెద్కర్-2 వాసులకు భూమి పట్టాలు, ఎలక్ట్రికల్ స్తంబాలు, బోర్ ఉన్నా వారు కట్టుకున్న ఇండ్లను గత ప్రభుత్వంలో కూల్చివేసినారని, అట్టి ప్రజలకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు ఏసురత్నం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిను కలిశారు. వారి సమస్యను పరిష్కరించాలని తెలియజేశారు. ఈ మేరకు హన్మంత్ రెడ్డి స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కె.యాదయ్య, కె.మల్లేశం, భిక్షపతి, నదీమ్ పాషా, శ్రీను, భాస్కర్, సత్యనారాయణ, బాగారెడ్డి, అచ్చిరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఐఏ హైదరాబాద్ చాప్టర్ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బుద్ధాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ (బీఎల్ఐఏ) హైదరాబాద్ చాప్టర్ సమావేశం శనివారం ఓల్డ్ నేరెడమేట్ అంబేద్కర్ భవన్‌లో 50 మంది బ్లీయా సభ్యులతో ప్రొఫెసర్ స్వాయాజీ రావు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా బీఎల్ఐఏ హైదరాబాద్ చాప్టర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షుని ఉపేక్ష హాజరై బీఎల్ఐఏ వ్యవస్థాపకులు మాస్టర్ సింగ్ యున్ దమ్మసేన కోసం వివరించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పెన్నులు అందజేశారు. మాస్టర్ సింగ్ యున్ దమ్మసేన శనివారం కన్నుమూయగా వారి జ్ఞాపకార్థం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవతావాదాన్ని హైదరాబాద్ ప్రాంతంలో విస్తతంగా తీసుకెళ్లాలని, మానవ సేవ చేయడమే దీని లక్షమని చెప్పారు. నిరుపేద ప్రజల కోసం అనాథల కోసం ఇది పనిచేస్తుందని తెలియజేశారు. దమ్మ సాహిత్యాన్ని భవిత ఉపాధిక ఉపాసకులకు, సానుభూతిపరుల వద్దకు చేర్చాలని కోరారు కార్యక్రమంలో బీఎల్ఐఏ హైదరాబాద్ చాప్టర్ ప్రధాన కార్యదర్శి మంత్రి బాలయ్య నూతన సభ్యత్వం చేర్పించాలని బీఎల్ఐఏ కార్యక్రమాల గురించి రిపోర్ట్ ఇచ్చారు ఈ సమావేశంలో బీఎల్ఐఏ డైరెక్టర్లు రావుల అంజయ్య, శీలం అనిత రెడ్డి, నిమ్మ నారాయణ, కోకల సంజీవ్, సభ్యులు రాజేశ్వరరావు, సూర్య ప్రకాష్, బాబు, భవాని, వాణి, భక్తుల నాంపల్లి క్రాంతి కిరణ్, ట్రెజరర్ కిషోర్ కుమార్ తదితరులు విలువైన సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో అంబేద్కర్ భవన్ ఓల్డ్ నేరెడ్‌మేట్ కమిటీ కార్యవర్గ సభ్యులు సైతం పాల్గొన్నారు.

శ్రీ ముత్యాలమ్మ 8వ వార్షికోత్సవంలో పాల్గొన్న పుప్పాల భాస్కర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని శివలయనగర్‌లో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ ఆలయ అష్టమ(8వ) వార్షికోత్సవ కార్యక్రమనికి డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ...దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పుప్పాల భాస్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చౌడయ్య, ఆంజనేయులు, లక్ష్మణ్, వీరేశం, గోపాల్, కిరణ్ కుమార్, మూర్తి, స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అట్టుకల్ పొంగల్ పండుగలో పాల్గొన్న బండి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలోని దేవీనగర్ (కేరళ కాలనీ) లో నివాసముంటున్న మలయాళీలు ప్రతి సంవత్సరం ఇదే మాసంలో అట్టుకల్ పొంగల్ అనే పండుగను మహిళలు సాంప్రదాయభద్ధంగా నిర్వహిస్తుంటారు. అరటిపండ్లతో బెల్లం, అన్నం, నెయ్యిలతో ప్రసాదమ్ తయారు చేసి, అన్నప్రాసదాలను ప్రతి ఒక్కరు స్వీకరిస్తారు. కూకట్‌పల్లి పోచమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీనగర్ వాసులకు, కేరళ ప్రజలందరికి అట్టుకల్ పొంగల్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ కాలనీ అధ్యక్షులు ఎం.కె బాబు, నవోద్య, విజయ్ కుమార్, మంగళన్, అప్పుచెన్, మేఘ, రమేష్, కాంగ్రెస్ నాయకులు, మేకల సుదర్శన్, మేకల రమేష్, చున్ను పాషా, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో సేవలు మాకు కావాలి... మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్



- బీజేపీ నేత చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ మెట్రో సాధన సమితి వారు సుచిత్రలో ఆదివారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని, పారడైస్ నుంచి సుచిత్ర-కొంపల్లి -మేడ్చల్ వరకు మెట్రో రైలు కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి, రాజా రెడ్డి, మహేందర్ రెడ్డి, జార్జ్, అరవింద్ రావు, కృష్ణ రెడ్డి, ఉదయ శంకర్, కిషన్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ అవసరం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మధుమేహం, వయోభారంతో శరీరంలో వచ్చే మార్పులు, వినికిడి లోపం, చూపు మందగించడం వంటి సమస్యలు వద్ధుల జీవనయానాన్ని సంక్లిష్టం చేస్తాయని, ఇలాంటి సమయంలో వారికి కుటుంబ సభ్యుల చేయూతతోపాటు వైద్య సమస్యలను గుర్తించి చికిత్స అందించే జెరొంటాలజిస్ట్ (వృద్ధుల వైద్యనిపుణుల) అవసరం ఎంతో ఉందని సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, ప్రముఖ జెరియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ వసంత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. తీసుకునే ఆహారం, తేలికపాటి వ్యాయామాలు, ఆరోగ్యకరమైన జీవన విధానంతో.. ఈ సమస్యలను చాలా వరకు నివారించవచ్చని ఆయన సూచించారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య సంరక్షణలో ప్రివెంటివ్ మెడిసిన్, జెరొంటాలజిస్ట్‌లతోపాటు వారికి అన్ని రకాలుగా సేవలందించే సంస్థల ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. వయోవద్ధుల ఆలనాపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎల్డర్ ఎయిడ్ సంస్థ ఆదివారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఉచ్వాస్ ట్రాన్సిషన్ కేర్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సుకు హాజరైన సీనియర్ సిటిజన్లను ఉద్దేశించి మాట్లాడారు. వద్ధుల అవసరాలను కనిపెట్టుకుని ఉండి వారి ఆరోగ్య సమస్యలకు మందులు అందించడం, ఆలనాపాలనా చూసుకోవడం అత్యవసరమని నొక్కి చెప్పారు. ఈ నేపథ్యంలో వద్ధులు.. ముఖ్యంగా ఒంటరి వద్ధుల సంరక్షణలో ఎల్డర్ ఎయిడ్ లాంటి సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉచ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ ప్రతినిధులు సతీష్, పవన్, ఎల్డర్ ఎయిడ్ ప్రతినిధులు మందిరా జయసింహ పాల్గొన్నారు.

విజయ్ సంకల్పయాత్రలో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన విజయ్ సంకల్పయాత్ర ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చేరింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి నలుమూలల నుంచి బీజేపీ శ్రేణులు, భారీ బైక్ ర్యాలీగా కొంపల్లికి చేరుకొని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి, బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావ్‌కి స్వాగతం పలికారు. కొంపల్లి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర సుచిత్ర, జీడిమెట్ల, ఐడీపీఎల్ మీదుగా జగద్గిరిగుట్టలో జరిగె స్ట్రీట్ కార్నర్ సమావేశంతో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మూడోసారి శ్రీ నరేంద్ర మోడీ ప్రధాని అవుతారని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ అన్నారు. గత పది సంవత్సరాలుగా గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, దేశాన్ని ప్రగతి బాటలో నడిపాడని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. అయోధ్య శ్రీరామచంద్రుని ఆశీస్సులతో బిజెపి 400కు పైగా సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, ప్రజలంతా మోడీ వైపే ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే పోటి ఉంటుందని, బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్‌లోకి మురుగు నీరు...



నవతెలంగాణ-సిటీబ్యూరో: హైదరాబాద్ నగర పర్యాటక కేంద్రంగా ఉన్న హుస్సేన్ సాగర్‌లో రోజు రోజుకూ నీటి నాణ్యత పడిపోతుంది. యథేచ్ఛగా కలుస్తున్న మురుగు నీరు, వర్షపు నీటి ప్రవాహం తగ్గిపోవడంతో నీటిలో మార్పులొస్తున్నాయి. తాజాగా పడిపోతున్న నీటి నాణ్యతపై పీసీబీ వెల్లడించిన నివేదికలోనూ వెల్లడి కాగా, అధికారులు తీసుకునే చర్యలతో హుస్సేన్ సాగర్‌లో జీవజాలం మనుగడ ప్రమాదంలో పడేలా ఉంది. అయితే, పదేళ్ల క్రితంతో పోలిస్తే హైదరాబాద్ హుస్సేన్ సాగర్ మెరుగుపడినా, నీటి నాణ్యతను మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు



నవతెలంగాణ-ఓయూ సిటీబ్యూరో: నగరంలోని అత్యంత సమస్యాత్మకమైన చెత్త కేంద్రాల్లో పని చేసిన పారిశుధ్య కార్మికులకు జీహెచ్ఎంసీ ప్రశంసా పత్రాలను సత్కరించింది. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులకు ప్రశంసా పత్రాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల కృషి వల్లనే జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీకి ఎన్నో అవార్డులు వచ్చాయన్నారు.

పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

పిల్లలకు చిన్నతనం నుంచే వారికి ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై ఉందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 16 వ తేదీన కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మెడల్స్ సాధించిన జెక్ కాలనీకి చెందిన చిన్నారులతో కోచ్‌లు దేవేందర్, సిరి ఎలిజబెత్‌లు ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గోల్డ్ మెడల్ సాధించిన గుంటూరు మోక్షిక, రిత్విక్, సిల్వర్ మెడల్ సాధించిన మోక్షిత, కార్తీక్, లియోనా, శ్రీయాన్ ఇతర మెడల్స్ సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే అభినందించారు.ఎంతోశిక్షణ ఇచ్చి మెడల్స్ సాధించే విధంగా కృషి చేసిన కోచ్‌లను అభినందించారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి వాసవి చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీ ఎంపిక



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి వాసవి చారిటబుల్ ట్రస్ట్‌కు ఆదివారం నూతన కమిటీ ఎంపికైంది. మల్లికార్జున్ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహా యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ చైర్మన్‌గా పుప్పాల అశోక్ గుప్త, వైస్ చైర్మన్‌గా పూర్ణచంద్రగుప్త, ప్రధాన కార్యదర్శిగా నాగశెట్టి గుప్తా, కోశాధికారిగా గౌరీ శంకర్ గుప్తలు నియమితులయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ మొత్తం ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కఋషి చేయాలని కోరారు. ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించి వారి అభివఋద్ధికి తోడ్పాటు అందించేలా నూతన కార్యవర్గం పనిచేయాలని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతో పాటు అందరికీ మేలు చేకూర్చే పనులు చేస్తూ ముందుకు సాగాలని ఆకాం క్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభు గుప్తా, రంగ రవీంద్ర గుప్తా, మురారి శెట్టి శేఖర్ ,గందె రామకఋష్ణ గుప్తా, రాజేందర్ గుప్తా శ్రీరామ్ పండరి గుప్తా సత్య మూర్తి గుప్తా పాన్నారు.

ఆల్ ఇన్ మళయాలీ అసోసియేషన్ చైర్మన్‌గా సురేంద్రన్



నవతెలంగాణ-బేగంపేట్

ఆల్ ఇన్ మళయాలీ అసో సియే షన్ తెలంగాణ చైర్మన్‌గా కన్నాట్ సురేంద్రన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రా బాద్లోని ఓ హెూటల్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చైర్మెన్ గా కన్నాట్ సురేంద్రన్ తో పాటు ప్రెసిడెంట్ గా బాబు ఉన్నిన్నీ, వైస్ ప్రెసిడెంట్ గా టీపీ మ్యాథ్యూ, ప్రధాన కార్యదర్శిగా జీ సురేష్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా పీ సంతోష్, కార్యనిర్వాహక కార్య దర్శిగా పీ కృష్ణ కుమార్, కోశాధి కారి గా సేథు మాధవన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యు లుగా వీ విశ్వనాథన్, కేఆర్ శశిధరన్, ఎంఎస్ రాజేష్ కుమార్, జీ వేణుగోపాల్, కేవీ శణ్ముఖన్ లను మహిళ వింగ్ నుంచి టీఎస్ వల్సాలా, బిజీ మ్యాథ్యూ, సరిత సునిల్‌లు ఎన్నికయ్యారు.

నా కారే అపుతావా అంటూ హెూంగార్డుపై యువతి బూతు పురాణాలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ నుండి బంజర హిల్స్ రోడ్ నెంబర్ 12 మీదుగా వెళుతున్న ఓ యువతి హెూంగార్డుపై బూతు పురాణాలు మాట్లాడిన ఘటన బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకార బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ హెూంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న యువతి రాంగ్ రూట్‌లో రావడం తప్పు అంటూ కారు ఆపిన యువతిని హెూంగార్డ్ బట్టలు చింపి దాడికి పాల్పడి అంతటితో ఆగకుండా అతని ఫోన్ పగలగొట్టింది. బూతులు తిడుతూ హెూంగార్డ్ వీక్నెస్ ని బెదిరించింది. దీంతో అతను బంజర హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయక కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి అవకతవకలకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సంవత్సరం మే నెలలో నియమించే వైస్ ఛాన్సలర్ ల అవకాశం కల్పించకూడదని ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆదివారం ప్లే కార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ ప్రభుత్వ విజ్ఞప్తి కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ. శనివారం ఓయూ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలను సమర్థించుకోవడానికి అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓయూ, కేయూ, అంబేద్కర్, జేఎన్టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయాలలో కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకున్నా అవకతవకలకు పాల్పడి అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లు అయ్యారని ఆయన తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా హైకోర్టు సెట్టింగ్ చేత విచారణ జరిపించి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఎలాంటి విద్యా సంబంధమైన పదవులు కూడా వారికి కేటాయించకూడదు అని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈసీ (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులు, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ లు బిఆర్ఎస్ పార్టీ అనుకూలురని వారు అనేక విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకొని విద్యార్థులను ఇబ్బంది గురిచేసారని తెలిపారు. కావున వెంటనే వాటిని రద్దు అవసరం ఉందన్నారు. ఇటీవల కొత్త వైస్ ఛాన్సలర్ నియమించుటకు ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలకు వారికి సంబంధించిన వారిని నామినిలుగా ప్రతిపాదించి మళ్లీ పదవులు పొందే కుట్రలు చేస్తున్నారని దీనిని ప్రభుత్వం గమనించాలని కూడా అన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆరెకంటి భగత్ నాయకులు రాధాకృష్ణ, అశ్వన్, హర్ష చరణ్ పాల్గొన్నారు.

ఎస్‌టీఎస్ఐ క్యాలెండర్‌ని విడుదల చేసిన ఆర్. క్రిష్ణయ్య



నవతెలంగాణ-ఓయూ

సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఐ) 75వ, గణతంత్ర దినోత్సవం సందర్భం గా సంవత్సరం పాటు ప్రజా రాజ్యాధికార ఉత్సవం పేరుతో రూపొందించిన 2024 క్యాలెండర్ ను ఆదివారం జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా ఎస్‌టీ ఎస్ఐరాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళ అజయ్ మాట్లాడుతూ. 75 వ గణతంత్ర సంవత్సరంగా 2024ని ప్రజలందరూ వేడుకగా జరుపుకోవాలని, భారత రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వ హక్కులు, అభివృద్ధిని పొందుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ లు సోదరభావంతో అసమాన తలను దూరం చేసుకుని సామాజిక సమీకరణాలతో చివరి వ్యక్తికి న్యాయం అందేలా ప్రజాస్వామ్య నిర్మాణా నికి కట్టుబడి ముందుకు కదలాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మనోజ్,ప్రసాద్, హరికృష్ణ, రాజేందర్ బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాదిగలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలి



మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ మాదిగ

నవతెలంగాణ-ఓయు

తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓయూ లో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాదిగ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన దాదాపు 10 సంవత్సరాల నుండి గత ప్రభుత్వ పాలకులు మాది గలకు రాజకీయంగా, పభుత్వంలో తగిన ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కొత్తగా ఏర్పాడిన ప్రభుత్వం మంత్రివర్గంలో రాజకీయంగా మాదిగలకు సముచిత స్థానాన్ని కల్పించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ను లోకసభ ఎన్నికలలో మాదిగలకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. రాష్ట్రంలోని మాదిగల ప్రజల సమస్యలపై, రాష్ట్రంలోని సమస్యలపై పార్లమెంట్లో మా ట్లాడే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్స్ చిలుక రాజనర్సింహ, శ్యామ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాదిగ, అధి కార ప్రతినిధిప్రకాష్,శీను,శాంతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలూమిని మీట్ -2023



- పూర్వ విద్యార్థులు కళశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
- టెక్నాలజీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సేవాలు భేష్

త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-ఓయూ

పూర్వ విద్యార్థులు కళాశాలాల అభ్యున్నతికి తోడ్పాటు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని త్రిపుర రాష్ట్ర గవర్నర్, ఓయూ పూర్వ విద్యార్థి నల్లు.ఇంద్రసేనా రెడ్డి సూచించారు. ఆదివారం ఓయూ టెక్నాలజీ కళశాల ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అలూమిని అసోసియేషన్ అలూమిని మీట్ - 2023లో అయిన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఓయూకు దేశంలో ఎ యూనివర్సిటీ కి లేని గొప్ప గొప్ప వివిధ రంగాల్లో ఉన్న రాణిస్తున్న అలూమిని ఉందన్నారు. బాధ్యతగా యూనివర్సిటీ కళశాలాల అభివృద్ధి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. మరొక అతిథి డైరెక్టర్ ,ఇండి యన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ,తిరు పతి ప్రొ.కె.ఎన్.సత్యనారాయణ మా ట్లాడుతూ యూనివర్సిటీ పరిస్థితిని, టెక్నా లజీని జోడించి ఎలా ముందుకు పోవాలో వివరించారు. ఓయూ టెక్నా లజీ కళశాల అందిస్తున్న సేవాలు ప్ర శం సించారు. అంతకుముందు అలు మిని ఈసీ సమావేశం నిర్వహించారు. అలూమిని అధ్యక్షుడు ప్రొ.ఎస్. వెంకటే శ్వర్, ప్రధాన కార్యదర్శి యం.రాజా మహేం దర్ రెడ్డి మాట్లాడుతూ. ఇప్పటి వరకు చేసిన సేవాలు, రానున్న రోజుల్లో చేయనున్నసేవాలువివరించారు.కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ.రవీందర్, కాశ్మీర్ సెంట్రల్ యూనివ ర్సిటీ వీసీ, ఎన్ఐటి శ్రీనగర్ డైరెక్టర్ ప్రొ. ఎ. రవీం ద్రనాథ్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ, ప్రిన్సిపాల్ ప్రొ.సాయిలు ప్రసంగిం చా రు. వివిధ రంగాల్లో స్థిరపడి రాణిస్తున్న పలువురు పూర్వ విద్యార్థులను సత్కరించారు.బెస్ట్‌స్టూడెంట్‌అవార్డును డా.ఎస్. ఐలయ్యకు ప్ర ధానం చేశారు. కార్యక్రమంలో డా.పవన్ కుమార్, పూర్వ విద్యార్థులు, అలూ మిని సభ్యులు, టెక్నాలజీ కళశాల ప్రొపెసర్స్ పాల్గొన్నారు.

విలేకరిపై దర్యాప్తు చేపట్టండి నగర సీపీ ఆదేశాలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోలిచౌకిలోని ఓ కాలనీలో ఆరు రోజుల క్రితం 6 సంవత్సరాల బాలికలు బలత్కరించే ప్రయత్నాలు చేసినా ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద నమోదు చేశారు.సదురు వార్త ఓ పత్రిక విలేకరి వారి పేర్లతో కూడిన కథనాన్ని ప్రచురించడంతో నగర సిపి ఇచ్చిన ఆదేశాల మేరకు సదరు పత్రిక విలేకరిపై కేసు నమోదు చేయాలని ఫిలింనగర్ పోలీ సులకు ఆదేశించడంతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిన్నారుల్లో డ్రీమ్స్ అన్ లిమిటెడ్‌పై వర్క్‌షాపు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బసవతారకం స్మైల్ ట్రైన్ సంస్థ వారు గ్రహణం మొర్రితో ఇబ్బందిపడుతున్న చిన్నారుల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థ బసవతారకం స్మైల్ ట్రైన్ అధ్వ ర్యంలో హైదరాబాదులో చిన్నారుల కోసం నాలుగు రోజుల పాటూ థియేటర్ వర్క్ షాపును నిర్వహించారు. డ్రీమ్స్ అన్ లిమిటెడ్ పేరుతో బంజారా హిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ ఆవరణలో నిర్వహిం చబడిన ఈ వర్క్ షాపులో గ్రహణం మొర్రితో భాదపడుతున్న చిన్నారులలోని ప్రతిభను వెలికి తీసి వారి కలలకు రూపం కలిగించే ప్రయత్నంలో భాగంగా అర్ అండ్ లీడ్,హాలియాన్ ఇండియా,రెగ్యులేటరీ పోర్ట్ ఫోలియో అండ్ ప్రయారిటైజైషన్ డైరెక్టర్,అవిజిత్ కొంపి,బసవతారకం స్మైల్ ట్రైన్, ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ ప్రాజెక్టు డైరెక్టర్, ప్రొఫెసర్డా.డి ముకుంద రెడ్డిలు ముందుగా దీనికి సం బంధించిన లోగోని ఆవిష్కరించి ప్రసంగించారు. ముం దుగా కార్యక్రమాన్ని ఉద్దేశించి అతిథిగా హాజరైన అవి జిత్ కొంపి మాట్లాడుతూ గ్రహణం మొర్రి లేదా చీలిక పెదవి అంగిలితో భాదపడుతున్న చిన్నారులు ఎన్నో ఆరోగ్యపరమైన సవాళ్లను ఎదుర్కొంటారనీ అన్నారు. డా.డి.ముకుంద రెడ్డి మాట్లాడుతూ వర్క్ షాపుల ద్వారా వారి వారి ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పడమే కాకు ండా భవిష్యత్తులో ఎన్నో మంచి అవకాశాలు అందిపుచ్చుకోగలరన్నారు.చివరగా ఆసియా,స్మైల్ ట్రైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌రీజనల్ డైరెక్టర్ మమత కరోల్, మాట్లాడుతూ గ్రహణం మొర్రి అనేది పై పెదవి లేదా నోటి పై భాగంలో పుట్టినపుడు ఏర్పడే శారీరక లోపమని వివరించారు. అనంతరం కార్యక్రమంలో శిక్షణ పొందిన చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించి ఆహూ తులను ఆకట్టుకొన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణా ప్రభుత్వ తెలంగాణా సోషల్ ఇంపాక్ట్ గ్రూప్,పరిశ్రమల విభాగం, డైరెక్టర్,మిస్ అర్చనా సురేష్,హెడ్, అనస్థీషియా విభాగం,డా.బసంత్ కుమార్ రాయతో, పాటూ సర్జికల్ అంకాలజిస్టు,డా.కెవివియన్.రాజు, డా.విభా వరి నాయక్, అనస్థీషియాలజిస్టు లతో పాటూ పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

సంచార జాతులుగా నిరాశ్రయులను ప్రత్యేకంగా గుర్తించాలి

-మేథో మధన సభలో వక్తలు



నవతెలంగాణ-బంజారా హిల్స్

సంచార జాతులుగా,నిరాశ్రయులుగా ఉన్న ప్రజలను ప్రత్యేకంగా గుర్తించి “కుల సర్వేలో” వివరాలు నమోదు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన “మేథో మధన సభలో కోరారు.సామాజిక, అర్థిక కుల సర్వే తీర్మానం పై రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు, ధన్యవాదాలు తెలిపిన మేధావుల సభలో ఆధునిక,సాంకేతిక టూల్స్ తో “డిజిటలైజేషన్ పద్ధతిని అవలంబించాలనీమొబైల్ అప్ను రూపొందించి,టాబ్స్ సహకారంతో వివరాలను సేకరించాలనీ ఎప్పటి వివరాలు అప్పుడే ప్రధాన సర్వర్లో నిక్షిప్తం చేయాలనీ గోప్యతతో భద్రపరచాలన్నారు.వారంలోపు ప్రభుత్వ కుల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వానికి “నిపుణుల నివేదిక” అందచేయనున్నట్లు ప్రకటించారు.త్వరలో బీసి సంఘాల,కుల ప్రతినిధుల సమావేశాల నిర్వహణకు నిర్ణయనించామని వలసలత,స్థిర నివాసం లేకుండా ఉపాధి అవకాశాలు ఉన్నచోట, జీవనాధారం లభిస్తున్న ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజలను ప్రత్యేకంగా గుర్తించాలి.”సామాజిక, అర్థిక, కుల సర్వే” (కుల గణన) లో వారి వివరాలను నమోదు చేయాలని “ బహుజన మేధావుల సభ” రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏకగ్రీవ తీర్మానం తో కోరింది.ఆదివారం నాడు భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ “కాన్ఫరెన్స్ హాల్” లో “సామాజిక,అర్థిక, కుల సర్వే” పై “మేథో మధనం” పేరిట చర్చా వేదిక ఆదివారం నిర్వహించారు. సాయంత్రం వరకు సాగిన ఈ సమావేశంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ఈ సర్వేలో పాటించాల్సిన విధి విధానాలు, కార్యా చరణ పై మేధావుల సభలో సుదీర్ఘ సమాలోచనలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, ప్రధాన వక్తగా మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, సామాజికవేత్తలు తమ అభిప్రాయాలను సమగ్రంగా వెలిబుచ్చారు. కార్యక్రమ సమన్వయకర్తగా భారతీయ ఓబీసీ సమాఖ్య అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు వ్యవహరించారు.సంచార,అర్థ సంచార ,విముక్త జాతులు,కులాలు నిరాశ్రయులుగా ఉన్నవారు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి అందుకోలేక పోతున్న ప్రజలు, ఆధునిక అభివృద్ధి కి దూరంగా, ఇప్పటికీ లెక్కకు మించే పేదలు ఉన్నారు. వివక్షత, ఉదాసీన వైఖరి, అణిచివేతకు గురవుతున్న ప్రజలు ఉండడం సమాజానికి హితం కాదు. ఇలాంటి నిర్లక్ష్య వర్గాలను సమాజ ప్రగతి లో భాగస్వామ్యులను చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తి అని, మేథో మధనంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సభలో పలువురు మాట్లాడుతూ సర్వేలో వివరాలు సేకరిస్తున్నప్పుడు ఎలాంటి నిర్లక్ష్య ధోరణికి తావు లేకుండా అధికారులు వ్యవహరించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పలు రాష్ట్రాలలో కుల సర్వేలు జరుగుతున్నప్పుడు వివరాల సేకరణ లో తప్పులు దొర్లినట్లు విమర్శలు ఎదుర్కొన్న సందర్భాలను గమనంలో ఉంచుకోవాలని వారు సూచించారు. ఈ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో సర్వే పూర్తి చేస్తే రాష్ట్రంలోని ప్రజలకు ,పేదవర్గాలకు మేలు జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు.కుల సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ముందుకు రావడం పట్ల వక్తలు హర్షం వ్యక్తం చేసారు. ఇదొక చారిత్రాత్మక ప్రక్రియగా నిలుస్తుందన్నారు.

గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ - బాలానగర్

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి బాలానగర్‌లో నివాసముంటూ గంజాయి చాక్లెట్లు విక్రయిస్తుండగా అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. అనంత కుమార్ బారిక్ (33) అనే వ్యక్తి బాలానగర్ ప్రాంతం లోని ఫరక్ కాంటా ప్రాంతం లో చిన్న కిరాణా షాప్ నిర్వహిస్తూ విద్యార్థులకు, పరిసరాల్లో కార్మికులకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్టు తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్ఓటి పోలీసులు కిరాణా షాపుల్లో తనిఖీలు చేయగా మూడు ప్యాకెట్లు లభిం చాయి.మొత్తం 120 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంత్ కుమార్ గతకొంతకాలంగా హైదరాబాద్ లోని బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో విద్యార్థులకు, కార్మికులకు చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

11

హైదరాబాద్

HMDA

సోమవారం | ఫిబ్రవరి 26, 2024 | www.navatelangana.com

'బహిరంగ మహాసభను విజయవంతం చేయండి'

నవతెలంగాణ-చేవెళ్ల

27న చేవెళ్లలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ మహాసభను విజయవంతం చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి కార్యాలయ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేసీఆర్ గార్డెన్‌లో చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2 ప్రధానమైన హామీల అమలుకు శ్రీకారం చుట్టానుందన్నారు. 6 గ్యారంటీలలో భాగంగా చేవెళ్లలో 200 యూనిట్ల విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్లు ఇచ్చే కార్యక్రమం ఈ నెల 27న చేవెళ్లలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. చేవెళ్ల సభకు ప్రియాంక గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు రానున్నట్టు తెలిపారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీం భరత్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్ క్రీడాకారులు సత్తా చాటాలి



- ప్రాథశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

తెలంగాణ రాష్ట్ర 400 మీటర్స్ చాంపియన్ షిప్ పోటీల్లో బడంగ్ పేట్ క్రీడాకారులు సత్తా చాటాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్ అన్నారు. హైదరాబాద్ లోని ఔటర్ రింగ్ రోడ్ కొల్లూరు నందు గల గాడియం స్పోర్ట్స్ పియ స్కూల్ లో జరగబోయే తెలంగాణ స్టేట్ 400మీ. చాంపియన్ షిప్స్ కోసం ఈ నెల 23వ సరూర్‌న గర్ లో గల అథ్లెటిక్స్ ప్రధాన మైదానంలో నిర్వహిం చిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ ద్వారా ఇద్దరు అథ్లెట్లను రాష్ట్ర స్థాయి 400 మీటర్ల ఛాంపియన్షిప్స్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరని అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం తెలంగాణ స్టేట్ 400 మీటర్ల ఛాంపియన్షిప్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బడంగ్ పేట్ తరపున స్పోర్ట్స్ కిట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులకు వారి చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్ అందజేశారు.

అనంతరం ఆయన క్రీడాకారులనుద్దేశించి ప్రధానోపాధ్యాయులు అర్జున్ మాట్లాడుతూ క్రీడలతోనే విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు మనో ధైర్యం కలుగుతుందన్నారు. తెలంగాణ స్టేట్ 400 మీటర్ల చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన చేసి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు 1.ఆర్.వరుణ్ పదవ తరగతి విద్యార్థి 18 సంవత్సరాల బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో.. 2. ఎం.గాయత్రి సాయి జమున ఏడవ తరగతి విద్యార్థిని 14 సంవత్సరాల బాలిక విభాగంలో.. 400 మీటర్ల పరుగు పందెంలో పాఠశాల నుండి తెలంగాణ స్టేట్ 400 మీటర్ల చాంపియన్‌షిప్‌కు ఎంపికై పాలగొనున్న క్రీడాకారులకు ఉపాధ్యాయు లతో పాటు క్రీడాకారుల తల్లిదండ్రులు, మాజీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు స్వాము లు, క్రీడాభిమానులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంత ఎదిగినా మన మూలాలను విస్మరించొద్దు



- త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

మనం ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా కానీ మన మూలాలను విస్మరించ వద్దని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి అన్నారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి విద్యా సమితి ఆధ్వర్యంలో అబిడ్స్ రెడ్డి హాస్టల్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నల్లు ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ త్రిపుర రాష్ట్రం చిన్న రాష్ట్రం అయినప్పటికి అక్కడ కొన్ని సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు. తాను రెడ్డి హాస్టల్ విద్యార్థి కాదని, అందులో చదువు కోలేదని, కానీ రెడ్డి సంఘం సమావేశాలలో పాల్గొనడమే కాకుండా ఎన్నికలలో ఓటింగ్ వేసే వాడినని ఇంద్రసేనా రెడ్డి గుర్తు చేసుకున్నారు. గ్రామాలలో రెడ్డిలకు పట్టు ఉంటుందని, పెత్తనం చేస్తారని అపోహలు ఉన్నాయని కానీ సమయానికి ఆర్థికంగా, సహాయం చేసి అవసరానికి ఆదుకునే బాధ్యత గ్రామాలలో రెడ్డి కమ్యూనిటీకి మంచి పేరు ఉందన్నారు. నిజాం పాలనలో కూడా వారిని ఒప్పించి గ్రామాలలో ఉండే విద్యార్థుల కోసం వెంకటరామిరెడ్డి హాస్టల్ భవనాలను నిర్మించారని చెప్పారు. వెంకటరామిరెడ్డి ఆశయాలను విద్యార్థులు మరింత ముందుకు తీసుకెల్లా లని పిలుపునిచ్చారు. అనంతరం ఆదర్శ పథంలో పోలీసు పుస్తకాన్ని గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ ఎస్పీ పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రాజ బహద్దూర్ వెంకట్ రామారెడ్డి విద్యా సమితి అధ్యక్షులు ఎం.వి. రంగారెడ్డి, కార్యదర్శి తీగల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఇంజినీర్స్ ఎన్నికలు.. అధ్యక్షుడిగా రాజ శేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ (జేఈఏ) ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మరోసారి అధ్యక్షుడిగా రాజ శేఖర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వర్ రావు, ఇందిరా షీలా రాణి, జనరల్ సెక్రటరీ గా వినోద్ భార్గవ, జాయింట్ సెక్రటరీలుగా కల్యాణి, మహమ్మద్ ఆరిఫ్, చంద్ర ప్రకాష్ రెడ్డి, మహిళా జాయింట్ సెక్రెటరీ గా ప్రశాంతి, ట్రెజరర్ గా సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా శరత్ కుమార్ రెడ్డి, ఈసీ మెంబర్లుగా నవీన్, గౌరీదేవి స్వామి, సూర్యప్రకాష్ రావు, నరేష్ లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నవనీత రావు వ్యవహరించారు. నిర్వహణ బృందంలో రాములు, స్వామి, ఆంజనేయులు ఉన్నారు. 2024 - 2026 కాలానికి ఈ అసోసియేషన్ ఉంటుంది.

వేములవాడలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



- రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త స్వామి వారిని దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి మాతకు



జరిగిన బంగారు కిరీటం ఏర్పాటు, అభిషేకం యాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి అమ్మ వార్ల దివ్య సన్నిధిలో వేద పండితులు, అర్చక స్వాములు,వేద మంత్రాలతో కండువాలతో సన్మానించి వేదాశీర్వచనాలు అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాస గుప్త మాట్లాడుతూ.. ప్రజలకు ఉన్న ఇబ్బందులు అన్ని తొలగి, వారు సుఖ, సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని స్వామిని కోరుకోవడం జరిగిందన్నారు. ఐవీఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృపాల్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్ గుప్త, రవీందర్, ఆర్యవైశ్య సోదర సోదరీ మణులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలి





- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు
- బాలకృష్ణ కు కేవీపీఎస్ సత్కారం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

జగిత్యాల కోరుట్ల పట్టణ కేంద్రాలలో నిలువ నీడలేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పోరాడినందుకు తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణను 38 రోజులు జైల్లో నిర్బంధించిందని.. అక్కడి పేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, పేదల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు కోరారు. జైలు నుంచి విడుదలైన అనంతరం హైదరాబాద్ ముషీరాబాద్ లోని ఆయన ఇంటి వద్ద కేవీపీఎస్ నాయకత్వం శాలువా కప్పి కేవీపీఎస్ డైరీ క్యాలెండర్ ఇచ్చి ఆయన దంపతులను ఘనంగా సత్కరించింది. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇండ్ల స్థలాలు పేదలందరికీ ఇచ్చి పక్కా గృహాలు నిర్మిస్తామని చెప్పారని.. నేడు పేదలు గుడిసెలు వేసుకుంటే అవి తొలగించి కాలబెట్టి కూలగొట్టి పోరాటం నిర్వహిస్తున్న పేదల పైన కొత్త ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని తెలిపారు. ఈ నిర్బంధఖాండను ఉపసంహరించుకోవాలన్నారు ఎన్నికల ముందు చెప్పిన మాటకు కొత్త ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలన్నారు పేదల తరుపున పోరాడుతున్న నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. 38 రోజులు జైలు జీవితం గడిపిన బాల కృష్ణ పోరాట స్ఫూర్తితో ఇండ్ల స్థలాల ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య,గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఉడుత రవీందర్, టి టెన్ ఛానెల్ సీఈఓ సుందర్ కేవీపీఎస్ నగర కార్యదర్శి బి సుబ్బారావు ,ఐద్వా నాయకురాలు భవాని తదితరులు పాల్గొన్నారు ..

పార్ట్‌టైమ్ జాబ్ ఇప్పిస్తానంటూ మోసం

- ముంబైకి చెందిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్ట్‌టైమ్, వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్‌లు ఇప్పిస్తానని ప్రజలను మోసం చేసినందుకు ముంబైకి చెందిన ఓ వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు మహ్మద్ సోహ్యబ్ బబ్లూ ఖాన్ హైదరాబాద్ నివాసిని రూ. 2.38 లక్షలు మోసం చేశాడని పోలీసులు తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లలో జాబ్ ఆఫర్ ద్వారా ఇదంతా ప్రారంభమైంది. నిందితుడు తన నమ్మకాన్ని పొందడానికి మొదట అతనికి రూ. 500 బోనస్‌గా చెల్లించాడు, కాని తరువాత బాధితుడు అనేక ఖాతాలలో డబ్బు జమ చేసేలా నిందితుడు చేశాడు.

బబ్లూ ఖాన్ సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను అందించినట్టు ఆరోపణలు వచ్చాయి. నిందితుడు తన పేరుతో పాటు ఇతరుల పేర్లు, నకిలీ కంపెనీల పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచాడు. ఈ ఖాతాలను ఇతర మోసగాళ్ల లావాదేవీలను రూట్ చేయడానికి ఉపయోగించాడని తెలిసింది. బ్యాంకు ఖాతా అందించినందుకు నిందితుడు రూ. 1 లక్ష వరకు సంపాదించాడని పోలీసులు తెలిపారు. ఇప్పుడు గుర్తించిన ఖాతాల్లో ఇలాంటి 42 మోసం కేసుల్లో ప్రమేయం ఉందని, అందులో ఆరు తెలంగాణకు చెందినవేనని తేలింది. రూ. 5 లక్షలు, చెక్కు పుస్తకాలు, 38 డెబిట్ కార్డులు, 11 పాస్‌బుక్‌లు, నకిలీ కంపెనీల రబ్బర్ స్టాంపులు, సిమ్ కార్డులు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జర్నలిస్ట్ శంకర్‌కు ఏం జరిగినా రేవంత్‌రెడ్డిదే బాధ్యత

- మాజీ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కొడంగల్ లో జరుగుతున్న రైతుల భూకబ్జాల పైన నిజాలు వెల్లడించినందుకే జర్నలిస్ట్ శంకర్ పైన దాడి జరిగిందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. భవిష్యత్తులో శంకర్‌కు ఏం జరిగినా పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డి వహించాల్సి వస్తుందన్నారు. ఇటీవల దుండగుల దాడిలో గాయపడిన జర్నలిస్ట్ శంకర్‌ను తుర్కయంజాల్‌లోని ఆయన ఇంటిలో కేటీఆర్ పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ పై జరిగిన దాడి విషయంలో పోలీస్ అలసత్వాన్ని, ప్రభుత్వ పక్షపాత వైఖరిని ప్రధాన ప్రతిపక్షంగా ఎండగడతామని హెచ్చరించారు. ఆయనపై జరిగిన దాడికి పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వహించాలన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టు శంకర్ పైన ఎట్లాంటి హాని జరిగినా దాని పూర్తి బాధ్యులు రేవంత్ రెడ్డి అవుతారని హెచ్చరించారు. కొడంగల్‌లో రైతులకు సంబంధించిన భూముల కబ్జాల విషయాన్ని బయటకు తీసుకువచ్చినందుకే జర్నలిస్టు శంకర్ పైన కాంగ్రెస్ గుండాలు దాడి చేశారన్నారు. నిజాలను నిర్భయంగా బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్న శంకర్ పైన, రాజ్యాన్ని అడ్డుపెట్టుకొని, పోలీసులను అడ్డుపెట్టుకొని అంతమొందించాలన్న ఈ ప్రభుత్వ ప్రయత్నం అదృష్టవశాత్తు విఫలమైందన్నారు. భవిష్యత్తులో శంకర్ పైన దాడులకు తెగబడితే ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. శంకర్ పైన పకడ్బందీగా గత కొద్ది రోజులుగా రెక్కి నిర్వహించి మరీ పదుల సంఖ్యలో వచ్చిన కాంగ్రెస్ గుండాలు ఆయనను అంతమొందించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అయితే స్థానికులు, సీసీ కెమెరాల సాక్ష్యంగా ఉండడంతో వారి కుట్ర ఫలించలేదన్నారు.

శంకర్ లేవనెత్తుతున్న ప్రశ్నలను తట్టుకోలేకనే ఈ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయన పైన దాడికి తెగబడిందని ఆరోపించారు. శంకర్ ను అంతమొందించేందుకు భౌతికంగా దాడి చేసినా, స్థానిక పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా అలసత్వం పక్షపాతం చూపించారన్నారు. పోలీసుల పక్షపాత వైఖరిపైన ప్రధాన ప్రతిపక్షంగా అవసరమైన కార్యాచరణ చేపడతామన్నారు. ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీని కేటీఆర్ కోరారు. గతంలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, రాష్ట్ర ముఖ్యమంత్రి కుటుంబంపైన అడ్డగోలుగా మాట్లాడినా, ప్రభుత్వంపైన అనేక అసత్య ప్రచారాలు చేసినా, పది సంవత్సరాలపాటు ప్రభుత్వంలో ఉన్న ఏనాడు కూడా భౌతిక దాడులకు పాల్పడలేదని కేటీఆర్ గుర్తు చేశారు. జర్నలిస్టు శంకర్ ను అంతమొందించే ప్రయత్నం చేసినా, గతంలో మాట్లాడిన జర్నలిస్టు సంఘాలు ఈరోజు మౌనంగా ఉన్నాయని అన్నారు. అయితే ఈ రోజు జర్నలిస్టు శంకర్‌కు జరిగిన పరిస్థితి, రేపు అందరూ జర్నలిస్టులకు జరిగే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వ అణచివేత చర్యలపైన స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కటీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

IN THE COURT OF HON'BLE XVII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
I.A.NO. 1493 OF 2023
IN
O.S.NO. 768 OF 2017

BETWEEN:
Smt.Roopa & another ...Petitioners/Plaintiffs
And
1.Smt.D.Manemma & others ...Respondents No.1 to 6 /Defendants No.1 to 6
2.Manoj & others ...Respondents No.7 to 14/ Defendants No.7 to 14

To
1.Manoj S/o.Late Smt.Andalu and Late Ramulu
2.Smt.Buji @ Haritha W/o.Srinivas
3.Smt.Vanaja W/o.Dhasharath
4.Raju S/o.Late Krishna
5.Jagadish S/o.Late Krishna
6.Santhosh S/o.Late Krishna
7.Bhupesh S/o.Late Krishna
8.Annapurna D/o.Late Krishna
All are R/o: H.No.14-10-221, Lower Dhoolpet, Hyderabad-12.

Take notice that the Petitioners/ Plaintiffs have filed a petition U/o 1 Rule 10 of CPC R/W 28 of CRP, vide IA No.1493/2023 to implead you as proposed Defendants No.7 to 14 in the above suit for partition and separate possession in respect of the suit schedule of properties and the said case is posted **on 28-02-2024** make m it convenient and attend the above case before the above Hon'ble Court **on 28-02-2024 at 10:30 AM**, or else the Hon'ble court will proceed with the matter on merits and pass orders as per records available.

//BY THE ORDERS OF THE HON'BLE COURT//
S.VIJAY PRASHANTH
ADVOCATE
Off: 1-7-204, Road No.12, Chaitanyapuri, Dilsukhnagar, Hyderabad, Mobile: 9848040508.
COUNSEL FOR PLAINTIFFS

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT. AT : IBRAHIMPATNAM
O.S.NO.110 OF 2023

Between:
Islavath Raju and Another ....Plaintiff
AND
Islavath Dasli and others ....Defendants

To
D-9 : M. Srinivas Reddy, S/o. Late Anji Reddy, Aged about 58 years, occ: Business, R/o. Qtr. No.B3, Telecom quarters, I.S. Sadan, Shantosh Nagar, Hyderabad - 500 039.
D-10: M. Rajya laxmi, w/o. M. Srinivas Reddy, Aged about 48 years, Occ: Housewife, R/o. QTR No.B3, Telecom quarters I.S. Sadan, Shantosh Nagar, Hyderabad - 500039.

Please take notice that the above named plaintiff has filed a Suit for partition And Separate Possession in respect of suit schedule property i.e. Sy.No. 658/ AA, Admeasuring Ac:4-05 Gts, Sy.No. 660/E Admeasuring Ac: 1-20 Gts total admeasuring Ac: 5-25 Gts situated at Mankal Village, Maheshwaram Mandal, Ranga reddy District and the above case is posted to 26-03-2024 at 10.30 AM for your appearance before the above said court hence you are hereby directed to be present before the above mentioned court at 10:30 AM on the above said date either personally or through your counsel duly authorized failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
J. BABU
Advocate
Off : Plot No.61, Maheshwaram Village and Mandal Rangareddy District
Cell: 7207757636

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE ::CITY CIVIL COURTS:: AT :HYDERABAD:
OS NO.4986/2023

Between:
State Bank of India, Salarjung Colony Branch, D.No. 9-4-86/54, Salarjung Colony, Kakatiya Nagar, Hyderabad- Telangana- 500 008 Rep. by its Branch Manager Plaintiff
And
Mr. Barthek Surender ....Defendant

To
Mr. Barthek Surender, S/o Late Barthek Narsimha, R/o 20-1-673, Puranapool, Shiva Nagar, Bahadurpura, Hyderabad, Telangana-64

Please take notice that the above named plaintiff instituted the above suit against you for recovery of Rs 3,92,335-00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 01-3-2024 at 10.30 AM. In default of your appearance the suit will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
D.K. Lakshmi Kumari,
Advocate
Flat no.304, Manikanta Paradise Apart. Dwarakanagar, Phase-II Uppal, Hyderabad-39

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE :: CITY CIVIL COURTS:: AT :HYDERABAD:
OS NO. 4396/2021

Between:
State Bank of India(incorporated under State Bank of India Act 1955) having its Head Quarters at Nariman Point Mumbai and One of its Head offices and Zonal Offices at Hyderabad and one of The its Branch at SARB-1 2nd Floor TSRTC Commuter Amenity Centre Bus Terminal Complex Koti, Hyderabad, Telangana Rep. by its Chief Manager ......Plaintiff
And
Narla Madhusudhan Rao and another .....Defendants

To
1. Narla Madhusudhan Rao S/o Late N Laxmi Narayana Rao R/o 45-269, Plot no. 85 Rajanagar Upperguda Road No.4 Anandbagh Moulali, Hyderabad Telangana State - 500047
2. Narla Amulya W/o N Mahdhu sudhan Rao R/o 45 -269, Plot no.85, Rajannagar, Upperguda, Road no.4, Anandbagh Moulali, Hyderabad, Telangana State - 47

Please take notice that the above named plaintiff instituted the above suit against both of you for recovery of Rs.11,88,372-00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 26-03-2023 at 10.30 AM. In default of your appearance the suit will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
D.K. Lakshmi Kumari,
Advocate
Flat no.304, Manikanta Paradise Apart. Dwarakanagar, Phase-II Uppal, Hyderabad, Pin Code- 500 039

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT : SECUNDERABAD
O. S. No. 89 of 2024

BETWEEN:
1. Sri. MaddikuntaVenugopal& Ors ... Plaintiffs
AND
1. The Thasildar/Mandal Revenue Officer, Tirumalagiri Mandal, Bowenpally, Secunderabad.
2. To all concerns ...Defendants

PUBLIC NOTICE

To ALL CONCERNED:

The general public is here by informed that Sri.Maddikunta Venugopal & Ors have filed the above suit against the defendant's, seeking relief of declaration as legal heirs of deceased,Late Sri Maddikunta Manik Prabhu. If any person or persons has/have got any objection in this regard, they may appear before Hon'ble Court of XI Junior Civil Judge, City Civil Court, Secunderabad, on 14-03-2024, as the case is posted to that date, either in person or through counsel along with relevant documents/documentary evidence. Failing which the matter will be decided by the Hon'ble Court on merits, there after no claims will be entertained.

//BY ORDER OF HON'BLE COURT//
MANDAPATI MURALI KRISHNA
ADVOCATE
7702207070.

IN THE COURT OF HON'BLE PRL JUNIOR CIVIL JUDGE, R.R DISTRICT AT: HAYATHNAGAR
O.S No. 312 of 2023

BETWEEN:
Sri Gudapati Lakshmi Narayana, S/o. Vishnu Vardhan Rao, Aged about 48 years, Oc: Advocate,R/o. H.No.5-15/2, Prasadampadu,Vijayawada Rural, N.T.R.Dist. Andhra Pradesh. ....Plaintiff
AND
Smt.C.Anuradha,W/o. C.Sudhakar, Aged about 46 years,Occ: House wife,R/o. H.No.8-5-210/13/503, Mallikarjuna Colony,Road No.7, Old Bowenpally,Balanagar Mandal, Medchal Malkajgiri Dist. T.S.- .....Defendant

NOTICE TO DEFENDANT

It is hereby informed to the Defendant, Plaintiff had filed suit for cancellation of registered general power of attorney vide Doc 12/BKIV/2012 on dated 15.02.2012 registered in the SRO Pedda amberpet , R.R District and declaring the same as null and void against the defendant on the file of Addl junior civil judge ,R.R District , at Hayathnagar with the suit scheduled property.

SUIT SCHEDULE OF PROPERTY

All that the open land bearing No. Plot No. 14, admeasuring an area of 202Sq.yards or 168.88 Sq.Mtrs., in Survey No.690, Situated at Koheda Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy Distiret, T.S,. and bounded by:-
NORTH: Plot No.15
SOUTH: Plot No. 13
EAST: Plot No.25
WEST: 33'Wide Road

The Hon'ble had directed to file paper publication in Nava Telanagana daily newspapers. If any Defendant or any persons in the above matter are hereby informed that, they would appear in the court at 10.30 A.M on 18/03/2024 in the above court either through counsel or party-in-person, otherwise the Hon'ble court will decide the case on merits.

(BY ORDER OF THE COURT)
P.BOSU BABU,
P.Shiva Kumar K.Pranank,
Advocates,
Office : Plot No.16, High Court Colony,Vanasthalipuram, Hyderabad,Mobile No.9948151860

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం భారీగా నిధులను విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం గ్రీన్‌హిల్స్ కాలనీ కల్వర్టు దగ్గర సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

ప్రజలు ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలందరూ ఇంటి పన్నును సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మున్సిపల్ సిబ్బంది పలు కాలనీలలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు ఎటువంటి బకాయిలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ రవీందర్‌రెడ్డి, వాటర్‌మెన్ పరుశురాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

హౌసింగ్ బోర్డ్ చారిటబుల్ ట్రస్ట్‌లో శిక్షణ పొందిన 50 మంది మహిళలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌లు ఉచితంగా కుట్టుమిషన్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పిస్తున్న ట్రస్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పేదలకు విద్య వైద్యం కోసం తన తరపున సహాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ ఇన్‌చార్జి బద్రుద్దీన్, సంస్థ ఆర్గనైజేషన్ సభ్యులు అప్సర్, రహీమాన్, గౌస్ తదితరులున్నారు.

విఠల్ సిద్ధాంతి ప్రథమ వర్ధంతికి హాజరైన బండారి



నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తండ్రి విఠల్ సిద్ధాంతి ప్రథమ వర్ధంతికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. వర్ధంతి సభను వలిగొండ గ్రామంలోని వారి నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుటుంబ సభ్యులు శ్రీనివాస్, మహాలక్ష్మి, రవీంద్ర, రమ్య, నర్మద, దశరథ, సాయిజెన్ శేఖర్ తదితరులున్నారు.

సీసీ కెమెరాలును ప్రారంభించిన ఎమ్మెల్యే



చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలోని ప్రధాన రోడ్లల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ కెమెరాలు దాత మంత్రి లక్ష్మణ్, కాలనీ అధ్యక్షులు బండి నర్సింగ్ ముదిరాజ్, జనరల్ సెక్రెటరీ ఆర్. అప్పారావు, డైరెక్టర్ తిరుపతి యాదవ్, విజయ్ భాస్కర్, జాయింట్ సెక్రెటరీ విష్ణు సాయి ప్రసాద్, సాయికుమార్ గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, కుషాయిగూడ ఎస్ఐ ఉపేందర్ యాదవ్, కాలనీవాసులు రామ్ బ్రహ్మం, లక్ష్మీకాంతయ్య, శ్రీశైలం, నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోపాల్ యాదవ్, సయ్యద్ సాధిక్, యాదగిరి, వెంకటేష్ కర్ణాకర్, సాయి, వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు డప్పు గిరిబాబు, జనరల్ సెక్రెటరీ సారా అనిల్, శ్రీకాంత్ రెడ్డి, తాళ్ల వెంకటేష్ గౌడ్, సాయికిరణ్ గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో ఏవీఇన్ఫో ప్రైడ్ సిటిజన్స్ వార్షిక సమావేశం : పాల్గొన్న మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏవీ ఇన్ఫో ప్రైడ్‌లో సీనియర్ సిటిజన్స్ వార్షిక సాధారణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర పరిధిలో వృద్ధుల కోసం "డే కేర్ సెంటర్" లైబ్రరీ, పఠన సౌకర్యాలు, క్యారమ్స్, చెస్, మొదలైన ఇండోర్ ఆటలతో సేదతీరడానికి అవసరమైన సౌకర్యాల కల్పించాలని అసోసియేషన్ సభ్యులు మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సెంటర్ ఏర్పాటు చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి మొమెంటో, సర్టిఫికెట్స్ అందజేశారు.

చదువుతో పాటు ఆటలూ అవసరమే..



- క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవంలో మేయర్ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

నేటి తరానికి చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. కాచవాని సింగారంలో ఏర్పాటు చేసిన "వీ.ఏ.వీ ప్రసాద్ క్రికెట్ అకాడమీ" ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔత్సాహిక క్రీడాకారులకు క్రికెట్‌లో, జీవితంలో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ అందించాలని సూచించారు. నెట్ ప్రాక్టీస్‌కు ప్రారంభించిన అకాడమీ వర్ధమాన క్రీడాకారులకు ఎంతో తోడ్పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి, బండి సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

'హెల్త్ ఆన్ అస్'తో కొత్త యుగం

- ఇంటి వద్దకే ఆరోగ్య సేవలందించే వినూత్న యాప్
- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- ఘనంగా 'హెల్త్ ఆన్ అస్' మొబైల్



నవతెలంగాణ-సిటీబ్యూరో

'హెల్త్ ఆన్ అస్' మొబైల్ యాప్ ఆరోగ్య సంరక్షణలో ఒక కొత్త యుగం ప్రారంభించనుందని సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు.ఆదివారం నగరంలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో ఆధునిక యుగంలో ఆరోగ్య సేవల అందుబాటును మరింత సులభం చేసే కొత్త మొబైల్ యాప్ 'హెల్త్ ఆన్ అస్'ను పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. 'హెల్త్ ఆన్ అస్' సంస్థ చైర్మెన్ లింగమనేని రమేశ్, మేనేజింగ్ డైరెక్టర్ డి.జె.భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలు, వైద్య చికిత్సానంతర సేవలను ఇంటి వద్దకే అందించే ఈ సరికొత్త మొబైల్ యాప్ వల్ల ఎంతో మందికి లాభం చేకూరుతుందన్నారు. ఈ యాప్‌ను వాడుకునే వారికి సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా ఈ యాప్ ఎంతోమంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెప్పారు. మందుల డెలివరీ నుంచి మొదలుకుని థెరపీ సెషన్‌లు, నర్సింగ్ కేర్ వరకు ఈ మొబైల్ యాప్ సేవలుండటం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించే దిశగా ఈ యాప్ ఓ చక్కటి ఉద్యమం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మెన్, ఎండీతోపాటు సంస్థ ఉద్యోగులను పవన్ కల్యాణ్ అభినందించారు. లింగమనేని రమేష్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించే ఈ యాప్ ఎంతో శ్రమ, లోతైన పరిశోధనల ఫలితమనీ, ఇది ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి ఓ రక్షణ కవచమని పేర్కొన్నారు. ఈ యాప్ ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణంలో కీలక పాత్ర పోషించనుందని, అందుకే దీనికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. డి.జె. భరత్‌రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ ఆస్పత్రుల సేవలను మించి ఉన్నతమైన ఆరోగ్య సంరక్షణ సేవలను ఇంటి వద్దకే అందించడం దీని ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో 'హెల్త్ ఆన్ అస్' సంస్థ ఉద్యోగులు, అన్ని విభాగాల అధిపతులు, యాప్ నిర్మాణ పరిశోధక బృందం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



- కో ఆప్షన్ సభ్యులు ఫరూక్
- ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించినట్లు జవహర్ నగర్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫరూక్ తెలిపారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మల్కారంలో ఆదివారం నిర్వహించిన గార్మి షరీఫ్ ఉత్సవాలను మహ్మద్ నూరుద్దీన్ ఫరూక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అబ్బు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మంచినీటిని అందుబాటులోకి తెస్తాం



- కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్
- మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలందరికీ మంచినీటిని అందుబాటులోకి తీసుకువస్తామని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీల్లో కార్పొరేటర్ కారింగుల నిహారిక, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ మంచినీటి నల్లా కనెక్షన్ల పనులను వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లారెడ్డి గారడి మాటలతో జవహర్ నగర్ ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. గతంలో జవహర్ నగర్‌ను కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిందని, ఇప్పుడు సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లు కైవసం చేసుకుంటుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, మరో రెండు పథకాలు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కాలనీ వ్యవస్థాపకులు మాడుగుల స్వామి, విజయ్ కుమార్, నాయకులు దయాకర్‌చారి, చెన్నారెడ్డి, ఈగ శ్వేతారాజు ముదిరాజ్, ఈగ రాజు, చంద్రశేఖర్, స్వామి, ఏకాచారి, తదితరులున్నారు.

వ్యాపారంలో నాణ్యత పాటించాలి



- కాంగ్రెస్ నాయకులు బల్లి శ్రీనివాస్
- ఎస్.వీ.ఎన్. ఫుట్‌వేర్ ఓపెనింగ్

నవతెలంగాణ-జవహర్‌నగర్

వ్యాపార రంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, కష్టమర్ల ఆధారాభిమానాలు చూరగోనాలని కాంగ్రెస్ నాయకులు బల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారిలో ఎస్.వీ.ఎన్ ఫుట్‌వేర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధితోనే అనేక కుటుంబాలు అభివృద్ధిలో పయనిస్తున్నాయని, పోటీ సమాజంలో ఒడిదుడుకులను అధిగమించి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌వేర్ యజమాని కొంపల్లి వెంకట నరసయ్య, కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి సదానందం, తూరుగొండ రామన్న, దొంతగాని కోటేష్, గౌడ్, మారగాని వెంకటేష్ గౌడ్, చేపూరి యాకన్న, పల్లపురవి, ఆనంద్, దాస్, ప్రకాష్, అరకల అనీల్ కుమార్, మంద ఆనంద్, మూల సోమయ్య గౌడ్, వెంకటేష్ గౌడ్, కరాటే రాజు, కరిగల్ల రాజు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మేడ్చల్ సీఐని సన్మానించిన కాంగ్రెస్ నేత ఆర్.మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అద్దాని సత్యనారాయణను మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎల్.డీ.ఎం ఇన్‌చార్జి, డాక్టర్ ఆర్. మల్లారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్.మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు. కలిసిన వారిలో నాగేశ్వర్ రావు ఉన్నారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను 'హస్త'గతం చేసుకుంటాం



- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- డిప్యూటీ మేయర్‌తో సహా 17 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకొని, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలు అన్నారు. ఇటీవల జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుత మేయర్ మీద అసంతృప్తితో క్యాంపు రాజకీయాలు నడిపిన డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ వర్గం అవిశ్వాసంలో నెగ్గింది. ఈ ప్రక్రియ అంతా కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లోనే జరిగింది. అందరూ అనుకున్న విధంగానే ఆదివారం జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ తన వర్గానికి చెందిన 16 మంది కార్పొరేటర్లతో కలిసి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, మలిపెద్ది సుధీర్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందన్నారు. కార్పొరేటర్ల చేరికతో పార్టీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మరింత బలోపేతం అవుతుందన్నారు. జవహర్ నగర్ ప్రజానీకానికి సుపరిపాలన అందించే విధంగా తామంతా కృషి చేస్తామని అన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లిన శివ స్వాములు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామం నుంచి శివ స్వాములు ఆదివారం శ్రీశైలం వరకు పాదయాత్రతో బయలుదేరారు. గురుస్వాములు మామిండ్ల వెంకటేష్, ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 21 మంది శివ మాల వేశారు. అంతకుముందు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, గడీల నాగరాజు, సుక్క రాజు, ఆకుల రవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టిన మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం ఆదివారంతో 91వ వారానికి చేరింది. ఈ సందర్భంగా జ్ఞానమాల టీం సభ్యులు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేఆర్ కాలనీ అధ్యక్షులు రహీం, జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మా చారి, దయానంద్, నాగేష్, మెకానిక్ కొండల్, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీల మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బకోటి ఆంజనేయులు



నవతెలంగాణ-మేడ్చల్

మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న బీసీల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బకోటి ఆంజనేయులు అన్నారు. బీసీ మహా పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ బీసీ మహాసభ, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించినున్నట్లు తెలిపారు. ఈ యాత్ర పండుగ సాయన్న జన్మస్థలమైన మిర్గాన్ పల్లె నుంచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మస్థలమైన కిలాషాపూర్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల రామ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీచీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో గంగా భ్రమరాంభికా, మల్లికార్జునుడి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



నవతెలంగాణ-కీసర

చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ చీర్యాల గంగా భ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నేటి నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్, ధర్మకర్త శ్రీహరి గౌడ్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చీర్యాల గంగా భ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి, గణపతి, నవగ్రహ, శిఖర పాంచాహ్నిక విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఉంటుందన్నారు. 26వ తేదీ సోమవారం ఉదయం మంగళవాయిద్యం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం పంచగవ్యం, యంత్రమార్జనలు, యాగశాల ప్రవేశం, త్రిశూలపూజ, తీర్థప్రసాదాలు ఉంటాయని తెలిపారు. సాయంకాలం మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. 27వ తేదీ మంగళవారం ఉదయం గవ్యాంత పూజలు, వాస్తుపూజ, పర్యగ్నికరణం, జలాధివాసం, ప్రధాన దేవతా హోమాలు, నీరాజన తీర్థప్రసాదాలు, సాయంకాలం మండపార్చన, అవాహిత దేవతా హోమాలు, వాస్తుహోమం, రుద్రార్చన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాదాలు ఉంటాయని తెలిపారు. 28వ తేదీ బుధవారం ఉదయం గవ్యాంత పూజలు, చండీ పారాయణం, చండీ హోమం, విశేష రుద్రహోమం, అవాహిత దేవతా మూల మంత్ర హోమాలు, ధాన్యదివాసం, సాయంకాలం ఉదకశాంతి, దిశహోమాలు, శాంతి హోమాలు, జప తర్పణాలు, తీర్థప్రసాదాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29వ తేదీ గురువారం ఉదయం గవ్యాంతపూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, గ్రామప్రదక్షిణ, వాస్తు బలి, నవగ్రహ హోమాలు, మూలమంత్ర హోమాలు, తీర్థప్రసాదాలు, సాయంకాలం శాలార్చన, మండపదేవత అర్చన, జపహోమాలు, శాలాంగ దేవత హోమాలు, పంచశయాదివాసం, చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం, తీర్థప్రదాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మార్చి ఒకటవ తేదీ శుక్రవారం ఉదయం గవ్యాంతపూజలు, గర్తన్యాసం, విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, త్రిశూల స్నానం, పార్వతీ పరమేశ్వర శాంతి కల్యాణం, ఆశీర్వచనం, పండిత సన్మానం, తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించబడునని తెలిపారు. సమావేశంలో మల్లారపు హరి గౌడ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ మానవి
www.navatelangana.com
హైదరాబాద్
సోమవారం
26 ఫిబ్రవరి 2024



స్కైరూట్ ఆమెకు సులభం

అన్ని రంగాల్లో దూసుకుపోయేందుకు మహిళలు నిత్యం తపిస్తున్నారు. కానీ అనేక రకాల వివక్షలు వారిని నిలువరిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆర్థిక సమస్యలు మహిళల కోర్కెలను అణచివేస్తున్నాయి. అంతరిక్షంలో ఇంజనీర్లుగా కెరీర్‌ను అత్యున్నతంగా ఊహించుకునే సాధారణ మహిళలు తమ కలలను నిజం చేసుకోవడం అంత సులభం కాదు. అటువంటి మహిళలకు ఓ మంచి అవకాశం కల్పించింది స్పేస్‌టెక్ కంపెని. స్కైరూట్ ఏరోస్పేస్ అంతరిక్ష రంగంలో మహిళల కోసం ప్రముఖ వ్యోమగామి కల్పనా చావ్లా పేరుతో కల్పనా ఫెలోషిప్‌ను ఇటీవలె ప్రారంభించింది. ఈ ఫెలోషిప్ రాబోయే మహిళా ఇంజనీర్‌లను అంతరిక్ష రంగంలో తమ పరిధులను విస్తరించేందుకు ప్రోత్సహించడం, సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఇది మహిళా ఇంజనీర్లకు అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ ప్రాజెక్ట్‌లతో కలిసి పనిచేయడానికి, స్కైరూట్‌లో కెరీర్ అవకాశాలు పొంది వృత్తిలో ముందుకు సాగడానికి ఒక మార్గాన్ని అందిస్తుంది. ఈ రంగంలో తమ సత్తా చాటుకోవాలని తపించే మహిళలకు సృజనాత్మకత, ఆవిష్కరణలు, నాయకత్వ మార్గాలను పెంపొందించడం ఈ ఫెలోషిప్ లక్ష్యం అని ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది నెలవారీ అందించే స్టైపెండ్, నాణ్యమైన శిక్షణ, అనుభవజ్ఞులైన నిపుణుల నుండి మార్గదర్శకత్వం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందిపుచ్చుకోవడంతో పాటు స్కైరూట్ ఏరోస్పేస్‌లో వినూత్న సాంకేతికతలను అందిస్తుంది.

మహిళలు అగ్రభాగంలో ఉంటారు

'అంతరిక్ష రంగంలో మనకు ఎక్కువ మంది మహిళలు అవసరం. కొత్త ఆవిష్కరణలు చేయడంలో, సృజనాత్మకంగా ఆలోచించడంలో మహిళలు అగ్రభాగంలో ఉంటారు. అందువల్ల మహిళా ఇంజనీర్లకు అత్యాధునిక అంతరిక్ష ప్రాజెక్టులలో పని చేయడానికి, అగ్రశ్రేణి నిపుణుల నుండి మార్గదర్శకత్వం పొందేందుకు, స్కైరూట్‌లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను పొందేందుకు ఉత్తేజకరమైన అవకాశాలను అందించడానికి మేము కల్పనా ఫెలోషిప్‌ను రూపొందించాం' అని సహ వ్యవస్థాపకులు, సీఈఓ అయిన చందన అంటున్నారు.



ఎంపిక మూడు దశల్లో...

స్కైరూట్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఒక ఏడాది పాటు నెలవారీ భత్యం అందించబడుతుంది. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల నుండి చివరి ఏడాది విద్యార్థులు, ఇటీవల గ్రాడ్యుయేట్లు ఈ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. 2024 ఫెలోషిప్ నమోదు కోసం ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎంపిక తీరును పరిశీలిస్తే ఇందులో మూడు దశల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఫెలోషిప్ పొందేందుకు, లక్ష్యాలను సాధించడానికి కల్పనా ఫెలోకు అవసరమైన మానసిక, విద్యాపరమైన సామర్థ్యాలను గుర్తించడానికి, అంచనా వేయడానికి ఈ దశలను రూపొందించారు.

ఫెలో పూర్తి చేసిన తర్వాత

అభ్యర్థులు తమ ఫెలోషిప్‌ని పూర్తి చేసిన తర్వాత వారిలో అత్యంత నైపుణ్యం కలిగిన, అర్హులైన వారు కంపెనీలో పూర్తి స్థాయి ఉద్యోగులుగా మారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం స్కైరూట్ ఏరోస్పేస్ అత్యాధునిక అంతరిక్ష ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడానికి అంకితమైన 300 మంది అంతరిక్ష నిపుణుల బృందాన్ని కలిగి ఉంది. భారతదేశంలో మొట్టమొదటి సారి ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించిన ఘనత దీనికి ఉంది. 'హోరిజోన్‌లో ఉత్తేజకరమైన మిషన్‌లు, అత్యున్నత సాంకేతికతలను నిరంతరం ఉపయోగిస్తూ కల్పనా ఫెలోషిప్ ప్రతిభా వంతులైన స్పేస్ ఇంజనీర్ లకు పరివర్తనాత్మక పురోగతికి దోహదపడే అవకాశాలను అందిస్తుంది' అని స్కైరూట్ సహ వ్యవస్థాపకులు, సీఓఓ భరత్ డాకా అన్నారు. 'మేము ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించాం. దీని ద్వారా అర్హులైన అభ్యర్థులు ఫెలోషిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. మా టీమ్‌లు భారతదేశంలోని వివిధ విద్యా సంస్థలకు అవగాహన కల్పించడానికి, అవకాశాన్ని పొందేందుకు అభ్యర్థులు దీన్ని విస్తృతంగా ఉపయోగించుకునేలా ప్రయత్నం చేస్తున్నాం' అన్నారు.



ఇట్లా చేద్దాం

మిక్సీ బ్లేడు పదునుగా ఉండాలంటే మిక్సీ జార్లలో కొద్దిగా ఉప్పు వేసి తిప్పాలి.





జ్ఞాపకశక్తి , శ్రద్ధ, ఏకాగ్రత, పరిష్కార నైపుణ్యాలు... ఇవన్నీ ఇచ్చేది మెదడే. మెదడు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చక్కగా చదవగలుగుతారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో మెదడు చురుగ్గా పని చేస్తేనే వారు అన్నింటా ముందుంటారు. ఇందుకోసం పిల్లల మెదడు ఆరోగ్యం సరిగా ఉండేలా చూసుకోవాలి. దానితో పాటు మానసిక ఆరోగ్యాన్నీ వారికి అందించాలి. అపుడే ముందంజలో ఉంటారు. ఈ బాధ్యత తల్లిదండ్రుల మీదనే ఉంటుంది. మెదడు ఆరోగ్యానికి ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు చాలా అవసరం. కాబట్టి పిల్లల రోజువారీ ఆహారంలో ఇవన్నీ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ప్రతిరోజూ గుప్పెడు డ్రైఫ్రూట్లను తినిపించడం ద్వారా వారి జ్ఞాపకశక్తిని పెంచవచ్చు. అయితే ఏయే డ్రై ఫ్రూట్స్‌లో ఏమేమి ఉంటాయో తెలుసుకుందాం...

పిల్లల మెదడు చురుగ్గా పని చేయాలంటే...



జీడిపప్పు

డ్రై ఫ్రూట్స్‌లలో జీడిపప్పు ఒకటి. మెదడుకు మేలు చేసే విలువైన పోషకాలు దీనిలో ఉంటాయి. ముఖ్యంగా జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే మెగ్నీషియం జీడిపప్పుల్లో అధికంగా ఉంటుంది. రోజూ నాలుగు జీడిపప్పు పలుకులు పిల్లల చేత తినిపిస్తుంటే మానసిక ఆరోగ్యం సానుకూలంగా ఉంటుంది. నెగటివ్ థింకింగ్ తగ్గుతుంది.

పిస్తా



పిస్తా పప్పులు చూస్తేనే నోరూరి పోతుంటాయి. ఇవి మెదడు ఆరోగ్యాన్ని పెంచే పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ బి6, యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. విటమిన్ బి6 న్యూరో ట్రాన్స్‌మీటర్ల ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తుంది. కాబట్టి విటమిన్ బి6 కోసం పిస్తాలను కచ్చితంగా తినాలి. మెదడు కణాల మధ్య కమ్యూనికేషన్ మెరుగు పరిచేందుకు పిస్తాలు ఉపయోగపడతాయి.

ఎండుద్రాక్ష



ఎండు ద్రాక్షలు సహజంగానే తియ్యగా ఉంటాయి. వీటిని తినిపించడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. వీటిలో ఐరన్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రక్త ప్రవాహం సరిగా జరిగేలా చూస్తాయి. మెదడుకు తగినంత ఆక్సిజన్ సరఫరా అయ్యేలా జాగ్రత్త పడతాయి. కాబట్టి మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి.

అక్రోట్లు



వీటిని వాల్‌నట్లు అని కూడా పిలుస్తారు. వీటిలో ఆల్ఫా లినోలినిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యానికి చాలా అవసరం. నాడీ మార్గాల అభివృద్ధిని ఇది ప్రోత్సహిస్తుంది. కాబట్టి ప్రతిరోజూ పిల్లలకు నీటిలో నానబెట్టిన వాల్‌నట్స్ ఇస్తుంటే, వారి జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

బాదంపప్పు



బాదం పప్పులను తరచూ పిల్లలు చేత తినిపిస్తే వారికి విటమిన్ కె, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయి. రాత్రిపూట బాదంపప్పును నానబెట్టి ఉదయాన పొట్టు తీసేసి తినేలా చూడాలి. ఇది మెదడు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తుంది. దీని వల్ల మెదడు ఆరోగ్యం మెరుగవుతుంది.

ఎండు ఖర్జూరాలు



ఖర్జూరాలలో సహజంగానే చక్కెర అధికంగా ఉంటుంది. అలాగే ఫైబర్ ఉంటుంది. మెదడు పనితీరుకు అవసరమైన ఎన్నో పోషకాలు దీనిలో ఉంటాయి. ఖర్జూరాలు తినడం వల్ల శక్తి త్వరగా అందుతుంది. ఫైబర్ కూడా శరీరంలో స్థిరంగా విడుదలవుతూ ఉంటుంది. మెదడును అప్రమత్తంగా ఉంచడంలో ఖర్జూరాలు ముందుంటాయి. ఇవి మెదడును ఆక్సీకరణ ఒత్తిడి నుండి కాపాడతాయి.

పార్లమెంటులో ప్రశ్నించాలంటే..

గులాబీ జెండా ఎగరాలి

(మొదటిపేజి తరువాయి)

రేవంత్ రెడ్డిని ప్రకటించి ఉంటే... కచ్చితంగా నూటికి నూరుపాళ్ళు కాంగ్రెస్ ఓటమి చెందేదని గుర్తు చేశారు. సాధ్యం కానీ గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చారన్నారు. ఇప్పుడు ఆ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కుటుంబంలో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చెల్లిస్తామని చెప్పారని, దీనికోసం రాష్ట్రంలో 1.65 కోట్ల మంది మహిళలు ఎదురుచూస్తున్నారని అన్నారు. అలాగే, రూ.500కే సిలిండర్ కోసం 1.24కోట్ల మంది, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1.34 కోట్ల మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఈ పథకాలు అమలు చేయడానికి అనేక కొర్రీలు పెడుతూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మిషన్ భగీరథ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీజేపీ జాతీయహోదా ఇవ్వలేదన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ పార్టీకి పట్టంకట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. ఓడిపోయినా ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యల పైన పోరాటాలు చేస్తూనే ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు తీసుకొస్తే దాన్ని రద్దు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్టడీలో లైంగిక దాడులు

(మొదటిపేజి తరువాయి)

కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. పోలీసు సిబ్బంది, ప్రభుత్వోద్యోగులు, సాయుధ దళాల సభ్యులు, కారాగారాల సిబ్బంది ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారని ఎన్‌సీఆర్‌బీ వివరించింది.

రిమాండ్, కస్టడీలో ఉన్నప్పుడు, ఆస్పత్రులలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఈ తరహా నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతోందని ఎన్‌సీఆర్‌బీ అంటోంది. 2017లో 89 కేసులు, 2018లో 60, 2019లో 47, 2020లో 29, 2021లో 26 2022లో 24 కేసులు నమోదయ్యాయని వివరించింది. కస్టడీలో ఉన్న మహిళపై లైంగిక దాడికి పాల్పడితే ఐపీసీలోని 376 (2) కింద కేసు నమోదు చేస్తారు. మహిళలు చట్టబద్ధంగా కస్టడీలో ఉన్నప్పుడు పోలీస్ అధికారి, జైలర్ లేదా ఎవరైనా వ్యక్తి లైంగిక దాడి జరిపితే ఈ సెక్షన్ కింద కేసు నమోదవుతుంది. ఆయా వ్యక్తులు తమకున్న అధికారాన్ని అవకాశంగా తీసుకొని ఇలాంటి అకృత్యానికి పాల్పడితే వారిపై ఈ సెక్షన్‌ను ప్రయోగిస్తారు.

2017 నుండి కస్టడీలో జరిగిన 275 లైంగిక దాడి కేసుల్లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 92 కేసులు నమోదయ్యాయి. 43 కేసులతో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. కస్టడీలో ఉన్న మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం దుండగులకు ఉంటుందని పాప్యులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా చెప్పారు. బలహీనులైన మహిళలను రక్షించడానికి వారిని కొన్ని సందర్భాలలో కస్టడీలోకి తీసుకుంటారని, అయితే కొందరు వ్యక్తులు అధికార దుర్వినియోగానికి పాల్పడి వారిపై లైంగిక హింసకు తెగబడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులకు రక్షణ కల్పించేందుకు చట్ట నిబంధనల్ని బలోపేతం చేయాలని, సంస్థాగత సంస్కరణలు చేపట్టాలని సూచించారు.

విచారణకు ఇప్పట్లో హాజరు కాలేను

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముందే నిర్ణయించిన కార్యక్రమాలున్నందున సీబీఐ విచారణకు ఇప్పట్లో హాజరు కాలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. లిక్కర్ కేసులో విచారణకు ఈ నెల 26న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయాలనికి రావాలని ఇచ్చిన నోటీసులకు స్పందిస్తూ ఆదివారం రాసిన లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద జారీ చేసిన నోటీసులను రద్దు చేయడం లేదా ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.. కేసులో ఏవైనా ప్రశ్నలకు సమాధానం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో హాజరవ్వడానికి అందుబాటులో ఉంటానని తెలిపారు. 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదనీ, 2022 డిసెంబరులో అప్పటి విచారణాధికారి ఇదే తరహా నోటీసును సెక్షన్ 160 కింద ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో జారీ చేసిన నోటీసుకు ప్రస్తుత నోటీసు పూర్తి విరుద్ధంగా ఉందని అభ్యంతరం చెప్పారు.

41ఏ కింద ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదనీ, నోటీసు జారీ చేసిన సందర్భం కూడా ఆలోచింపజేస్తున్నదని లేఖలో వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటీసులు జారీ చేయడం అనేక ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. ఈ సమయంలో విచారణ పేరిట ఢిల్లీకి పిలవడం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అవరోధం కలిగించనుందనీ, ఇది ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందని తెలిపారు.

నన్ను విచారణకు పిలవబోమని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారని ప్రస్తావించారు. సుప్రీం కోర్టులో ప్రభుత్వం ఇచ్చిన హామీ సీబీఐకి కూడా వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. గతంలోనూ సీబీఐ బందం హైదరాబాద్‌లోని నా నివాసానికి వచ్చినప్పుడు విచారణకు సహకరించాననీ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే దేశ పౌరురాలిగా సీబీఐ దర్యాప్తునకు ఎప్పుడైనా తప్పకుండా సహకరిస్తానని కవిత పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు తీగల కుటుంబం గుడ్‌బై

(మొదటిపేజి తరువాయి)

జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పదేండ్ల క్రితం జిల్లా పరిషత్తు గ్రామపంచాయతీల్లో పుష్కలంగా నిధులు ఉండేవని, అభివృద్ధి పనులు జరిగేవని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిధులు కేటాయించకుండా అభివృద్ధి నిరోధకంగా పరిపాలన చేసిందని విమర్శించారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్‌పర్సన్ నిధులు లేక గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఎదురైందన్నారు. ఇది కేవలం ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎమ్మెల్యేలకే ప్రాధాన్యతనిస్తూ పరిపాలన కొనసాగించారని తెలిపారు. అందుకే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు.

తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి అనేక పదవుల్లో ఎమ్మెల్యేగా, హైదరాబాద్ మేయర్‌గా, హుడా చైర్మెన్‌గా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి తనకి ప్రాధాన్యత ఇవ్వకపోయినా పార్టీ కోసం పనిచేశానని చెప్పారు. ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు కట్టబెట్టి సొంత పార్టీ నాయకులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈనెల 27న చేవెళ్లలో జరగబోయే బహిరంగ సభలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో, కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకా గాంధీ సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె పాండుగౌడ్, సిద్దల బాలప్ప, బేర బాలకృష్ణ, ఆకుల అరవింద్ కుమార్, రాకేష్ రెడ్డి, చప్పిడి సంతోష్ రెడ్డి, నాగేందర్ గౌడ్, తదితర నాయకులు ఉన్నారు.



రాహుల్ యాత్రకు అఖిలేశ్ మద్దతు

(మొదటిపేజి తరువాయి)

ఘన స్వాగతం పలికారు. యాత్రలో పాల్గొని మద్దతు తెలియజేశారు. తొలుత రాహుల్, అఖిలేశ్, కాంగ్రెస్ మరో నేత ప్రియాంక గాంధీ రాజ్యాంగ రచయిత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ఆ తర్వాత రాహుల్, అఖిలేశ్, ప్రియాంక ముగ్గురూ జోడో యాత్రలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. యాత్ర అసాంతం ఉల్లాసంగా, ఉత్తేశంగా సాగింది. రాహుల్, అఖిలేశ్ సెల్ఫీ తీసుకుంటున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ బీజేపీ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. సామాజిక మాధ్యమాల్లోనూ బిజెపిపై తనదీతిలో విమర్శలు గుప్పిస్తూ అఖిలేశ్ యాదవ్‌తో ఉన్న ఫొటోలను రాహుల్ పోస్టు చేశారు. 'మార్పు పవనాలు వీస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ మార్పునకు సిద్ధమైంది' అని రాహుల్ పేర్కొన్నారు. అఖిలేశ్ కూడా సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగరీతిలో స్పందించారు. 'స్నేహపూర్వక రథం ప్రేమతో నిండిన సామ్రాజ్యాన్ని చేరుకున్న సమయంలో విద్వేష రాజకీయాలు సమాధి కావాల్సిందే' అని ఆయన పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని పక్షాల లక్ష్యం ఒకటేనని, ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ఆ లక్ష్యమని అఖిలేశ్ అన్నారు. ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా ఫోరం' ప్రధాన కర్తవ్యం బీజేపీని ఓడించడం, అంబేద్కర్ కలలను సాకారం చేయడం అని పేర్కొన్నారు.

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యుపిలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు కుదిరిన నేపథ్యంలో రాహుల్ యాత్రలో అఖిలేశ్ భాగం కావడం విశేషం. యుపిలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 17 స్థానాల్లోనూ, 63 స్థానాల్లో సమాజ్‌వాదీ, 'ఇండియా ఫోరం'లోని ఇతర పార్టీలు పోటీ చేయనున్నాయి. ఆగ్రాలో ప్రవేశించడానికి ముందు, రాహుల్ నేతృత్వంలోని జోడో న్యాయ్ యాత్ర అలీగఢ్ డివిజన్ నుండి అమ్రోహా, సంభాల్, బులంద్‌షహర్, అలీగఢ్, హత్రాస్ మీదుగా సాగింది. ఈ ఏడాది జనవరి 14న మణిపూర్‌లో ప్రారంభమైన రాహుల్ యాత్ర వచ్చే మార్చి 20న ముంబయిలో ముగియనుంది.



లోకో పైలట్ లేకుండానే..

(మొదటిపేజి తరువాయి)

పట్టాలు వాలుగా ఉండటంతో ఆ గూడ్స్ రైలు ముందుకు కదిలింది. కంకర, రైలు సామగ్రి వంటివి ఉన్న ఆ గూడ్స్ రైలు సుమారు వంద కిలోమీటర్ల వేగం అందుకుంది. జమ్ముకాశ్మీర్‌లోని కథువా, పంజాబ్‌లోని పఠాన్‌కోట్ మార్గంలోని ఐదు స్టేషన్ల మీదుగా అది ప్రయాణించింది.


దిగొచ్చిన యోగి సర్కారు

(మొదటిపేజి తరువాయి)

నియామక పరీక్ష జరిగింది. 60,244 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 48 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 75 జిల్లాల్లోని 2370 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. అయితే, ప్రశ్నపత్రం లీకైందనీ వందలాది మంది అభ్యర్థులు శుక్రవారం రాష్ట్ర రాజధాని లక్నోలో నిరసన ప్రదర్శలనకు దిగారు. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని యోగి సర్కారును డిమాండ్ చేశారు. ఎట్టకేలకు అభ్యర్థుల నిరసనలకు దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలల్లో మళ్లీ పరీక్షను నిర్వహిస్తామని స్పష్టం చేసింది. కాగా, పరీక్షా ప్రశ్నపత్రం లీకేజీ కేసు రాజకీయంగానూ తీవ్ర దుమారం రేపింది. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, యూపీలో ప్రధాన ప్రతిపక్షం ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌లు స్పందించారు. పరీక్ష రద్దు అనేది విద్యార్థులు, యువత ఐక్యతకు పెద్ద విజయమని రాహుల్ ఎక్స్ వేదికగా అభివర్ణించారు. ఉద్యోగ ఖాళీలు ప్రకటనలు కేవలం చూపించుకోవటానికేననీ, ఫీజుల రూపంలో అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి, పేపర్‌లు లీకయ్యేలా చేసి, వాటిని రద్దు చేసే నాటకం బీజేపీ చేస్తుందని అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు.

ఈ సారి 3, 6 తరగతులకే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు

- ఎంఓఈ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ : 2024-25 పాఠశాల విద్యా సంవత్సరానికి సంబంధించిన కొత్త నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్యపుస్తకాలు 3, 6 తరగతులకు మాత్రమే ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తున్నది. విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఓఈ) వర్గాల నుంచి ఈ సమాచారం అందింది. నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్), నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ఆధారంగా 1 మరియు 2వ తరగతికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటికే విడుదలయ్యాయి. పుస్తక దుకాణాలు, ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో పీడీఎఫ్ రూపంలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. గత సంవత్సరం ప్రారంభించిన కొత్త ఎన్‌సీఎఫ్‌కి అనుగుణంగా 1 నుంచి 12వ తరగతి వరకు అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలను రాబోయే విద్యా సంవత్సరంలో ప్రవేశపెడతామని గతేడాది నవంబర్ 10న ఎంఓఈ తెలిపింది. గత సంవత్సరం పాఠ్యపుస్తకాలను రూపొందించే బాధ్యత కలిగిన కరిక్యులర్ ఏరియా గ్రూప్‌లకు.. ఎన్‌సీఈఆర్‌టీ అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల తుది ముసాయిదాను సమర్పించడానికి గడువు ఫిబ్రవరి 10 అని సూచించింది. 3వ తరగతికి సంబంధించిన పాఠ్యపుస్తకాల డ్రాఫ్ట్‌లు అందాయని ఎంఓఈ వర్గాలు చెబుతున్నాయి. 6వ తరగతికి సంబంధించి గణితం, సైన్స్, భాషలు (ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, సంస్కృతం) పాఠ్యపుస్తక ముసాయిదాలు కూడా ఖరారు చేసే ప్రక్రియలో ఉన్నాయి. చరిత్ర, భౌగోళిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం సామాజిక శాస్త్రం ఒక పాఠ్య పుస్తకంలో విలీనం చేయబడే అవకాశం ఉన్నది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

(మొదటిపేజి తరువాయి)

ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. సుక్మా జిల్లాలోని బుర్కలంక అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, డిఆర్‌జి జవాన్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో శనివారం మావోయిస్టు ఒకరు చనిపోయిన సంగతి విదితమే.

గెలుపు వాకిట!

రాంచి టెస్టు టీమ్ ఇండియా గుప్పిట్లోకి వచ్చింది. తొలి రెండు రోజుల ఆటలో కాస్త వెనుకంజ వేసిన ఆతిథ్య భారత్ మూడో రోజు బలంగా పుంజుకుంది. స్పిన్ పిచ్‌పై వికెట్ల మాయజాలంతో ఏకంగా గెలుపు వాకిట నిలిచింది. స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్ (5/51), కుల్దీప్ యాదవ్ (4/22) మాయజాలం చేయగా ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 145 పరుగులకే కుప్పకూలింది. ధ్రువ్ జురెల్ (90) వీరోచిత ఇన్నింగ్స్‌తో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ అసమాన పోరాటం చేసింది. టెయిలెండర్లు తోడుగా విలువైన పరుగులు జోడించిన జురెల్.. తొలి ఇన్నింగ్స్ లోటును 46 పరుగులకు కుదించాడు. 192 పరుగుల ఛేదనలో ఓపెనర్లు రోహిత్ (24), యశస్వి (16) అజేయంగా దంచికొడుతున్నారు. 8 ఓవర్లలోనే 40 పరుగులు పిండుకున్న ఓపెనర్లు భారత్‌ను విజయ తీరాలకు చేర్చే పనిలో ఉన్నారు. స్పిన్నర్ల స్వర్గధామ పిచ్‌పై నేడు మరో 152 పరుగులు చేస్తే టెస్టు సిరీస్ 3-1తో టీమ్ ఇండియా సొంతం కానుంది!.

- విజయానికి 152 పరుగుల దూరంలో భారత్
- ఛేదనలో మెరిసిన రోహిత్ శర్మ, యశస్వి
- స్పిన్నర్లు అశ్విన్, కుల్దీప్ 9 వికెట్ల మాయజాలం
- రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 145 ఆలౌట్
- భారత్, ఇంగ్లాండ్ నాల్గో టెస్టు మూడో రోజు



నవతెలంగాణ-రాంచి: 152 పరుగులు. రాంచి టెస్టులో టీమ్ ఇండియా విజయానికి, ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్ విజయానికి ఆతిథ్య భారత్ చేయాల్సిన పరుగులు. 192 పరుగుల సవాల్‌తో కూడిన ఛేదనలో భారత్ 40/0తో లక్ష్యం దిశగా సాగుతోంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (24 నాటౌట్, 27 బంతుల్లో 4 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (16 నాటౌట్, 21 బంతుల్లో 1 ఫోర్) అజేయంగా ఆడుతున్నారు. భారత బ్యాటర్లు అంచనాలను అందుకుంటే.. రాంచి టెస్టులో టీ విరామం లోపే భారత్ గెలుపు సంబురాలు చేసుకోవచ్చు!. ఇక ధ్రువ్ జురెల్ (90, 149 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అసమాన అర్థ సెంచరీతో మెరువగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్ (28, 131 బంతుల్లో 2 ఫోర్లు), ఆకాశ్ దీప్ (9, 29 బంతుల్లో 1 సిక్స్) జురెల్‌కు మంచి సహకారం అందించారు. జురెల్ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 46 పరుగుల వెనుకంజతో సరిపెట్టుకుంది. స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్ (5/51), కుల్దీప్ యాదవ్ (4/22) మ్యాజిక్‌తో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. ఓపెనర్ జాక్ క్రాలీ (60, 91 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీతో కదం తొక్కినా.. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ స్పిన్ మాయలో పడింది. జానీ బెయిర్‌స్టో (30), బెన్ ఫోక్స్ (17), బెన్ డకెట్ (15) రెండెంకల స్కోరు చేయగలిగారు. 54.5 ఓవర్లలో 145 పరుగులకే ఇంగ్లాండ్ కథ ముగియగా.. ఆ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్ ముందు 192 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది.

మాయ చేశారు : తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల ఆధిక్యం. భారత స్పిన్నర్లపై ఎదురుదాడితో వేగంగా పరుగులు చేసిన రికార్డు. దీంతో సహజంగానే ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు సాధిస్తుందనే అంచనాలు కనిపించాయి. కానీ భారత మాయగాళ్లు ఇంగ్లాండ్ ఆశలను ఆవిరి చేశారు. ఓపెనర్లు జాక్ క్రాలీ (60), బెన్ డకెట్ (15) దూకుడుగా ఇన్నింగ్స్‌ను మొదలెట్టారు. ఇంగ్లాండ్ జోరుకు తొలి బ్రేక్ అశ్విన్ వేశాడు. ఇన్నింగ్స్‌తో ఐదో ఓవర్లో వరుస బంతుల్లో బెన్ డకెట్, ఒలీ పోప్ (0)లను సాగనంపాడు. డకెట్ షార్ట్ లెగ్‌లో సర్ఫరాజ్ చేతికి చిక్కగా.. ఒలీ పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో 19/2తో ఇంగ్లాండ్ వరుస బంతుల్లో ఇద్దరు బ్యాటర్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ శతక హీరో జో రూట్ (11) జతగా జాక్ క్రాలీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. కానీ రూట్ ఈసారి అశ్విన్ వల నుంచి తప్పించుకోలేకపోయాడు. 65/3తో ఇంగ్లాండ్ ఒత్తిడిలో పడినా.. జానీ బెయిర్‌స్టో (30, 42 బంతుల్లో 3 ఫోర్లు), జాక్ క్రాలీ దూకుడుగా ఆడారు. క్రాలీ 96 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో అర్థ సెంచరీ సాధించాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడికి కుల్దీప్ యాదవ్ విడదీశాడు. క్రాలీ కోసం కవర్స్‌ను వదిలేసిన కుల్దీప్ యాదవ్... అతడు ఏ షాట్ ఆడాలో తను నిర్దేశించాడు!. కుల్దీప్ మాయలో పడిన క్రాలీ కవర్స్‌లో షాట్ కోసం ప్రయత్నించి వికెట్‌ను కోల్పోయాడు. ఇక్కడ్నుంచి ఇంగ్లాండ్ పతనం వేగవంతమైంది. 110 పరుగుల వద్ద నాల్గో వికెట్ కోల్పోయిన ఇంగ్లాండ్.. మరో 35 పరుగులకే చివరి ఆరు వికెట్లను చేజార్చుకుంది. బెన్ స్టోక్స్ వికెట్లను సైతం గిరాటేసిన కుల్దీప్ యాదవ్..పర్యాటక జట్టును మరింత కష్టాల్లోకి నెట్టాడు. జానీ బెయిర్ స్టోను జడేజా పెవిలియన్‌కు చేర్చగా.. కుల్దీప్ యాదవ్ ఇన్నింగ్స్ 41వ ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. టామ్ హర్ట్లీ (7), ఒలీ రాబిన్సన్ (0)లను అవుట్ చేసి ఇంగ్లాండ్‌ను ఆలౌట్ దిశగా తీసుకెళ్లాడు. వరుస వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని మొదలెట్టిన అశ్విన్.. ఒకే ఓవర్లో మరోసారి రెండు వికెట్లు కూల్చి లాంఛనం ముగించాడు. బెన్ ఫోక్స్ (17), జేమ్స్ అండర్సన్ (0) వికెట్లతో ఇంగ్లాండ్ కథ ముగిసింది. 53.5 ఓవర్లలో 145 పరుగులకే ఇంగ్లాండ్ చేతులెత్తేసింది. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో ఒకే ఓవర్లో ఏకంగా మూడు సార్లు రెండేసి వికెట్లు కోల్పోయి భారీ మూల్యం చెల్లించుకుంది.

సూపర్ జురెల్ : 177/7. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా దీన స్థితి. స్పెషలిస్ట్ బ్యాటర్లలో ధ్రువ్ జురెల్ మినహా అందరూ పెవిలియన్‌కు చేరారు. ఇక్కడ్నుంచి మరో 30 పరుగులు చేసినా గొప్పే అనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం కోల్పోక తప్పదేమో అనిపించింది. కానీ యువ వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (90) అదరగొట్టాడు.



ఎం.ఎస్ ధోని, రిషబ్ పంత్ తరహాలో టెయిలెండర్లతో కలిసి అసమాన భాగస్వామ్యాలు నిర్మించాడు. కుల్దీప్ యాదవ్‌తో కలిసి 202 బంతుల్లో 76 పరుగులు జోడించిన జురెల్.. ఆకాశ్ దీప్ (9)తో కలిసి 75 బంతుల్లో 40 పరుగులు సాధించాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేయగల్గింది. 96 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అర్థ సెంచరీ సాధించిన జురెల్.. సెంచరీ ముంగిట వికెట్ కోల్పోయాడు. ఓవర్‌నైట్ స్కోరు 219/7తో మూడో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ 30.3 ఓవర్లలో మరో 88 పరుగులు జోడించింది. ఇంగ్లాండ్ స్పిన్నర్లు షోయబ్ బషీర్ (5/119), టామ్ హర్ట్లీ (3/68) మాయ చేయగా.. పేసర్ జేమ్స్ అండర్సన్ (2/48) రాణించాడు.

ఛేదనలో దూకుడు : 192 పరుగుల ఛేదనలో భారత్ దూకుడుగా ఆడుతోంది. బజ్‌బాల్‌కు బజ్‌బాల్‌తోనే బదులు ఇచ్చేందుకు దంచికొడుతుంది. కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగు ఫోర్లు బాదగా.. యశస్వి జైస్వాల్ ఓ బౌండరీ కొట్టాడు. ఓపెనర్ల మెరుపులతో రెండో ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లలోనే భారత్ 40 పరుగులు చేసింది. విజయానికి రోహిత్‌సేన మరో 152 పరుగుల దూరంలోనే నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ క్రీజులో అజేయంగా నిలిచారు.

స్కోరు వివరాలు :

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 353/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 307/10

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (బి) కుల్దీప్ యాదవ్ 60, బెన్ డకెట్ (సి) సర్ఫరాజ్ (బి) అశ్విన్ 15, ఒలీ పోప్ (ఎల్బీ) అశ్విన్ 0, జో రూట్ (ఎల్బీ) అశ్విన్ 11, జానీ బెయిర్‌స్టో (సి) పటీదార్ (బి) జడేజా 30, బెన్ స్టోక్స్ (బి) కుల్దీప్ యాదవ్ 4, బెన్ ఫోక్స్ (సి,బి) అశ్విన్ 17, టామ్ హర్ట్లీ (సి) సర్ఫరాజ్ (బి) కుల్దీప్ యాదవ్ 7, ఒలీ రాబిన్సన్ (ఎల్బీ) కుల్దీప్ యాదవ్ 0, షోయబ్ బషీర్ నాటౌట్ 1, జేమ్స్ అండర్సన్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0, ఎక్స్‌ట్రాలు : 0,

మొత్తం : (53.5 ఓవర్లలో ఆలౌట్) 145.

వికెట్ల పతనం : 1-19, 2-19, 3-65, 4-110, 5-120, 6-120, 7-133, 8-133, 9-145, 10-145.

బౌలింగ్ : రవిచంద్రన్ అశ్విన్ 15.5-0-51-5, రవీంద్ర జడేజా 20-5-56-1, మహ్మద్ సిరాజ్ 3-0-16-0, కుల్దీప్ యాదవ్ 15-2-22-4.

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ బ్యాటింగ్ 24, యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ 16, ఎక్స్‌ట్రాలు : 0, మొత్తం : (8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 40.

బౌలింగ్ : జో రూట్ 4-0-17-0, టామ్ హర్ట్లీ 3-0-22-0, షోయబ్ బషీర్ 1-0-1-0.



టైటిల్ వేట షురూ!

- నేడు రెండు ఎలిమినేటర్ మ్యాచులు
- ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్

హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ తుది అంకానికి చేరుకుంది. టైటిల్ వేటలో చివరకు ఆరు జట్లు నిలువగా.. నేడు రెండు జట్లు నిష్క్రమించనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్, పుణెరి పల్టాన్‌లు లీగ్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. టాప్-6లో నిలిచిన ఇతర నాలుగు జట్లు మరో రెండు సెమీస్ బెర్త్‌ల కోసం నేడు ఎలిమినేటర్ పోరులో తాడోపేడో తేల్చుకోనున్నాయి. ఎలిమినేటర్ 1 మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ, పట్నా పైరేట్స్ తలపడనుండగా.. ఎలిమినేటర్2 మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్‌లు పోటీపడుతున్నాయి. ఎలిమినేటర్‌లో నెగ్గిన జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. హైదరాబాద్‌లోని జిఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్‌కు వేదికగా నిలువనుంది. నేడు రాత్రి 8 గంటలకు తొలి ఎలిమినేటర్ మ్యాచ్ ఆరంభం కానుంది.

హసరంగపై వేటు

అంపైర్ విమర్శల ఫలితం



దుబాయ్ : శ్రీలంక క్రికెట్ టీ20 కెప్టెన్ వానిందు హసరంగపై ఐసీసీ క్రమశిక్షణ కొరఢా ఝులిపించింది. అఫ్గనిస్థాన్‌తో మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయంపై వానిందు హసరంగ బహిరంగ విమర్శలు చేశాడు. శ్రీలంక బ్యాటర్ కామిందు మెండిస్‌కు అఫ్గాన్ బౌలర్ వఫదార్ సంధించిన ఓ బంతి.. నడుము కంటే ఎక్కువ ఎత్తులో దూసుకెళ్లింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఆ బంతిని నో బాల్‌గా ప్రకటించాలి. కానీ ఫీల్డ్ అంపైర్ లిండన్ హన్నిబాల్ నో బాల్‌గా ఇవ్వలేదు. చివరి మూడు బంతుల్లో శ్రీలంకకు 11 పరుగులు అవసరం కాగా 3 పరుగుల తేడాతో ఆ జట్టు ఓటమి చెందింది. మ్యాచ్ అనంతరం హసరంగ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇటువంటిది అంతర్జాతీయ మ్యాచ్‌లో జరుగకూడదు. ఆ బాల్ నడుముకు కాస్త అటు ఇటుగా వెళ్తే సమస్య లేదు. కానీ ఆ బంతి కొంచెం ఎత్తులో వెళ్తే ఏకంగా తలకే తగిలేలా దూసుకెళ్లింది. అది కూడా చూడలేకపోతే.. అంతర్జాతీయ మ్యాచ్‌కు అంపైర్‌గా చేసేందుకు పనికి రానట్టే. మరేదైన పని చూసుకోవాలి అంపైర్' అని హసరంగ విమర్శించాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం మ్యాచ్ అధికారులను వ్యక్తిగతంగా దూషించిన కారణంగా హసరంగపై మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత, రెండు మ్యాచుల నిషేధం విధించారు.

వెండితెరపై రాజకీయ సినిమాలు

నవచిత్రం




వెండితెరపై రాజకీయాంశాలను జొప్పించటం ద్వారా ప్రజలను ఒక పార్టీ వైపు ప్రభావితం చేయాలనే ప్రయత్నం చాలాకాలం నుంచి సాగుతోంది. నటీనటుల్లో కొందరు రాజకీయ ప్రవేశం చేసి, ప్రజా ప్రతినిధులుగా రాణించటమూ చూశాం. ఎన్టీ రామారావు, జయలలిత వంటి వారు సిఎంలు అవగా, దాసరి నారాయణరావు, చిరంజీవి కేంద్రమంత్రి పదవులను అలంకరించారు. 2019 ఎన్నికల సమయంలో మైనార్టీలను టార్గెట్ చేస్తూ బిజెపికి అనుకూలంగా 13 వరకూ సినిమాలు వచ్చాయి. అదే సమయంలో మతోన్మాదాన్ని, పెత్తందారీతనాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన సినిమాలూ ఉన్నాయి.

పొలిటికల్ 'వార్'

త్వరలో ఎన్నికలు రానుండటంతో సినిమా తెరపై పొలిటికల్ వార్ జోరందుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు మద్దతుగా వస్తున్న ఈ సినిమాలు కాకరేపుతున్నాయి. 2019 ఎన్నికలకు ముందు వచ్చిన 'యాత్ర' సినిమా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా తీశారు. ఆయన కాంగ్రెస్ నేతగా ఎదిగి, ముఖ్యమంత్రి అవ్వడం, ఆ తర్వాత పార్టీ అధినాయత్వం లొంగదీసుకునే ప్రయత్నాలను తిప్పికొట్టారంటూ చూపించారు. వాస్తవంగా రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ అధిష్టానానికి వీరవిధేయుడిగా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో వైఎస్ జగన్‌ను హైలెట్ చేస్తూ వచ్చిన సినిమా యాత్ర-2. వైఎస్ మరణం తర్వాత జగన్ సిఎం అయ్యే దాకా సాగిన రాజకీయ ప్రస్థానంపై ఈ సినిమా కథ సాగుతుంది. ఇందులో జగన్ కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరించిన ధీరుడు అన్న రీతిలో చూపించారు. ప్రతిపక్ష పార్టీల నేతలైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లాంటి వారి పాత్రలకు విలనిజాన్ని జోడించారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ తీసిన 'వ్యూహం' సినిమా మార్చి 1న, 'శపథం' సినిమా 8న విడుదల కానున్నాయి. ఈ రెండు సినిమాలు కూడా జగన్‌కు అనుకూలంగానూ, చంద్రబాబు, పవన్‌లకు





వ్యతిరేకంగా ఉంటాయనేది ట్రైలర్లను బట్టి చూస్తే తెలుస్తుంది. తాజాగా వచ్చిన 'రాజధాని ఫైల్' చిత్రం అమరావతినే రాజధాని చేయాలంటూ రైతుల పోరాటం నేపథ్యంలో ఈ సాగింది. ఇందులో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల తీరును ప్రస్తావించారు. వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ నటించారు.

గతంలో ...

రాజకీయ అంశాలను కేంద్రంగా చేసుకొని గతంలోనూ చాలా సినిమాలు వచ్చాయి. 1987లో వచ్చిన 'మండలాధీశుడు' సినిమాలో కోట శ్రీనివాసరావు ప్రధాన పాత్ర పోషించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వ్యవహార శైలిని, ప్రభుత్వం తీరునూ వ్యంగ్యంగా విమర్శించారు. కృష్ణ తీసిన 'ఈనాడు' సినిమా ఆ తరువాతి ఎన్నికల్లో తెలుగుదేశం విజయానికి కొంత దోహదపడిందని అంటారు. కృష్ణ కాంగ్రెస్‌లో చేరిన తరువాత తీసిన తన సొంత సినిమా సింహాసనం ఎన్‌టిఆర్‌కు వ్యతిరేకంగా తీశారు. నా పిలుపే ప్రంభంజనం సినిమాలోనూ కొన్ని డైలాగులు రాజకీయంగా ఎక్కుపెట్టారు. ప్రతినిధి, లీడర్, నేనే రాజు నేనే మంత్రి, ఆపరేషన్ దుర్యోధన, అధినేత వంటి సినిమాలు రాజకీయ ప్రధానంగా సాగాయి.

ఒకే ఒక్కడు సినిమాలో హీరో అర్జున్ ఒకరోజు ముఖ్యమంత్రి పాత్రను పోషించారు. అందులో ముఖ్యమంత్రికి ఓ జర్నలిస్టు - పాలనలో లోపాలు చూపిస్తే 'నువ్వు ఒక సిఎంగా ఉండు' అంటూ పదవి కట్టబెట్టం కూడా అప్పట్లో సరికొత్తదనమే. మోహన్‌బాబు నటించిన 'అసెంబ్లీ రౌడీ', విజయశాంతి నటించిన కర్తవ్యం సినిమాల్లో రాజకీయ వ్యవస్థ ఆధిపత్య ధోరణులను ఎత్తిచూపారు. హీరో, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి తీసే సినిమాలు ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపేలా ఉంటాయి. వంగవీటి, రక్త చరిత్ర-1, రక్త చరిత్ర 2, దేవినేని ఎన్‌టిఆర్, లక్ష్మీస్ ఎన్టీఆర్, యాత్ర వంటి



పొలిటికల్ బయోపిక్‌లతోపాటు రంగస్థలం, లెజెండ్, ప్రస్థానం, ఎంఎల్‌ఎ లాంటి రాజకీయ నేపథ్యం ఉన్న సినిమాలు వచ్చాయి. విజయ దేవరకొండ హీరోగా వచ్చిన నోటా సినిమాలో తమిళ రాజకీయం కనిపించింది. సినిమా దానికదే రాజకీయాలను నిర్దేశించలేదు కాదు కానీ, కొంతమేర ప్రచార సాధనంగా ఉపయోగపడుతుంది.

రాష్ట్రంలో లా వర్సిటీ ఏర్పాటు చేయాలి

- కర్నాటక తరహాలో న్యాయ విద్యార్థులకు, న్యాయవాదులకు రూ. 15,000
- ఆర్థిక సహాయం అందించాలి :ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్‌లో వక్తలు



నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్రంలో ప్రత్యేకంగా న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి కర్నాటక తరహాలో న్యాయ విద్యార్థులకు, న్యాయవాదులకు రూ. 15 వేల స్టైఫండ్ అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్ హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన న్యాయవాదులకు సంతాపాన్ని ప్రకటించారు. నాయకులు రమ్య, విగ్నేష్, స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కన్వెన్షన్‌కు ఐలు రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కోర్టుల్లో కేసులనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి కిందిస్థాయి కోర్టులను ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో అణగారిన వర్గాల విద్యార్థుల నుంచి న్యాయవిద్య వైపు వస్తున్న వారికి సరైన ప్రోత్సాహం లేక మధ్యలోనే ప్రాక్టీసు ఆపేస్తున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించాలన్నారు. న్యాయ విద్యలో ప్రస్తుతం సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కరిక్యులమ్‌ను తయారు చేసి ప్రవేశ పెట్టాలని తెలిపారు. నేడు దేశంలో 50 మిలియన్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటి పరిష్కారానికి సరిపడా న్యాయ వాదులు, న్యాయ స్థానాలు రాష్ట్రంలో, దేశంలో లేవని, కావున ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళా న్యాయవాది శైలజ మాట్లాడుతూ.. మహిళా విద్యార్థులకు వారు పనిచేస్తున్న దగ్గర, చదువుకుంటున్న దగ్గర వేధింపులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే మహిళలకు సరైన ప్రోత్సాహం అందించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.ఎల్. మూర్తి, టి. నాగరాజు మాట్లాడుతూ.. కేరళ, కర్నాటక తరహాలో రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో న్యాయ విద్యను అందించడానికి ప్రత్యేక న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులకు కేరళ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో నెలకు రూ. 15,000 స్టైఫండ్ రెండేండ్ల పాటు అందించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేశారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దమెర కిరణ్, దాసరి ప్రశాంత్, శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, రమేష్, అరవింద్, స్టాలిన్, హైదరాబాద్ జిల్లా నాయకులు సుష్మా, సహన, నందిని, భవన, శ్యామ్, అనిల్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ న్యాయ విద్యార్థుల కన్వీనింగ్ కమిటీని 25 మందితో ఎన్నుకున్నారు. కన్వీనర్ గా విగ్నేష్ కో- కన్వీనింగ్ గా డి.ప్రశాంత్, శ్రీకాంత్, ఎం. స్టాలిన్ రమ్య చౌహన్, స్టాలిన్ లు ఎన్నికయ్యారు. 11 తీర్మానాలు ఆమోదించారు.

ఫ్రాన్స్‌లో రైతుల ఆందోళన ఉధృతం

వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన వద్ద నిరసనలు





పారిస్: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల ఆదాయం పెరిగేలా చూడాలని, వ్యవసాయ ప్రతికూల పర్యావరణ చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఫ్రెంచ్ రైతులు గత కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళన అంతకంతకూ తీవ్రతరమవుతోంది. రైతుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు వ్యవసాయ ప్రదర్శనను ప్రభుత్వం అట్టహాసంగా పారిస్‌లో ఏర్పాటుచేసింది. రైతులు ఈ ఎగ్జిబిషన్‌ను కూడా ఆందోళన కేంద్రంగా మార్చారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించాల్సిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ నిరసనలకు భయపడి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం సెంట్రల్ పారిస్‌లో రైతులు భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఫ్రాన్స్‌లోకి ఇయు వ్యవసాయోత్పత్తులను డంప్ చేయడాన్ని ఆపాలని ఫ్రెంచ్ రైతులు నినదించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.